ముహూర్తం
శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ ఏకాదశి, సా.6.27 వరకు అనంతరం ద్వాదశి; నక్షత్రం: కృత్తిక ఉ.9.59 వరకు అనంతరం రోహిణి; అమృతకాలం: ఉ.7.50 నుండి 9.25 వరకు; వర్జ్యం: రా.1.41 నుండి 3.15 వరకు; దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48 వరకు, మ.2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు;

Estd. 1938
ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!

సంపుటి:57 • సంచిక:272 • గురువారం 17 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+12 • వెల: 5.00 • Published from:Hyderabad|Karimnagar|Nizamabad|Suryapet|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati |Kurnool|Anantapur|Nellore



లోటస్‌పాండ్‌లో కేటీఆర్-జగన్ ఫెడరల్ చర్చలు

- జాతీయ రాజకీయాల్లో మరో ముందడుగు
- తొలుత జగన్‌తో ఫోన్‌లో మాట్లాడిన కేసీఆర్
- ఆ తర్వాత జగన్‌తో కేటీఆర్ బృందం భేటీ
- లోటస్‌పాండ్‌లో చర్చలు.. స్నేహహస్తం
- తెలుగునాట కొత్త సమీకరణాలకు శ్రీకారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పే లక్ష్యంగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలని తలపెట్టిన టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మరో కీలక ముందడుగు వేసి తెలుగు రాజకీయాల్లో సరికొత్త సమీకరణలకు నాంది పలికారు. ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ చర్చల కోసం బుధవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, పార్లమెంటరీ పార్టీ ఉపనేత బి.వినోద్‌కుమార్, రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల శ్రవణ్‌రెడ్డిల బృందాన్ని పంపారు. సరిగ్గా మధ్యాహ్నం 12.50కు లోటస్‌పాండ్‌లోని జగన్ నివాసానికి వచ్చిన కేటీఆర్ బృందాన్ని వైఎస్సార్‌సిపి ప్రధానకార్యదర్శి విజయసాయిరెడ్డి నేతృత్వంలోని బృందం స్వాగతించింది. రెండుగంటలకు పైగా 2వ పేజీలో...


ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణస్వీకారం చేసిన ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కు స్వీట్ తినిపిస్తున్న సీఎం కేసీఆర్

ఫెడరల్ ఫ్రెండ్

ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాట్ల పరంపరలో భాగంగా వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు జగన్‌కు తెరాస అధ్యక్షుడు కేసీఆర్ ఫోన్ చేసి తన ఆలోచన చెప్పారు. వివరంగా మాట్లాడేందుకు వస్తామని చెబితే ఆహ్వానించారు. తప్పకుండా మాకు విశ్వాసం ఉంది. తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలపై ఉమ్మడిగా ఏవిధంగా పోరాడాలనే అంశంపై కేసీఆర్ - జగన్ త్వరలో కలిసినప్పుడు కూలంకషంగా చర్చిస్తారు.

- తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కేసీఆర్ ఫోన్‌లో మాట్లాడిన పిమ్మట తారక్ ఈ రోజు వచ్చి చర్చించారు. కేంద్రాన్ని నిలదీసేందుకు రాష్ట్రాలు ఒక వేదికమీదకు రావాలి. తెరాసతో జతకడితేనే ఏపీకి ప్రత్యేక హోదా సాధ్యమవుతుంది. ఏపీకి చెందిన 25 మంది ఎంపీలకు తోడు తెలంగాణ రాష్ట్రం నుంచి మరో 17 మంది ఎంపీలు జత అయితే మొత్తం 42 మంది రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించగలం. అప్పుడు కేంద్రం దిగిరాక తప్పదు.

- వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్



ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా చార్మినార్ ఎంఐఎం ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ బుధవారం సాయంత్రం 5 గంటలకు రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో అహ్మద్‌ఖాన్‌తో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉర్దూలో ప్రమాణ స్వీకార పత్రాన్ని చదివిన అహ్మద్ ఖాన్‌ను గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, హోంశాఖ మంత్రి 3వ పేజీలో...

నేటి నుంచి సభాపర్వం

- ఉదయం 11.30కు సమావేశాలు ప్రారంభం
- ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారంతో మొదలు
- స్పీకర్ ఎన్నికకు నేడు నోటిఫికేషన్
- 19న ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం
- 20న ధన్యవాద తీర్మానంపై సభలో చర్చ
- తీర్మానం ప్రవేశపెట్టేది అసెంబ్లీలో కొప్పుల, మండలిలో పల్లా

3 లో



సెంచరీ కొట్టాలి!

నెలాఖరులో బెజవాడలో జగన్‌తో భేటీ

- ఆ దిశగా పక్కా వ్యూహం
- కీలక తరుణంలో జగన్‌తో చర్చలు
- త్వరలో హైదరాబాద్ రానున్న అఖిలేష్
- ఇద్దరితో కలిస్తే ఎంపీల బలం... శతకం?

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గులాబీదళపతి కల్వకుంట్ల చంద్రశేఖర్ ఫెడరల్ ఫ్రంట్ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వేస్తున్న అడుగులు ఫలప్రదమవుతున్నాయి. ఇప్పటికే ఒడిశా సీఎం నవీన్‌పట్నాయక్ తాను ఎన్‌డీఏలో కానీ యూపీఏలో కానీ చేరబోనని, రెండింటికీ సమదూరం పాటిస్తానంటూ కేసీఆర్ ఫార్ములానే ప్రకటించగా, మరో వైపు ఉత్తరప్రదేశ్‌లో కేసీఆర్ ప్రతిపాదించిన తరహా పొత్తులనే ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, బీఎస్పీ అధినేత మాయావతి కుదుర్చుకున్నారు. వీరిద్దరూ ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్‌లకు సమదూరం పాటిస్తున్నారు. ఇప్పటికే కేసీఆర్-అఖిలేష్‌ల మధ్య భేటీ జరగ్గా, ఫోన్‌లో పరస్పర సంప్రదింపులు గత ఏడెనిమిది మాసాలుగా 2వ పేజీలో...


తిరువనంతపురంలోని శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో మంగళవారం ప్రధాని మోడీ

సీఎల్పీ నేతపై అర్ధరాత్రి కసరత్తు

రేసులో ఐదుగురు

- ఉత్తమ్, భట్టీ పోటాపోటీ
- కోర్‌కమిటీ భేటీలో అభిప్రాయ సేకరణ
- అధిష్టానం దూతగా వేణుగోపాల్




హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత ఎంపిక వ్యవహారం ఆసక్తికరంగా మారింది. సీఎల్పీ సమావేశం గురువారం జరగనుండగా బుధవారం రాత్రి కాంగ్రెస్ కోర్‌కమిటీ భేటీ అయ్యింది. శాసనసభా వ్యవహారాలపై పట్టున్నవారికి అవకాశం ఇవ్వాలని అభిప్రాయపడ్డప్పటికీ శాసనసభ్యుల మద్దతు ఎవరికన్న దానిపై అధిష్టానం 3వ పేజీలో...

పండుగ పిలిచింది.. మృత్యువు మింగింది



5

- సొంత ఊరు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- మరో రెండు వాహనాలను ఢీకొట్టిన కారు
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి దుర్మరణం.. ఆరుగురికి గాయాలు
- సూర్యాపేట జిల్లాలో దుర్ఘటన
- మృతులంతా నూజివీడు వాసులు

స్పీకర్‌పై వీడని ఉత్కంఠ

- ఆరుగురి పేర్ల పరిశీలన.. అందరితో స్వయంగా మాట్లాడిన కేసీఆర్
- పరిశీలనలో పోచారం, ఇంద్రకరణ్, పద్మాదేవేందర్‌రెడ్డి పేర్లు
- సీనియర్లతో నేడు భేటీ.. నిర్ణయం
- బీసీ వర్గానికి డిప్యూటీ స్పీకర్ పదవి

3 లో

చంద్రుడిపై చైనా మొక్క



9 లో

- మొలకెత్తిన పత్తి విత్తనాలు
- చంద్రమండలంపై అద్భుత ఆవిష్కరణ



అస్వస్థతతో న్యూయార్క్‌కు అరుణ్ జైట్లీ

- కేన్సర్ చికిత్స కోసం రెండు వారాలు అమెరికాలో

9 లో

స్వైన్‌ఫ్లూతో ఢిల్లీ ఎయిమ్స్‌లో అమిత్‌షా



అగ్రవర్ణ పేదలకు తాంబూలం

- కేంద్రానికి మించిన ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయం
- 10% అదనపు రిజర్వేషన్లకు ప్రణాళిక
- కొత్త చట్టం వెసులుబాటుపై న్యాయనిపుణులతో సమాలోచన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వానికి మించిన ప్రాధాన్యతలతో తెలంగాణ ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు ప్రత్యేక పథకాలను, అదనపు రిజర్వేషన్లను అమలు చేయాలని నిర్ణయించింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త చట్టం వెసులుబాటును దృష్టిలో పెట్టుకుని కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. విద్య, ఉద్యోగాల్లో కేంద్రం ఇస్తున్న 10శాతం రిజర్వేషన్లకు అదనంగా లబ్ధి చేకూర్చి తెలంగాణ ప్రత్యేకతను నిలుపుకోవాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నిజానికి గత ఏడాది జూన్‌లోనే అగ్రవర్ణ పేదలకు ఏదైనా చేయాలని తన మదిలో ఉన్న ఆలోచనను కేసీఆర్ బహిర్గతపరిచారు. ఈ ఏడాది రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తన ఆలోచనను 5వ పేజీలో...

ఫెడరల్ ఫ్రెండ్



(మొదటిపేజీ తరువాయి)

జగన్‌తో కేటీఆర్ బృందం చర్చలు జరిపింది. రాష్ట్రాల హక్కుల కోసం జాతీయ స్థాయిలో సమాఖ్య స్ఫూర్తిని నిలిపేందుకు ప్రాంతీయ పార్టీలు కలవాల్సిన అవసరముందని, ఈ క్రమంలో కేసీఆర్ ప్రతిపాదించిన ఫెడరల్ ఫ్రంట్‌లో చేరాలని కేటీఆర్ ఆహ్వానించినట్లు తెలిసింది. ఇక ఇదే సమయంలో ఏపీ రాజకీయాలపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రాథమిక అంశాలు చర్చించేందుకు తాను వచ్చానని, మిగతా అంశాలు తమ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ఏపీకి వచ్చి చర్చిస్తారని చెప్పారు. లంచ్ అనంతరం ఇటు వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలు, అటు టీఆర్ఎస్ ముఖ్యనేతల సమక్షంలోనే చర్చలు జరగ్గా భేటీ అనంతరం ఇరువురు నేతలు మీడియాతో మాట్లాడి చర్చల సారాన్ని వివరించారు.

ఏపీలో కేసీఆర్, జగన్ భేటీ

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు దగ్గరగా జాతీయ వ్యవస్థ ఉండాలన్నారు. ఈ చర్చలను మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేసీఆర్ స్వయంగా వెళ్ళి జగన్‌తో చర్చిస్తారన్నారు. ఏపీకి ప్రత్యేకహోదా అంశంపై మా వైఖరిని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సహా రాజ్యసభలో మా పార్టీ ఫ్లోర్‌లీడర్ కే.కేశవరావు, లోక్‌సభలో కవిత పలు సందర్భాల్లో స్పష్టం చేశారు.. అప్పటి ప్రధాని లోక్‌సభలో ఇచ్చిన మాట నిలబెట్టాలని మేం చెప్పాం. ఇపుడు జరిగింది కేవలం మొదటి సమావేశం మాత్రమే. మిగతా అంశాలన్నింటినీ కేసీఆర్-జగన్ కలిసిన తర్వాత కూలంకషంగా మాట్లాడతారు. తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలపై ఉమ్మడిగా ఏవిధంగా పోరాడాలనే అంశాలపై చర్చిస్తారు అని కేటీఆర్ చెప్పారు.

కేసీఆర్‌తో భేటీ తరువాత మరో నాలుగు అడుగులు వేస్తాం

కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ పేరుతో ఒక జాతీయప్లాట్‌ఫాం ఏర్పాటు చేశారు. ఎంపీలపరంగా ఏకం చేసి రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ముందుకెళ్ళడం హర్షించదగ్గ విషయం. కేసీఆర్ గారు ఫోన్‌లో మాట్లాడారు. ఈ అంశంపై మరోసారి చర్చలకు వస్తానన్నారు. కేసీఆర్ చెప్పిన అంశాలను పార్టీలో సుదీర్ఘంగా చర్చించి రాబోయేరోజుల్లో మరింత ముందుకు తీసుకువెళ్ళే విషయంలో నాలుగు అడుగులు ముందుకు వేస్తాం. అపుడే రాష్ట్రాలకు మేలుజరిగే పరిస్థితి రావాలి అని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు విజయసాయిరెడ్డి, వైవీసుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, పార్థసారథి, మిథున్‌రెడ్డి పాల్గొన్నారు.

సెంచరీ కొట్టాలి!



(మొదటిపేజీ తరువాయి)

సాగుతున్నాయి. ఈనెలలో కేసీఆర్‌ను స్వయంగా వచ్చి కలుస్తానని ఇప్పటికే అఖిలేష్‌యాదవ్ ప్రకటించారు. ఇక తాజాగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన కేసీఆర్ చర్చలకోసం తనయుడు, పార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆయన ఇంటికి పంపారు. ఆంధ్రప్రదేశ్‌లోని 25సీట్లకు మరో 17సీట్లు అదనంగా చేరడం సంతోషాన్ని కలిగిస్తుందని, ఆంధ్రప్రదేశ్ హక్కులపై పార్లమెంట్ సాక్షిగా ప్రశ్నించేందుకు ఇది తోడవుతుందని వైఎస్ జగన్ ప్రకటించారు. ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదనను స్వాగ తిసున్నట్లు చెప్పారు. త్వరలో కేసీఆర్-జగన్‌ల భేటీ జరిగితే ఈ వ్యవహారంలో మరింత స్పష్టత రానుంది. జాతీయస్థాయిలో అటు ఎన్‌డీఏ, ఇటు యూపీఏలకు సమదూరం పాటించే పార్టీలతో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలని కేసీఆర్ భావించగా తెలుగురాష్ట్రాల్లోని 42సీట్లతో పాటు ఉత్తర ప్రదేశ్‌లో 60నుండి 70సీట్లలో ప్రభావం చూపు తామని, ఎన్నికల అనంతరం ఒడిశా సీఎం కూడా ఇటువైపే ఉంటారని ఈ క్రమంలో 100 నుండి 150సీట్లతో ప్రధానఫోర్స్‌గా ఇది అవతరించడం ఖాయమని టీఆర్ఎస్ వర్గాలు ధీమాను వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల అనంతర పరిస్థితుల్లో మరికొన్ని పార్టీలు, వ్యక్తులు ఇటువైపు వస్తారని ఏ లెక్కన చూసినా కేసీఆర్ లెక్కలన్నీ ఫలప్రదమయ్యే వాతావరణం, ఫలించే వాతావరణమే ఎక్కువగా ఉందని టీఆర్ఎస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇక ఏపీ రాజకీయాల విషయంలో కేసీఆర్ వ్యూహాలు క్లియర్‌గా ఉన్నాయని, త్వరలోనే వాటి ప్రభావం తెలుస్తుందని ధీమాగా చెబుతున్నారు.

బెజవాడలోనే భేటీ

వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డితో ముఖ్యమంత్రి కేసీఆర్ విజయవాడలోనే భేటీకావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరులో లేదా ఫిబ్రవరి మొదటివారంలో ఈ భేటీ జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం జగన్, కేటీఆర్‌ల మధ్య జరిగిన భేటీకి సంబంధించి ఫీడ్‌బ్యాక్‌ను ఆధారంగా చేసుకుని తదుపరి వ్యూహాన్ని రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఏపీలో చంద్రబాబుకు చెక్‌పెడతామని, రిటర్న్‌గిఫ్ట్ ఇస్తామంటూ పలువార్లు ప్రకటించిన కేసీఆర్ ఏ రూపంలో ఏపీ రాజకీయాలపై ప్రభావం చూపుతారోనన్న ఆసక్తి రాజకీయవర్గాల్లో ఉంది. ఇక ఈనెల 21నుండి 25వ తేదీవరకు ఎర్రవెల్లిలోని తన ఫామ్‌హౌజ్‌లో నిర్వహించనున్న సహస్ర చండీయాగానికి వైఎస్ జగన్‌ను ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో ఆంధ్రాప్రజలు సెటిలర్లు టీఆర్ఎస్‌వైపే మొగ్గు చూపారని, ఏపీ ప్రజల్లో కేసీఆర్ పట్ల సానుకూలతే ఉందని టీఆర్ఎస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ క్రమంలో కేసీఆర్ జగన్ భేటీ సానుకూల ఫలితాలే తెస్తుందన్న ఆశాభావం ఆయావర్గాల్లో వ్యక్తమవుతోంది.



తెరాసతో జతకడితేనే బలం.. హోదా సాధ్యం : వైఎస్ జగన్

కేటీఆర్‌తో భేటీ అనంతరం వైకాపా అధినేత జగన్ మీడియాతో మాట్లాడి అనేక విషయాలు వెల్లడించారు. కేసీఆర్ ఫోన్‌లో మాట్లాడిన పిమ్మట తారక్ ఈరోజు వచ్చి చర్చించారు. ఫెడరల్ ఫ్రంట్‌తో పాటు రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయం గురించి చర్చించాం. రాష్ట్రాలు అన్యాయానికి గురికాకుండా కేంద్రాన్ని నిలదీసేందుకు రాష్ట్రాలు ఒక వేదికమీదకు రావాలి. లేకుంటే రాష్ట్రాల హక్కులు సాధించలేం. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇస్తామని పార్లమెంట్ సాక్షిగా చేసిన హామీకే దిక్కూదివాణం లేదు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే రాష్ట్రాల పరిధిలో, ఎంపీల సంఖ్యాపరంగా చూస్తే దానిని అధిగమించే పరిస్థితి ఉండదు. కాబట్టి మన రాష్ట్రానికి చెందిన 25మంది ఎంపీలకు తోడు పక్కన తెలంగాణ రాష్ట్రం నుండి మరో 17మంది ఎంపీలు జత అయితే మొత్తం 42మంది రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించగలిగితే పార్లమెంట్ సాక్షిగా చెప్పిన మాట అని చెప్పగలిగితే కేంద్రం దిగివస్తుంది అని వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. లోటస్‌పాండ్‌లో కేటీఆర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఇది స్వాగతించాల్సిన విషయం.. రాష్ట్రాల హక్కులు కాపాడబడాలంటే సంఖ్యాపరంగా నెంబర్ పెరగాలి. రాష్ట్రాల బలం పెరిగితే అపుడు రాష్ట్రాలకు అన్యాయం చేసే విధంగా కేంద్రం నడుచుకోవడానికి వెనకడుగు వేస్తుంది అని అన్నారు.



లైక్‌మైండెడ్ వ్యక్తులతో కలుస్తాం : కేటీఆర్

టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ గత ఏడాదికాలంగా దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకువచ్చేందుకు, కేంద్రం తన వద్ద అధికారాలను పెట్టుకుని రాష్ట్రాలను ఇబ్బంది పెడుతున్న విధానానికి వ్యతిరేకంగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ఇందులో భాగంగానే కోల్‌కతా వెళ్ళి మమతాబెనర్జీని, ఒడిశాలో బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్‌ను, కర్నాటకలో దేవెగౌడ, కుమారస్వామిలను, చెన్నైలో డీఎంకె అధినేత స్టాలిన్‌లను,, ఛత్తీస్‌గడ్ మాజీ సీఎం అజిత్‌జోగితోనూ, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్‌తోనూ చర్చలు జరిపారన్నారు. ఆ పరంపరలో భాగంగానే వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌కు ఫోన్‌చేసి తన ఆలోచన చెప్పారని అన్నారు. వివరంగా మాట్లాడేందుకు వస్తామని చెబితే ఆహ్వానించారన్నారు. తప్పకుండా మాకు విశ్వాసముంది.. లైక్‌మైండెడ్ పీపుల్ కలిసి రాష్ట్రాలను శక్తివంతం చేయడానికి, భవిష్యత్తులో సందర్భానుసారంగా రాష్ట్రాల హక్కులను కాపాడడానికి ముందుకు వెళతాం అని కేటీఆర్ అన్నారు.

ఆ భేటీ అవకాశవాదమే



కేంద్రంలో భాజపా వ్యతిరేక ఓట్లను చీల్చే కుట్రలో భాగంగానే ఫెడరల్ ఫ్రంట్ నాటకం ఆడుతున్నారని తెలుగుదేశం పార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కళా వెంకట్రావు దుయ్యబట్టారు. ఫెడరల్ ఫ్రంట్ ముసుగులో మోడీ సేవ చేస్తున్నారని, కేసుల మాఫీ కోసం జగన్, భారీ కుంభకోణాలను కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేటీఆర్, కేసీఆర్ భేటీలు, కుట్రలను ఆంధ్రులు తిప్పికొడతారన్నారు.

మోడీ కోసమే ఈ డ్రామా



సీఎం కేసీఆర్, ప్రధాని మోడీకి సహకరించేందుకు ఫెడరల్ ఫ్రంట్ పేరుతో కొత్త నాటకానికి తెర తీశారని, ఈ ఫ్రంట్ ముసుగులో భాజపాకు తెరాస, వైకాపా బీ టీమ్‌లుగా వ్యవహరిస్తున్నాయని స్పష్టమవుతోందని టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ దుయ్యబట్టారు. దేశంలోనే అత్యంత అవినీతిపరుడు జగన్ అని ఆరోపణలు గుప్పించిన కేసీఆర్ ఇప్పుడు ఆయనతో కలిసి ఎలా జత కడతారని ఆయన ప్రశ్నించారు.

హోదా వ్యూహం.. ఫలప్రదం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలన్న డిమాండ్‌కు బలం పెరుగుతూ వస్తోంది. ప్రత్యేకహోదా అంశాన్ని సజీవంగా నిలిపి సాధనకోసం అలుపెరగని పోరాటాలు చేస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి టీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం తొలిసారి లోటస్‌పాండ్‌లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏపీ ప్రతిపక్షనేత జగన్‌ను కలిశారు. జగన్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో జగన్, కేటీఆర్‌తోపాటు ఇరు పార్టీలకు చెందిన కొందరు ముఖ్యనేతలు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాలమేరకు ఆయన తనయుడు కేటీఆర్ ఈ సమావేశానికి లీడ్‌రోల్ తీసుకోనున్నారు. అంతకుముందు సీఎం కేసీఆర్ స్వయంగా జగన్‌కు ఫోన్‌చేసి సమావేశంలో చర్చించాల్సిన అజెండాను జగన్‌కు తెలియపరిచారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో జాతీయ రాజకీయాల్లో కేసీఆర్ సారథ్యం వహించబోతున్న ఫెడరల్ ఫ్రంట్ అంశంపై చర్చ జరిగింది. ఫెడరల్ ఫ్రంట్ ఆవశ్యకత, కేంద్రం పెత్తనంనుంచి రాష్ట్రాల హక్కులను కాపాడుకోవటం, రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాన్ని సమష్టిగా ఎదుర్కోవటం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్టు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. సమావేశం అనంతరం కేటీఆర్ ఏపీ ప్రత్యేక హోదాకు జైకొట్టారు. తమ పార్టీ ఎంపీలు కవిత, కేశవరావు ఇటు లోక్‌సభలోనూ అటు రాజ్యసభలోనూ ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు గుర్తు చేశారు.

జగన్ తొలి విజయం

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ పార్టీకి , ఏపీలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీకి మధ్య రాజకీయంగా పరస్పర సహాయ సహకారాల మాట ఎలా ఉన్నా ప్రత్యేకహోదా అంశంపట్ల టీఆర్ఎస్ పార్టీ మద్దతు పొందటంలో ఏపీ ప్రతిపక్షనేత జగన్ తొలివిజయం సాధించారు. ఇప్పటివరకూ ప్రత్యేక హోదాపై మరే ఇతర రాష్ట్రం లేదా మరే పార్టీ కూడా జగన్‌తో గొంతు కలపలేదు. ప్రత్యేక హోదా అంశాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తొలినుంచి ఉద్యమాల ద్వారా కాపాడుకుంటూ వచ్చింది. పార్టీ అధినేత జగన్ కూడా ప్రత్యేక హోదాను సజీవంగా నిలిపేందుకు పార్టీ ఎంపీలతో కడా త్యాగాలు చేయించారు. 2014 లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల, కర్నూలు , కడప, రాజంపేట, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు అరకు తోపాటు ఖమ్మం పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించింది. అయితే ఆ తరువాత నంద్యాల ఎంపీ ఎస్పీవై రెడ్డి, కర్నూలు ఎంపి బుట్టా రేణుక, అరకు ఎంపీ గీత వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. తెలంగాణలో ఖమ్మం ఎంపీ శ్రీనివాసరెడ్డి కూడా టీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలుగుదేశం, జనసేన పార్టీలతో కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేసి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రజలకు హామీలు ఇచ్చిన బీజేపీ అధికారంలోకి రాగానే మాట మార్చింది. ఏపీకి ప్రత్యేకహోదా కుదరదని ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వనున్నట్టు ప్రకటించింది. అధికార తెలుగుదేశం పార్టీ కూడ ప్యాకేజీని స్వాగతించింది. ఈ దశలో ప్యాకేజీని తిరస్కరిస్తూ ప్రత్యేకహోదాకోసం ఉద్యమించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పలు రూపాల్లో ఉద్యమాలు చేస్తూ వచ్చింది. పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం కూడా పెట్టింది. చివరకూ జగన్ ప్రత్యేకహోదాను దేశ ప్రజల్లో సజీవంగా నిలిపేందుకు పార్టీలో మిగిలిన ఐదుగురు ఎంపీలతో లోక్‌సభకు రాజీనామాల ద్వారా త్యాగాస్త్రాలను ప్రయోగించారు. త్వరలో తిరిగి ఎన్నికలు రాబోతున్న తరుణంలో ఏపీలోని 25సీట్లలో మెజారిటీ స్థానాలు గెలుస్తామన్న ధైర్యంతో జగన్ ప్రత్యేకహోదా ఇచ్చేవారికే కేంద్రంలో మద్దతు తెలుపుతామంటూ స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 17 లోక్‌సభ స్థానాల్లో కూడా టీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలుస్తుదన్న భరోసాతో సీఎం కేసీఆర్ తన తనయుడు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేత ప్రత్యేకహోదాకు సహకారం అందిస్తామని ప్రకటించారు. అటు ఏపీలో 25 ఇటు తెలగాణలో 17 స్థానాల్లో మెజారిటీ స్థానాలు గెలిచి తెలుగురాష్ట్రాల్లో ఫెడరల్ ఫ్రంట్‌కు బలం పెరిగితే అది జగన్ నేతృత్వంలో ప్రత్యేక హోదా డిమాండ్ మరింత శక్తివంతం అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



కీలక నేతలతో జగన్ చర్చలు

టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో చర్చలు జరిపేందుకు జగన్ అంతకు ముందు పార్టీలోని కీలక నేతలతో ప్రాథమికంగా చర్చించినట్టు సమాచారం. తన చిన్నాన్న మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, జగన్‌ను కోటరీలోని మరో ముఖ్యనేత రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, జగన్ మిత్రుడు రాజంపేట మాజీ ఎంపీ మిథున్‌రెడ్డి, జగన్ రాజకీయ సలహాబృందంలో ముఖ్యనేతగా ఉన్న పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి పార్థసారథి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాత్రమే పాల్గొన్నారు. ఇదే అంశంపై మరో మారు పార్టీ ముఖ్యనేతల సమావేశంలో చర్చించాలని జగన్ నిర్ణయించారు.

ఫ్యామిలీల కోసమే..



బీజేపీ, కాంగ్రెస్ రహిత ఫ్రంట్‌ల కోసం తెలుగు రాష్ట్రా ల సీఎంలు చేస్తున్న ప్రయత్నాలు ప్రజల కోసం కాదని, కేవలం ఫ్యామిలీల కోసమని బీజేపీ అధ్యక్షుడు కె. లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. గతంలో ఫ్రంట్‌లన్నీ టెంట్‌లు లేకుండా మిగిలిపోయాయని, విఫల ప్రయోగాలయ్యాయన్నారు. ప్రాంతీయ పార్టీల పేరుతో కుటుంబ పార్టీలన్నీ ఏకమై కుటుంబ ప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నాయని మండిపడ్డారు.

అక్కడ అసంతృప్తి.. ఇక్కడ సంతోషం..

ఏపీలో టీడీపీ పాలనపై జనం విసుగు: తలసాని



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం ప్రభుత్వం పనితీరు పట్ల అసంతృపితో ఉన్నారని తెలంగాణ రాష్ట్ర మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. తెదేపా పాలన మరో మూడు నెలలు మాత్రమే ఉంటుందని, ఆ పార్టీకి ఖచ్చితంగా రిటర్న్ గిఫ్ట ఇచ్చి ప్రజలు తిరిగి పంపుతారని ఆయన పేర్కొన్నారు. 400 ఏళ్ళ క్రితం నిర్మితమైన హైదరాబాద్‌ను కూడా తానే నిర్మించానని చెప్పుకుంటున్న చంద్రబాబు ఏపీ రాజధానిని ఎందుకు నిర్మించలేదని ఆయన ప్రశ్నించారు. ఆంధ్రాలో బడుగు, బలహీన వర్గాలకు సరైన నాయకత్వం లేని కారణంగా ఎంతో నష్టపోతున్నారని ఆయన వెల్లడించారు. తెలుగు రాష్ట్రాలలో రాజకీయ పార్టీలకు యాదవులు కేవలం ఎన్నికల సమయంలోనే గుర్తుకువస్తారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో యాదవులంతా సంఘటితంగా రాజకీయంగా ఎదగాల్సి వుందని పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడానికి వెళ్లిన తలసాని విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకొని వచ్చారు.

టిఆర్ఎస్ పాలనలో ప్రజలందరూ సంతోషం

ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలోని టిఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తలసాని పేర్కొన్నారు. అభివృద్ధి పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలచిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేసిన టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనను మెచ్చిన ప్రజలు తిరిగి అధికారం కట్టబెట్టరని తెలిపారు. 24 గంటల విద్యుత్, డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం, పెద్ద ఎత్తున ఇరిగేషన్ ప్రాజెక్టులు, రైతు బందు, గొర్రెల పంపిణీ వంటి కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు.

ఇదిగో బ్యాట్... ఆటాడండి!



ముంబై: మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావుకు క్రికెట్ బ్యాట్ బహుమతిగా అందజేస్తున్న ఆస్ట్రేలియా న్యూసౌత్ వేల్స్ రాష్ట్ర గవర్నర్ డేవిడ్ హర్లే.

జగన్‌తో కేసీఆర్ కలవడం అప్రజాస్వామికం

- ముగ్గురు మోడీలను తరిమికొడతాం
- భాజపాయేతర పార్టీలతో పొత్తుకు సై
- కలిసొస్తే పవన్‌తోనైనా: ఏపీ సీఎం చంద్రబాబు



తిరుపతి, ప్రభన్యూస్: రానున్న ఎన్నికల్లో తాము ఏ పార్టీతో పొత్తులు పెట్టుకొని ఎన్నికల రంగంలోకి దిగతామనేది త్వరలో వెల్లడిస్తానని, పవన్ సహ కలిసొస్తే బీజేపీయేతర పార్టీలన్నిటితో ఎన్నికల రంగంలో దిగేందుకు తాము సిద్ధమేనని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారిని ప్రోత్సహించేందుకు ప్రజలు సిద్ధంగా లేరని, జగన్‌కు తోడు కేసీఆర్ కలవడం అప్రజాస్వామికమని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. ఇలాంటి వారిని ప్రజలు రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.75 వేల కోట్లు ఇంకా నిధులు రావాలన్న విషయాన్ని తామేగాక, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూడా స్పష్టం చేశారని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంపై కక్షగట్టిన మోడీతో జగన్ ఎలా చెలిమి చేస్తారని, కేవలం ఆయన అవినీతి కేసుల నుంచి బయటపడేందుకే దోస్తీ కట్టారన్నారు. దీనికి తోడు కేసీఆర్ కూడా మోడీ, జగన్‌తో జతకట్టి రాష్ట్ర అభివృద్ధికి అడ్డుతగులుతున్నారని, ఈ ముగ్గురు మోడీలు కలిసి దుష్టశక్తుల్లా రాష్ట్ర ప్రయోజనాలను అడ్డుకుంటున్నారని చంద్రబాబు పేర్కొన్నారు.

షర్మిల వ్యాఖ్యలు కరెక్ట్ కాదు

జగన్ సోదరి షర్మిల వ్యాఖ్యలు సరికాదని, ఓ మహిళగా ఆమెకు అన్యాయం జరిగివుంటే దాన్ని ఏపీ పోలీసులకు ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని, ఇది చేయకపోగా ఆంధ్రా పోలీసులపై తమకు నమ్మకం లేదని, తెలంగాణ పోలీసులను ఆశ్రయించడంలో ఆంతర్యమేమిటని చంద్రబాబు సూటిగా ప్రశ్నించారు. ఆమె హైదరాబాద్‌లో వుంటూ ఏపీ పోలీసులపై నమ్మకం లేదని చెప్పడం విడ్డూరంగా వుందన్నారు. రాష్ట్రప్రజా పోలీసు వ్యవస్థపై జగన్‌కు, ఆయన సోదరి షర్మిలకు నమ్మకం లేకపోతే మరి ఎన్నికల్లో ఈ రాష్ట్రంలో ఎలా పోటీ చేస్తారంటూ చంద్రబాబు గట్టిగా నిలదీశారు. జగన్ కోడికత్తి కేసు కూడా ఎన్ఐఏకు ఇవ్వడం సరికాదని చంద్రబాబు పేర్కొన్నారు.

ముగ్గురు మోడీలు ముసుగు తీశారు!



అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షనేత జగన్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశంపై పలువురు తెదేపా నేతలు, ఏపీ మంత్రులు మండిపడుతు న్నారు. తెలంగాణాలో జగన్‌ని అడ్డుకున్న టీఆర్ఎస్‌తో ఎలా కలుస్తారని నేతలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏపీపై సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను నేతలు ఇప్పుడు గుర్తుచేస్తున్నారు. ఏపీకి అన్యాయం చేస్తున్న వాళ్లతో జగన్ ఎలా చేతులు కలుపుతాడని నిలదీస్తున్నారు. ఈ సందర్భంలో జగన్, కేటీఆర్ భేటీపై మంత్రి లోకేష్ మొదటి సారి ట్విట్టర్ వేదికగా స్పందించారు. "ఢిల్లీ మోడీ, ఆంధ్రా మోడీ, తెలంగాణ మోడీ ఒక్కటయ్యారు. ఇంతకాలం వీరి మధ్య ఉన్న చీకటి ఒప్పందం ఇప్పుడు బహిర్గతం అయ్యింది. నాలుగున్నర ఏళ్లపాటు విభజన చట్టం ప్రకారం అనేక అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌కి రావాల్సిన వాటా దక్కకుండా అడ్డుపడుతున్న కేసీఆర్ గారితో కలిసి జగన్ ఆంధ్రా ద్రోహుల ఫ్రంట్ ఏర్పాటు చేశారు. లంకలో పుట్టిన వాళ్ళంతా రాక్షసులు, ఆంధ్రాలో పుట్టిన వాళ్లంతా వారి వారసులు అని ఆంధ్రులను అవమానించిన కేసీఆర్‌గారు, ఆంధ్రా బిర్యానీ పేడలా ఉంటుంది అని అవహేళన చేసిన కేసీఆర్‌గారితో జగన్ మోడీ రెడ్డి జత కట్టారు" అని ట్వీట్ చేశారు.

నేటినుంచి సభాపర్వం



- ఉదయం 11.30కు సమావేశాలు ప్రారంభం
- 20వ తేదీతో ముగింపు
- ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారంతో మొదలు
- ప్రమాణం చేయించనున్న ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్
- స్పీకర్ ఎన్నికకు నేడు నోటిఫికేషన్... ఏకగ్రీవానికే అవకాశం
- 19న ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం
- 20న ధన్యవాద తీర్మానంపై చర్చ
- శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశ పెట్టనున్న మాజీ చీఫ్‌విప్ కొప్పుల
- మండలిలో విప్ పల్లాకు ఆ బాధ్యత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర శాసనసభ నేడు కొలువుదీరనుంది. రెండోసారి అధికారాన్ని చేజిక్కించుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం, శాసనసభ్యుల ప్రమాణ స్వీకారంతోపాటు సభాపతి ఎన్నిక, ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం కోసం నాలుగు రోజులపాటు శాసనసభ సమావేశాలు జరుగనున్నాయి. గురువారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశాలు 20వ తేదీతో ముగుస్తాయి. గురువారం ఉదయం 11 గంటలకు సీఎం కేసీఆర్‌తోపాటు తెరాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తారు. 11.05 గంటలకు సీఎం కేసీఆర్ శాసనసభకు చేరుకుని నాలుగు రోజులపాటు నిర్వహించేశాసనసభా కార్యక్రమాలను సమీక్షిస్తారు. 11.30 గంటల నుంచి తాత్కాలిక స్పీకర్ (ప్రొటెం స్పీకర్) ముంతాజ్ అహ్మద్‌ఖాన్ నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. రెండు గంటలపాటు కొనసాగే ఈ కార్యక్రమంలో తొలుత సభా నాయకుడైన సీఎం కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేస్తారు. అనంతరం అక్షరక్రమం ప్రకారం మిగతా ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేస్తారని శాసనసభ సచివాలయం తెలిపింది. ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిశాక శాసనమండలి ఆవరణలోని లాన్‌లో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఉదయమే స్పీకర్ ఎన్నికకు శాసనసభ కార్యదర్శి నోటిఫికేషన్ జారీ చేస్తారు. సాయంత్రం 5 గంటల వరకు స్పీకర్ ఎన్నికకు సంబంధించిన నామినేషన్లు (నామపత్రాలు) స్వీకరిస్తారు. ఒకవేళ ఎన్నిక అనివార్యమైతే శుక్రవారం ఉదయం స్పీకర్ ఎన్నికకు సంబంధించిన ప్రక్రియను నిర్వహిస్తారు. శుక్రవారం (18వ తేదీ) స్పీకర్ ఎన్నిక పూర్తయ్యాక ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్, సీఎం కేసీఆర్ కొత్త స్పీకర్‌ను ఆయన స్థానంలో కూర్చోబెట్టి సభా కార్యక్రమాలను నిర్వహించాలని కోరతారు. 19వ తేదీన శాసనసభ ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ప్రసంగిస్తారు. అనంతరం సభ వాయిదా పడుతుంది. 20వ తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం జరుగుతుంది. శాసనసభలో మాజీ చీఫ్‌విప్, సీనియర్ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెడతారు. శాసనమండలిలో విప్‌గా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. ఈ ఇరువురి పేర్లను కేసీఆర్ ఇప్పటికే ఖరారు చేసినట్టు తెలుస్తోంది.



వ్యూహాత్మకంగా ముంతాజ్ ఖాన్ ఎంపిక

వ్యూహాత్మకంగానే ప్రొటెం స్పీకర్ చార్మినార్ ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌ను సీఎం కేసీఆర్ ఎంపిక చేసినట్టు ప్రచారం జరుగుతోంది. గతంలో ఐదు దఫా లు యాకుత్‌పుర, ఈ ఎన్నికల్లో చార్మినార్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ముంతాజ్ అహ్మద్ ఖాన్ విజయం సాధించారు. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో మిత్రపక్షమైన ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే ముంతాజ్ ఖాన్‌ను తాత్కాలిక స్పీకర్‌గా నియమించడం అన్ని విధాలా శ్రేయస్కరమన్న భావనతో ఆయన పేరును ఖరారు చేశారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సీఎం కేసీఆర్‌తో పాటు పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్ రావు, ముంతాజ్ ఖాన్, రెడ్యానాయక్‌లు ఆరోసారి శాసనసభకు ఎన్నికయ్యారు. సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్న పార్టీనుంచే ప్రొటెం స్పీకర్‌ను, స్పీకర్‌ను ఎన్నిక చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే అందుకు భిన్నంగా ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను ఈ పదవికి ఎంపిక చేయడాన్ని బట్టి చూస్తుంటే ముస్లిం మైనారిటీలకు కూడా తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందన్న సంకేతాలను కేసీఆర్ పంపించినట్లయిందని తెరాస సీనియర్ నేత ఒకరు చెప్పారు. 70 సంవత్సరాల ముంతాజ్ ఖాన్ ఆదినుంచి ఎంఐఎంలో కీలకంగా పనిచేశారు. యాకుత్‌పుర నుంచి ఐదుసార్లు ఎదురులేని నాయకుడిగా ఎదిగారు. పార్టీ ఆదేశంతో ఈ ఎన్నికల్లో ఆయన చార్మినార్ అసెంబ్లీ బరిలో దిగి మరోసారి విజయబావుటా ఎగురవేశారు.

స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవమే..?

శాసనసభలో తెరాస అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడంతో శాసనసభ స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. 19 సీట్లను సాధించిన కాంగ్రెస్ స్పీకర్ పదవికి పోటీపడే అవకాశాలు ఎంతమాత్రం లేవని తెలుస్తోంది. స్పీకర్ పదవికి తెరాస అధినేత, సీఎం కేసీఆర్ ప్రతిపాదించిన ఎమ్మెల్యే ఒకరే నామినేషన్ దాఖలు చేస్తుండడంతో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. నామినేషన్ల ప్రక్రియ దాఖలుకు గురువారం సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉండడంతో ఆ తర్వాత స్పీకర్‌గా నామినేషన్ దాఖలు చేసిన ఎమ్మెల్యే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు శాసనసభ కార్యదర్శి వేదాంతం నరసింహాచార్యులు ప్రకటించనున్నారు.



ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు. తొలుత శాసనసభ కార్యదర్శి వేదాంత నరసింహాచార్యులు రాజ్యాంగం ప్రకారం ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేసిన అంశాన్ని చదివి వినిపించారు. అనంతరం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని జరిపించారు. ప్రమాణ స్వీకారానికి ముందు ముంతాజ్ అహ్మద్ ఖాన్ గట్టి పోలీసు బందోబస్తు మధ్య పాతబస్తీలోని ఆయన నివాసం నుంచి రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. ఆయనకు రాజ్‌భవన్ అధికారులు, సిబ్బంది, అసెంబ్లీ ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. దర్బార్ హాల్‌లోకి తోడ్కొని వెళ్లారు.

ముగ్గురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు తెరాస ఎమ్మెల్సీలు భూపతిరెడ్డి, రాములునాయక్, యాదవరెడ్డిలను అనర్హులుగా ప్రకటిస్తూ తెలంగాణ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ బుధవారం కీలకనిర్ణయం తీసుకున్నారు. నిజామాబాద్ స్థానికసంస్థల నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న భూపతిరెడ్డి, శాసనసభ్యుల కోటాలో యాదవరెడ్డి, గవర్నర్ కోటాలో రాములునాయక్ మండలి సభ్యులు అయ్యారు. అయితే తెరాస సభ్యులుగా ఎన్నికైన ఈ ముగ్గురూ కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని ఉల్లంఘించారని తెరాస శాసనమండలి చైర్మన్‌కు ఫిర్యాదుచేసింది. ఈ ముగ్గురినీ అనర్హులుగా ప్రకటించాలని కోరింది. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వాదనలు విన్న మండలి చైర్మన్ తీర్పును రిజర్వుచేశారు. ముగ్గురు సభ్యుల ఫిరాయింపులకు సంబంధించిన ఆధారాలను టీఆర్ఎస్ పక్షాన మండలి విప్ పల్లా రాజేశ్వరరెడ్డి , చైర్మన్ స్వామిగౌడ్‌కు అందజేశారు. ఈనెల 19నుండి మండలి సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో మండలి చైర్మన్ భూపతిరెడ్డి, యాదవరెడ్డి, రాములునాయక్‌లపై వేటువేస్తూ తుదినిర్ణయం ప్రకటించారు. తొలుత టీఆర్ఎస్ నలుగురు ఎమ్మెల్సీలపై ఫిర్యాదుచేయగా, వరంగల్ స్థానికసంస్థల నుండి గెలిచిన కొండా మురళీధర్ మండలి చైర్మన్‌కు తన రాజీనామా లేఖను సమర్పించడం, ఆమోదించడం జరిగిపోయింది. మిగతా ముగ్గురు సభ్యులపై విచారణ జరిపి, వాదనలు విని బుధవారం నిర్ణయం తీసుకున్నారు.

న్యాయపోరాటం చేస్తాం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తమపై అనర్హత వేటు వేయడం ఏకపక్ష నిర్ణయమని, ఇది చీకటి రోజని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామని ఎమ్మెల్సీలు భూపతి రెడ్డి, యాదవరెడ్డి, రాములునా యక్ ప్రకటించారు. రాష్ట్రం అవిర్భావం తర్వాత జరిగిన మండలి చైర్మన్ ఎన్నికసమయం లో కాంగ్రెస్ పార్టీకి చెందిన 13 మంది ఎమ్మెల్సీలు ఓటు వేసినప్పుడు ఈ వైఖరి ని ఎందుకు ఆచరించలేదని ప్రశ్నిం చారు. మండలి చైర్మన్ ప్రకటన అనంత రం మాజీ ఎమ్మెల్సీలు యాదవ రెడ్డి, భూపతిరెడ్డి, రాములునాయక్ బుధవారం మీడియాతో మాట్లాడారు. తాను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైనానని, తాను ఏ పార్టీ తరపునో, లేదా గవర్నర్ సిఫారసుతోనో ఎమ్మెల్సీ కాలేదని, అలాంటపుడు తనపై ఎలా అనర్హత వేటు వేస్తారని భూపతిరెడ్డి ప్రశ్నించారు.

వారిపై ఎందుకు చర్య తీసుకోలేదు?



కాంగ్రెస్ పార్టీ శాసన సభాపక్షం టీఆర్ఎస్‌లో విలీనమైనందని గెజిట్ విడుదల చేసిన మండలి చైర్మన్.. ఇప్పుడు తమపై ఎలా అనర్హత వేటు వేస్తారని భూపతిరెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్ లో చేరిన ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకో వాలని ఫిర్యాదు చేస్తే ఎందుకు పట్టించు కోవడం లేదని ప్రశ్నించారు. పెద్దల సభలోనే న్యాయం జరగనప్పుడు ఇంకెక్కడ న్యాయం జరుగుతుందని, తమపై అనర్హత వేటు వేస్తున్నట్లు ఒక బులిటెన్ ద్వారా చెప్పడం ద్వారా కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. ప్రిసైడింగ్ అధికారికి పూర్తి అధికారాలు ఇవ్వడం సరికాదని, జడ్జిమెంట్ ముందే రాసుకున్న తర్వాత వాదనలు విన్నట్లుగా ఆయన వైఖరి ఉందని యాదవరెడ్డి ఎద్దేవా చేశారు. తాను ఏ తప్పు చేశానో ఇంతవరకు చెప్పలేదని, పార్టీ మారిన ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇచ్చిన విషయం మర్చిపోయారా? అని విమర్శించారు. అధికార పార్టీకి ఒకలాగ, ప్రతిపక్ష పార్టీకి మరొక నిర్ణయం ఉంటుందా? అని నిలదీశారు. ప్రజా సేవను గుర్తించి గవర్నర్ కోటాలో తనకు పదవి ఇచ్చారని, తాను ఏ పార్టీకి చెందిన వాడిని కాకున్నా ఎందుకు చర్యలు తీసుకున్నారో చెప్పాలని రాములునాయక్ అన్నారు. గిరిజన వర్గానికి చెందిన వ్యక్తిని కాబట్టే తనపై చర్యలు తీసుకున్నారని ఆయన విమర్శించారు. గతంలో కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన ఫారూఖ్‌హుస్సేన్‌పై ఎందుకు వేటు వేయలేదన్నారు. ఫారూఖ్ కూడా గవర్నర్ కోటాలోనే ఎన్నికయ్యారని రాములునాయక్ వివరించారు.

మండలి డిప్యూటీ చైర్మన్‌పై ఆరోపణలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టీఆర్ఎస్‌లో వెన్నుపోట్లపై అధిష్ఠానానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి వేములవీరేశం ట్రక్కు గుర్తు కారణంగానే ఓడిపోయారని స్వయంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించగా, తాజాగా అదే నియోజకవర్గానికి చెందిన మండలి డిప్యూటీ చైర్మన్ నేతివిద్యాసాగర్ అనుచరులు తాము ఓడించామని, తమ నాయకుడు చెప్పడం వల్లే ఇది చేశామంటూ చెప్పిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కేతేపల్లి మండలం చెర్కుపల్లికి చెందిన బంటు మహేందర్ అనే నాయకుడు చేసిన వ్యాఖ్యల వీడియో వైరల్‌గా మారగా, ఇప్పటికే నకిరేకల్ నియోజకవర్గనేతలు దీనిపై కేటీఆర్‌కు ఫిర్యాదుచేసినట్లు సమాచారం. ఆదినుండీ నేతివిద్యాసాగర్‌కు, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యేకు అంత సఖ్యతలేదన్న ప్రచారముండగా, తాజా వీడియో నేపథ్యంలో ఇది బయటపడింది. కొల్లాపూర్‌లో తన ఓటమికి సొంతపార్టీనేతలే కారణమని జూపల్లి కృష్ణారావు ప్రకటించగా, ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్‌తో పాటు పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తమ ఓటమికి సొంతపార్టీనేతలే ప్రయత్నించారని అధిష్ఠానానికి నివేదించారు. మొత్తంగా వెన్నుపోటు రాజకీయాలు అంతర్గతంగా పార్టీలో వేడిపుట్టిస్తున్నాయి. రానున్నరోజుల్లో నేతల భవిష్యత్తును ఇవి నిర్ణయించనున్నాయి.



మాటంటే మాటే.. ప్రమాణం చేయను

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం ఎంఎల్ఏ చేయించే ఎంఎల్ఏల ప్రమాణ స్వీకారోత్సవంలో తాను ప్రమాణం చేయనని బీజేపీ ఎంఎల్ఏ రాజాసింగ్ పునరుద్ఘాటించా రు. వాస్తవానికి ఈ ప్రకటనను రాజాసింగ్ గతంలోనే చేశారు. శాసనసభలో సీనియ ర్ ఎంఎల్ఏలే లేనట్లుగా సీఎం కేసీఆర్ ఎంఐఎం ఎల్ఎల్ఏ ముంతాజ్‌ఖాన్ పేరు ను ప్రకటించడం దురదృష్టకరమని రాజా సింగ్ గతంలోనే విమర్శించారు. ఎంఐఎం ఎంఎల్ఏ చేయించే ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనబోనని, శాశ్వత స్పీకర్ ఎన్నికైన తర్వాత ఆయనతో ప్రమాణం తీసుకుంటానని తెలిపారు. హైదరాబాద్‌ను సంఘ విద్రోహకర శక్తులకు అడ్డాగా మారుస్తున్న ఎంఐఎంకు సీఎం కేసీఆర్ ప్రాధాన్యం ఇవ్వడం సరైంది కాదని రాజాసింగ్ అన్నారు. ఎంఐఎంతో తనకు వ్యక్తిగత శతృత్వం ఉన్నందున తానీ నిర్ణయానికి వచ్చానని, తన నిర్ణయాన్ని పార్టీకి కూడా తెలియజేశానని రాజాసింగ్ పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాం, ఎంఐఎం సిద్ధాంతాలు వేర్వేరని అన్నారు. ఎంఐఎం సిద్ధాంతాలతో విభేధిస్తున్నందున తానూ పార్టీ ఎంఎల్ఏ చేయించే ప్రమాణం చేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.



బుధవారం ఉదయం తిరుమల వేంకటేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న తెరాస పార్టీ రాజ్యసభ సభ్యులు బండా ప్రకాష్

స్పీకర్‌పై వీడని ఉత్కంఠ

- ఆరుగురి పేర్ల పరిశీలన.. అందరితో స్వయంగా మాట్లాడిన కేసీఆర్
- పరిశీలనలో పోచారం, ఇంద్రకరణ్, పద్మాదేవేందర్‌రెడ్డి పేర్లు
- సీనియర్లతో నేడు భేటీ.. నిర్ణయం
- బీసీ వర్గానికి డిప్యూటీ స్పీకర్ పదవి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శాసనసభాధిపతి ఎన్నికకు గురువారం నోటిఫికేషన్ జారీ కానుండడంతో స్పీకర్, డిప్యూటి స్పీకర్ అభ్యర్థిత్వంపై తెరాస అధినేత, సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టిసారించారు. ఈ రెండు కీలక పదవుల భర్తీకి గత కొంతకాలంగా సమాలోచనలు జరుపుతున్న కేసీఆర్ ఆ కసరత్తును మరింత ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది. ఆయన చేస్తున్న కసరత్తు బుధవారం రాత్రికి తుదిదశకు చేరుకున్నట్టు చెబుతున్నారు. తొలుత సభాపతి స్థానంలో వెనకబడిన తరగతుల ఎమ్మెల్యేను నియమించాలని భావించినా ఆ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉండడంతో కేసీఆర్ తన మనసు మార్చుకున్నట్టు తెలుస్తోంది. మాజీ ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టాలని కేసీఆర్ భావించారు. అందుకాయన నిరాసక్తత చూపడంతో వెనక్కి తగ్గినట్టు తెలుస్తోంది.



రెడ్డి సామాజిక వర్గానికి స్పీకర్ పదవి?

స్పీకర్‌గా రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారిని ఎంపిక చేయాలన్న నిర్ణయానికి కేసీఆర్ వచ్చారు. ఈ సామాజికవర్గానికి చెందిన పోచారం శ్రీనివాసరెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, పద్మా దేవేందర్ పేర్లను పరిగణలోకి తీసుకున్నట్టు చెబుతున్నారు. ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు సీనియర్లు కావడంతో పాటు పరిపాలనానుభవం కూడా అధికంగా ఉండడంతో కేసీఆర్ వీరివైపు మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. పోచారం తెదేపా హయాంలో పంచాయితీరాజ్ మంత్రిగా పనిచేశారు. తెరాస ప్రభుత్వంలో నాలుగున్నరేళ్ళు వ్యవసాయ మంత్రిగా ఉన్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి కూడా తెదేపా, కాంగ్రెస్ హయాల్లో ఆయా పదవులను చేపట్టారు. తెరాస హయాంలో న్యాయ, గృహ, దేవాదాయశాఖ మంత్రిగా పనిచేశారు. ఉప సభాపతిగా పనిచేసిన పద్మా దేవేందర్ ఈ ఎన్నికల్లోనూ విజయం సాధించారు. సభాపతి పదవికి పద్మ పేరును ఖరారు చేయకపోతే ఆమెను మంత్రిగా నియమించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. స్పీకర్ పదవిని రెడ్డి సామాజిక వర్గంతో భర్తీచేసి ఉప సభాపతి పదవిని బీసీలకు కేటాయించాలని కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం.

సభాపతి పదవికి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రెడ్యానాయక్, కరీంనగర్ జిల్లాకు చెందిన ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్ పేర్లు కూడా పరిశీలనకు వచ్చినట్టు సమాచారం. అయితే ఈశ్వర్ స్పీకర్ పదవిని చేపట్టేందుకు ససేమిరా అంటున్నట్టు సమాచారం. శాసనమండలి చైర్మన్‌గా కూడా బీసీ సామాజికవర్గానికి చెందిన స్వామిగౌడ్ ఉండడంతో ఈ దఫా స్పీకర్‌గా మరో సామాజికవర్గానికి చెందిన వారిని ముఖ్యంగా రెడ్డి సామాజికవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వారిని ఎంపిక చేయాలని కేసీఆర్ తుది నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. సభాపతి, ఉప సభాపతి ఎన్నిక తర్వాతే మంత్రివర్గ విస్తరణపై ఒక స్పష్టత వస్తుందన్న భావనతో తెరాస వర్గాలు ఉన్నాయి.

గురువారం ఉదయం సభాపతి, ఉప సభాపతి అభ్యర్థిత్వానికి సంబంధించి శాసనసభలోని తన కార్యాలయంలో సీనియర్లతో సమావేశం నిర్వహించి ఆ తర్వాత పేరును ఖరారుచేసి ప్రకటించాలని కేసీఆర్ భావిస్తున్నారు. అంతకు ముందే స్పీకర్ పదవికి ఎవరిని నిలబెట్టాలన్న అంశానికి సంబంధించి నేరుగా సంబంధిత ఎమ్మెల్యేతో మాట్లాడి నామినేషన్ దాఖలుకు సిద్ధం కావాలని సంకేతాలిచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. గురువారం సాయంత్రం 5 గంటల వరకు స్పీకర్ స్థానానికి నామినేషన్ల దాఖలుకు గడువుగా నిర్ణయించారు.

ఇటు ప్రమాణస్వీకారోత్సవం... అటు స్పీకర్ నామినేషన్?

ఓవైపు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాన్ని నిర్వహిస్తూనే మరోవైపు స్పీకర్ అభ్యర్థితో నామినేషన్ వేయించేందుకు తెరాస శాసనసభాపక్షం ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. గురువారం నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాలు ఆదివారంతో ముగియనున్నాయి. ఆ తర్వాతే మంత్రిమండలి కూర్పుపై కేసీఆర్ దృష్టి సారిస్తారని చెబుతున్నారు. ఈనెల 21 నుంచి ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో యాగం నిర్వహిస్తున్నందున ఆ తర్వాత మంత్రివర్గ విస్తరణపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలిసారి శాసనసభకు ఎన్నికైన వారు సైతం మంత్రివర్గంలో స్థానం కోసం పోటీ పడుతూ తమకు ఎలాగైనా పదవులొచ్చేలా చర్యలు తీసుకోవాలని కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావును కలిసి అభ్యర్థిస్తున్నట్టు సమాచారం.

ఎన్నికను ఏకగ్రీవం చేద్దాం

శాసనసభ స్పీకర్ పదవిని ఏకగ్రీవం చేసేందుకు సహకరించాల్సిందిగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, భాజపా అధ్యక్షుడు లక్ష్మణ్‌తో బుధవారం సాయంత్రం ఫోన్‌లో మాట్లాడారు. స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాల్సిందిగా ప్రతిపాదించారు. కేసీఆర్ ప్రతిపాదనకు ఎంఐఎం, భాజపా వెంటనే ఓకే చెప్పగా, పార్టీలో చర్చించి నిర్ణయం ప్రకటిస్తామని పీసీసీ అధ్యక్షుడు బదులిచ్చారు.

వేచి చూడక తప్పదా?

మంత్రివర్గ విస్తరణతో పాటు చీఫ్‌విప్, విప్‌ల ఎంపికపై కూడా కేసీఆర్ దృష్టి సారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒక చీఫ్‌విప్, ముగ్గురు విప్‌లను నియమిస్తారని చెబుతున్నారు. గతంలో చీఫ్‌విప్‌గా పనిచేసిన కొప్పుల ఈశ్వర్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటే ఆ పదవికి కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్దన్‌కు ఈ పదవి వరించే అవకాశముంది. మరో విప్‌గా ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత పనిచేశారు. ఈ దఫా ఆమె మంత్రి పదవిని ఆశిస్తున్నారు. అయితే పార్లమెంటరీ కార్యదర్శిగా ఆమెను ఎంపిక చేస్తారన్న ప్రచారం ఉంది.

దీంతో విప్‌గా మరో మహిళా ఎమ్మెల్యేకు అవకాశం దక్కవచ్చు. చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లెల ఓదేలుకు ఈ దఫా ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం దక్కకపోవడంతో ఆయనకు ఎమ్మెల్సీ ఇచ్చే అవకాశముంది. ఓదేలు గతంలో విప్‌గా పనిచేశారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఓదేలు స్థానంలో విప్‌గా అదే సామాజికవర్గానికి చెందిన వారిని ఎంపిక చేసే అవకాశం కనిపిస్తోంది. అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, తుంగతుర్తి ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్లు విప్ పదవి కోసం పరిశీలిస్తున్నట్టు సమాచారం.

సీఎల్పీ నేతపై కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)



పంపిన దూత, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ అభిప్రాయాలు సేకరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఐదుగురు సీనియర్లు సీఎల్పీ పదవికోసం పోటీపడుతూండగా పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, ప్రచార కమిటీ నేత భట్టివిక్రమార్క మధ్య పోటీ తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 9 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్లో కాంగ్రెస్ శాసన సభాపక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈమేరకు 19మంది పార్టీ ఎమ్మెల్యేలకు సమాచారం అందజేశారు. అసెంబ్లీ సమావేశం ప్రారంభానికన్నా ముందే సీఎల్పీ సమావేశం ఏర్పాటు కానున్నది.

కోర్‌కమిటీ భేటీ

సీఎల్పీ నేత ఎంపిక విషయంలో పార్టీలోని ముఖ్యనేతల అభిప్రాయం తెలుసుకునేందుకు బుధవారం రాత్రి నగరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో టీ పీసీసీ కోర్ కమిటీ సమావేశమైంది. కాంగ్రెస్ అధిష్టానం దూతగా కేసీ వేణుగోపాల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రామచంద్ర కుంతియా, టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు వి. హనుమంతరావు, సంపత్‌కుమార్, బోసు రాజు, శ్రీనివాస కృష్ణన్, సలీమ్, పొన్నం ప్రభాకర్, గూడూరు నారాయణరెడ్డి తదితరులు హాజరయ్యారు. సమావేశంలో సీఎల్పీ నేత ఎంపిక, ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ ఓటమి, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలతో పాటు పార్టీ బలోపేతంపైన కూడా చర్చించారు. ప్రధానంగా సీఎల్పీ నేత ఎంపికపైనే సుదీర్ఘంగా చర్చ జరిగింది. నేతల అభిప్రాయాలను తెలుసుకున్న వేణుగోపాల్.. అదేసమయంలో హై కమాండ్ సూచనలను కూడా వివరించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సీఎల్పీ నేత ఎంపిక సజావుగా జరిగేలా చూడాలన్న అధిష్టానం మనోగతాన్ని కేసీ వేణుగోపాల్ వివరించారు. కొంతమంది నేతలు శాసన సభా వ్యవహారలపై పట్టున్న వారికి సీఎల్పీ నేతగా అవకాశం ఇస్తే ప్రభుత్వం చేసే తప్పులను సభలో గట్టిగా నిలదీయడానికి అవకాశం ఉంటుందని సూచించారు. అధిష్టానం సూచనలతో పాటు ఎమ్మెల్యేల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని నిర్ణయానికి వచ్చారు.

ఉత్తమ్, భట్టి మధ్య నెలకొన్న పోటీ

సీఎల్పీ పదవి విషయంలో టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క మధ్య తీవ్ర పోటీ నెలకొన్నట్లుగా సమాచారం. పార్లమెంట్ ఎన్నికల తర్వాత టీ పీసీసీ అధ్యక్ష పదవి నుంచి ఉత్తమ్ ను తప్పించే అవకాశం ఉందని, అందుకే సీఎల్పీ పదవిపై ఉత్తమ్ కన్నేశారని చర్చ జరుగుతోంది. బుధవారం రోజునే సీఎల్పీ సమావేశం ఏర్పాటు చేయాలని భావించినప్పటికి.. కొందరు సభ్యులు అందుబాటులో లేకపోవడంతో గురువారానికి వాయిదా వేశారు. ఈ సీఎల్పీ సమావేశానికి అధిష్టానం దూత కేసీ వేణుగోపాల్ హాజరుకానున్నారు. అసెంబ్లీలో పార్టీ తరపున ప్రధాన ప్రతిపక్షంనుంచి సభనుద్దేశించి ఎల్పీ నేత మాట్లాడాల్సి ఉంటుంది. సీఎల్పీ నేత ఎంపిక విషయంలో ఇప్పటికే పలుమార్లు రాష్ట్రానికి వచ్చిన వేణుగోపాల్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల అభిప్రాయలు తీసుకున్నట్లు సమాచారం. ఎందుకంటే సీఎల్పీ పదవి కోసం విజయం సాధించిన 19 మంది ఎమ్మెల్యేలలో ఐదుగురు సీనియర్లు పోటీ పడుతున్నారు. టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, టీ పీసీసీ ఎన్నికల ప్రచార కమిటి చైర్మన్ మల్లు భట్టివిక్రమార్క, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీధర్ బాబుతో పాటు ఎమ్మెల్యేలు తూర్పు జగ్గారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఈ రేసులో ఉన్నారు. సీఎల్పీతో పాటు టీ పీసీసీ, ఎల్పీలోని పదవుల పంపకాల విషయంలో సామాజిక న్యాయం పాటించాలనే ఆలోచనతో అధిష్టానం వచ్చినట్లుగా సమాచారం.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 17 జనవరి 2019

చరిత్రలో ఈరోజు

జ్యోతిబసు మరణం




జ్యోతిబసుగా పిలువబడే జ్యోతిరింద్ర బసు 8 జూలై 1984లో జన్మించి.. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పని చేసిన రికార్డు సృష్టించి 17 జనవరి 2010లో మరణించారు. 1977 నుంచి 2000 వరకు నిరాటంకంగా పశ్చిమ బెంగాల్ సీఎంగా పని చేసిన జ్యోతిబసు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్కిస్ట్) పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులుగా వ్యవహరించారు. 1964లో సీపీఎం పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి 2008 వరకు పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్న జ్యోతిబసు తరువాత అనారోగ్యరీత్యా పార్టీ కేంద్ర కమిటీ సమావేశాలకు శాశ్వత ఆహ్వానితులు హోదాలో మరణించే వరకు కొనసాగారు. 1977లో లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తూ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన జ్యోతిబసు రెండు వేల సంవత్సరం వరకు అదే పదవిలో కొనసాగడం విశేషం. కమ్యూనిస్టు పార్టీలో పని చేసిన డెబ్బై సంవత్సరాల్లో జ్యోతిబసు మూడున్నర సంవత్సరాలు జైల్లోనూ, రెండేళ్లు అజ్ఞాతంలోనూ గడిపారు. జ్యోతిబసు ప్రజా నాయకుడిగా, కార్మిక సంఘాల నాయకుడిగా ఎంత పేరు గడించినా పార్టీలో మాత్రం ఎన్నటికీ విధేయుడైన సభ్యుడిగా చివరి వరకు కొనసాగారు. కమ్యూనిస్టు పార్టీకి సమాజంలో ఒక గౌరవాన్ని తెచ్చిన నేతగా జ్యోతిబసును పశ్చిమ బెంగాల్‌లోని రాజకీయ వర్గాలు గుర్తు తెచ్చుకుంటాయి.

భద్రతామండలి తొలిభేటి



రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచ దేశాల మధ్య శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పే లక్ష్యంతో ఏర్పడిన ఐక్యరాజ్యసమితిలోని ఆరు ప్రధాన విభాగాల్లో భద్రతామండలి కూడా ఒకటి. భద్రతా మండలి తొలి సమావేశం 17, జనవరి, 1946న నిర్వహించారు. అంతర్జాతీయ శాంతి, భద్రత పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్న భద్రతా మండలి ఐక్య రాజ్యసమితిలోకి నూతన సభ్యులను చేర్చుకోవడం, యూఎన్ రాజ్యాంగంలో ఏదేని మార్పులు, చేర్పులు చేయడం, శాంతి పరిరక్షణ దళాలను నియమించడం, అంతర్జాతీయంగా ఏ దేశంపైనైనా ఆంక్షలు విధించడం, ప్రతిపాదనల ద్వారా మిలటరీ చర్యలకు ఆదేశించడం వంటి కీలక విధులను నిర్వహిస్తుంది. సభ్య దేశాలపై ఆంక్షలు విధించే అధికారం ఒక్క భద్రతామండలికి ఉండడం విశేషం. అయితే భద్రతా మండలి ఏర్పడిన తరువాత అమెరికా, రష్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధ కారణంగా నిస్తేజంగా ఉండిపోయింది. సోవియట్ యూనియన్ కుప్ప కూలిన తరువాత భద్రతామండలి కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి. భద్రతామండలిలో మొత్తం 15 దేశాలు సభ్యులుగా ఉంటే అందులో శాశ్వత సభ్య దేశాలుగా అమెరికా, రష్యా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, చైనా ఛలామణిలో ఉన్నాయి. ఈ అయిదు శాశ్వత సభ్య దేశాలకు వీటో అధికారం ఉంటుంది. తాత్కాలిక హోదాలో భద్రతామండలిలో 10 సభ్యత్వ దేశాల కాల పరిమితి రెండేళ్లకాలం ఉంటుంది. 2016 వరకు భద్రతామండలి ఆధ్వర్యంలో పదహారు శాంతి స్థాపక యుద్ధాలు, ఒక ప్రత్యేక రాజకీయ కార్యచరణ నిర్వహించడం విశేషం.

చాసో గారికోపమొచ్చింది



(నేడు జయంతి)

ఎప్పుడో స్వర్గస్తులైన ప్రముఖ కథకులు చాసోకి ఇప్పుడు కోపమెలా వచ్చిందని బుర్ర గోక్కోకండి. మా విజయనగరంలో అంతే. సాహితీవేత్తలిక్కడ మరణించరు. మాతో మాట్లాడుతుంటారు. గురజాడ వారు, శ్రీశ్రీ, చాసో, ఆదిభట్ల, పతంజలి, ఒకరేమిటి కీర్తిశేషులందరూ ఊరిపై అభిమానంతో స్వర్గంలో కన్నా ఎక్కువగా ఇక్కడే సమయాన్ని గడుపుతారు. . మనవాళ్ళుత్త వెధవాయిలోయ్ అంటూ ముచ్చట పడతారు తప్ప మొహం మాడ్చుకోరు. 'పదండి ముందుకు, పదండి తోసుకు 'అంటూ పిలుపిచ్చిన శ్రీశ్రీ అయితే మన తెలుగువాళ్లు పక్కనున్న వారిని తోసుకు వెళ్లడంలోని శ్రద్ధ ముందుకు వెళ్ళడంలో చూపించడం లేదే అని బాధపడతారు . పతంజలి వారు భూమి ప్రస్తుతం బల్లపరుపుగా లేకుండా కమలం రేకుల్లా పొడుచుకుని ఉందంటూ అంటున్నారు. అయితే చాసో గారు కూడా మున్నెన్నడూ కోపంగా లేరు. ఎంపు కథలో లాగా ముష్టివాడి నుండి అత్యంత అమెరికా బలిష్టి వరకూ తాను చెప్పినట్టు ఎవడికి వాడు ఆర్థిక లాభం చూసుకోవడం కరెక్ట్ అయిందంటూ, నాటికే కాదు, నేటికీ, ఏనాటికీ ఇదే ఖాయమని అంటుంటారు. ఘాటుగా చుట్ట పీల్చి నిట్టూర్పు విడుస్తారు తప్ప ఇలా లేదు. ఈ రోజు నన్ను చూడగానే ఆయన చుట్ట చివర నిప్పు కన్నా ఆయన ముఖమే ఎర్రగా ఉంది. ఈరోజు వారి ముద్దులమ్మాయి చాగంటి తులసి గారిని కలిసి వస్తున్నాను. చాసో లేఖల్ని కూడా నాకందించారు. చాసో గారి కథలపై నా మక్కువని తెలియబరుస్తూ చర్చలో కూడా పాల్గొన్నానే, మరి ముభావంగా ఉన్నారేం ఈయన అనుకొంటూ కారణమ్మడిగాను. 'మీ చర్చలయిపోయాక ఏమన్నావో గుర్తుందా?' నిలదీశారు. ''ఓహ్. అదా! మీరు చాలా విలువైన చాసో లేఖల సంపుటి ఇచ్చారు. కానీ అంతకన్నా నాకు మీరు పెట్టిన రవ్వలడ్డు అద్భుతమైనది' అన్నాను సార్.' ''మరి నా లేఖల్ని, రచనల్ని రవ్వలడ్డు కన్నా తక్కువ చేస్తావా?'' 'ఓహ్. అందుకా' అంటూ నవ్వుతూ చెప్పాను. '! మీ లేఖల పుస్తకం మార్కెట్‌లో కొనుక్కోవచ్చు. కానీ ఆమె చేతి లడ్డుకి విలువ కట్టగలమా!'' కన్విన్స్ అయినట్టున్నారు. గట్టిగా దమ్ము పీల్చి నా భుజం తట్టారు.

-డా.డి.వి.జి.శంకరరావు, 9440836931

ట్రంప్ ఎమర్జెన్సీ ఆలోచన!

అమెరికాలో 24 రోజుల నుంచి షట్ డౌన్ (పాలన స్తంభన) కొనసాగుతోంది. ఇది ఇప్పట్లో పరిష్కారం అయ్యే సూచనలు కనిపించడం లేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసమర్ధతకు తోడు, పంతాలు, పట్టింపుల వల్లే ఈ షట్ డౌన్ కొనసాగుతోందని ఎబిసి న్యూస్ నిర్వహించిన సర్వేలో 85 శాతం మంది అభిప్రాయపడ్డారు. ట్రంప్ తన అధికార నివాసంలో డెమోక్రాట్ల ను విందుకు ఆహ్వానించి రాజీకి ప్రయత్నించారు.దానికి ఎవరూ హాజరు కాకపోవడంతో ఆగ్రహం చెంది కలసి రాకపోతే ఈ షట్ డౌన్ నెలలూ, సంవత్సరాలు కూడా కొనసాగుతుందని ట్రంప్ హెచ్చరించారు. అయితే, దేశ ప్రజల్లో 20 శాతం కన్నా తక్కువ మంది మాత్రమే ఈ షట్ డౌన్ వల్ల ఇబ్బందులకు గురి అయినట్టు కూడా సర్వేలో తేలింది. తాను ప్రతిపాదించిన బిల్లుకు డెమోక్రాట్లు మోకాలడ్డటం వల్లనే ఆర్థిక బిల్లుపై ట్రంప్ సంతకం చేయలేదు. దాంతో షట్ డౌన్‌కు దారి తీసింది. మెక్సికో నుంచి వలసదారులు దేశంలోకి వచ్చి పడకుండా గోడ కట్టాలన్న ప్రతిపాదనను అమలులో పెట్టేందుకు అవసరమైన 500 బిలియన్ డాలర్ల కోసం ట్రంప్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంతపెద్ద మొత్తాన్ని గోడ నిర్మాణానికి కేటాయిస్తే దేశ ఆర్థిక పరిస్థితిపై మోయలేని భారం పడుతుందని డెమోక్రాట్లు వాదిస్తున్నారు. వారి వాదనను రిపబ్లికన్లలో పలువురు సమర్ధిస్తున్నారు. అయినప్పటికీ, ట్రంప్ మొండి వైఖరితో గోడ నిర్మాణానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. షట్ డౌన్ నెలలూ, సంవత్సరాలు కొనసాగినా సరే ఆర్థిక బిల్లుపై సంతకం చేయనని భీష్మించారు. దీంతో డెమోక్రాట్లు తమ ఆందోళనను మరింత ఉధృతం చేశారు. చట్టసభ నుంచి వీధుల్లో ఆపార్టీ కార్యకర్తలు ప్లకార్డులతో నిరసన ప్రదర్శనలను ముమ్మరం చేశారు. వారి ఆందోళనపై ట్రంప్ సానుకూలంగా స్పందించడానికి బదులు ఎమర్జెన్సీ విధిస్తానంటూ ఈనెల ఆరవ తేదీన హెచ్చరిక జారీ చేశారు. అయినప్పటికీ డెమోక్రాట్లు తమ ఆందోళనను విరమించలేదు. మరింత ఉధృతం చేశారు.

నేషనల్ ఎమర్జెన్సీని విధిస్తే ఇప్పటికే వివిధ ప్రాజెక్టులకు కేటాయించిన నిధులను ఉపసంహరించి, తాను సంకల్పించిన ప్రాజెక్టుకు కేటాయించే అధికారం అమెరికా రాజ్యాంగం ప్రకారం అధ్యక్షునికి ఉంది. ట్రంప్ ఆలోచన అంతవరకూ వెళ్ళింది కానీ, మళ్ళీ వెనక్కి తగ్గారు. రిపబ్లికన్లలో అధికులు ఈ ఆలోచనను వ్యతిరేకించడమే ఇందుకు కారణం. వలస విధానంపై ట్రంప్ ఇంత తీవ్రమైన చర్య తీసుకుంటే తాము అధికారంలోకి వస్తే భూతాపం, ఒబామా కేర్ వంటి ప్రాజెక్టులు, పథకాల విషయంలో ఇదే మార్గాన్ని అనుసరించగలమని డెమోక్రాట్లు హెచ్చరించారు. బహుశా సొంత పార్టీలో వ్యతిరేత మాత్రమే కాకుండా, డెమోక్రాట్లు ఇంత తీవ్రమైన హెచ్చరిక చేయడం వల్లనే ట్రంప్ వెనక్కి తగ్గి ఉంటారు.

షట్ డౌన్ వల్ల నేషనల్ పార్కులకూ, మ్యూజియంలు, నాసా వంటి ప్రతిష్టాత్మక సంస్థలకు నిధులు ఆగిపోవడం పెద్ద చర్చనీయాంశం అయింది. వేలాదిమంది రవాణా భద్రతా ఉద్యోగులకు షట్ డౌన్ వల్ల నెలవారీ వేతనాలు ఆగిపోయాయి. పార్కులు, మ్యూజియంలలో పనిచేసే సిబ్బందికి వేతనాలు ఆగిపోవడం వల్ల వారంతా రోడ్లమీదికి వచ్చారు. ఈ నెలారంభం వరకూ అమెరికన్ కాంగ్రెస్ రిపబ్లికన్ల అదుపులో ఉంది. మెక్సికో సరిహద్దులను మూసివేయాలన్న నిర్ణయం డెమోక్రాట్ల హయాంలోనే జరిగింది.

2006లో తీసుకున్న ఈ నిర్ణయం ప్రకారం కంచె నిర్మాణం జరుగుతోంది. ఈ కంచె నిర్మాణలో ఎక్కువ భాగం బరాక్ ఒబామా అధ్యక్షుడుగా ఉన్న సమయంలోనే జరిగింది. అందువల్ల మెక్సికో సరిహద్దు మూసివేత నిర్ణయానికి కేవలం ట్రంప్ మాత్రమే కారణం కాదు. ఇందులో డెమోక్రాట్లకూ భాగస్వామ్యం ఉంది. అయితే, ట్రంప్‌ని ఇరుకున పెట్టడానికి ఈ అంశాన్ని డెమోక్రాట్లు ఒక అస్త్రంగా ఉపయోగించుకుంటున్నారన్న రిపబ్లికన్ల ఆరోపణ నిరాధారం కాదు. మెక్సికో సరిహద్దుల్లో గోడను నిర్మిస్తానని ట్రంప్ ఎన్నికల ప్రచారం సందర్భంగా దేశ ప్రజలకు వాగ్దానం చేశారు. వలసవాదుల సంఖ్య పెరగకుండా అరికట్టాలంటే గోడ కట్టాల్సిందేనని ఆయన ఇప్పటికీ స్పష్టం చేస్తున్నారు. తాను అధ్యక్ష పదవిని చేపట్టిన కొత్తలో వేలాదిమంది తన ప్రతిపాదనకు మద్దతుగా పెద్ద ప్రదర్శన నిర్వహించిన సంగతిని ట్రంప్ గుర్తు చేస్తున్నారు. ఈ గోడ నిర్మాణంతో వలసలను అరికట్టి అమెరికాకే తొలి ప్రాధాన్యం అన్న నినాదాన్ని ట్రంప్ సాకారం చేస్తున్నారనీ, దేశ ప్రజల మద్దతు ఆయనకే ఉంటుందని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. దీనిని 2020లో ప్రారంభమయ్యే అధ్యక్ష ఎన్నికల ప్రచారానికి ప్రధానాంశం అవుతుందని వారు అంటున్నారు. అయితే, డెమోక్రాట్లు ఇందుకు భిన్నమైన వాదనను వినిపిస్తున్నారు. బహుళ జాతులకు ఆలవాలంగా ఎంతోకాలం మంచిపేరు తెచ్చుకున్న అమెరికాకు ఈ గోడ నిర్మాణంతో జాతీయంగానే కాక, అంతర్జాతీయంగా శత్రువులు పెరుగుతారని వారు వాదిస్తున్నారు.

భూతాపం ఒప్పందం నుంచి అమెరికాను ఉపసంహరించడం, ఇరాన్‌తో పౌర అణు ఒప్పందాన్ని రద్దు చేసుకోవడం, చైనాతో వాణిజ్య యుద్ధానికి దారితీసే పరిస్థితులను సృష్టించడం వంటి ట్రంప్ విధానాలపై తాము జరిపిన పోరాటం పూర్తిగా ఫలించకపోవడంతో వచ్చే ఎన్నికల్లో మెక్సికో సరిహద్దులలో గోడ నిర్మాణాన్ని ప్రధానాంశగా తీసుకుని ట్రంప్ వ్యతిరేక ప్రచారం జరపాలన్నది డెమోక్రాట్ల వ్యూహం. అయితే, డెమోక్రాట్లు ఈ విషయంలో పూర్తిగా అవకాశవాదాన్ని అనుసరిస్తున్నారన్న రిపబ్లికన్ల ఆరోపణ జనంలోకి వెళ్ళింది. ట్రంప్‌ను గద్దె దింపేందుకు ఇతర అంశాలను కూడా డెమోక్రాట్లు పరిశీలిస్తున్నారు. 21 ట్రిలియన్ డాలర్ల జాతీయ రుణభారం ఉన్న దేశానికి 507 బిలియన్ డాలర్లతో గోడ నిర్మాణం మోయలేని భారమే అవుతుందని సామాన్యులు అభిప్రాయపడుతున్నారు. అందుకే ఎబిసీ నిర్వహించిన సర్వేలో ట్రంప్ తలపెట్టిన గోడ నిర్మాణాన్ని 85 శాతం వ్యతిరేకించారు.

10% శాశ్వత పరిష్కారమా?



డాక్టర్ పెంటపాటి పుల్లారావు
(రాజకీయ విశ్లేషకులు)
(ppr193 @gmail.com)

ఈ ఏడాది జనవరి 15వ తేదీన అగ్రవర్ణాల్లో పేదలకు పది శాతం రిజర్వేషన్ కోసం ఉద్దేశించిన బిల్లుపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సంతకం చేశారు. ఈ రిజర్వేషన్ల కారణంగా వ్యక్తిగతంగా నేను లాభపడకపోయినా, ఈ చట్టాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాను. ఈ చట్టం తీసుకొని రావడం ద్వారా అన్ని కులాల మధ్య సాంఘిక సామరస్యం పెరుగుతుందని, విభేదాలు తగ్గముఖం పడతాయని భావించాలి. ఈ పదిశాతం రిజర్వేషన్లు అన్ని మతాల్లోని అగ్రవర్ణ పేదలకు వర్తిస్తాయి. చాలా యేళ్లుగా రిజర్వేషన్లకు కోసం ఆందోళనలు చేస్తున్న అగ్రవర్ణాల వారికీ ఈ పది శాతం కోట ఒకింత సంతృప్తిని ఇస్తుంది. కేవలం పది శాతం రిజర్వేషన్లు వారి డిమాండ్లను నెరవేర్చకపోయినా, అగ్ర వర్ణాల్లో రాజ్యాంగం పట్ల గౌరవం పెరగడానికి దోహదపడుతుంది.

ఈ కోటా కింద ఎవరెవరు అర్హులు అవుతారు?

అగ్రవర్ణాల్లో పేదలకు ఉద్దేశించిన పది శాతం రిజర్వేషన్లకు వారి కుటుంబ ఆదాయం, వ్యవసాయ భూమి, సొంత నివాస స్థలం, గృహాల ఆధారంగా అర్హత పొందుతారు.

- కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలకు మించరాదు.
- వ్యవసాయ భూమి అయిదు ఎకరాల కన్నా తక్కువ ఉండాలి.
- నివాస గృహం పరిధి వెయ్యి చదరపు అడుగుల కన్నా తక్కువ ఉండాలి.
- నోటిఫైడ్ మున్సిపాలిటీలో నివాస స్థలం వంద గజాలు మించరాదు.
- నోటిఫై కాని మున్సిపాలిటీలో నివాస స్థలం రెండు వందల గజాల లోపు ఉండాలి.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం నాటకీయ పరిస్థితుల నేపథ్యంలో జనవరి 7 పదిశాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ముందుకు తెచ్చింది. ఉభయ సభల్లోనూ ఆమోదం పొందిన తరువాత జనవరి 15న చట్ట రూపం దాల్చింది. ఇంత వరకు ఏ రాజ్యాంగసవరణ కూడా ఇంత వేగంగా అమోదం పొందకపోవడం విశేషం. అగ్రవర్ణ పేదల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వస్తుందనే భయంతో ఈ బిల్లును ఏ రాజకీయపార్టీ కూడా వ్యతిరేకించడానికి సాహసం చేయలేకపోయింది. జనవరి ఏడున మోడీ ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు పదిశాతం బిల్లును ప్రకటించడతోనే మొదట కాంగ్రెస్ పార్టీ దాన్ని వ్యతిరేకించింది.

ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేసింది. అయితే అదే రోజు మధ్యాహ్నం మధ్యప్రదేశ్, రాజస్థాన్ ముఖ్యమంత్రులు కాంగ్రెస్ పార్టీకి ఒక హెచ్చరిక జారీ చేశారు. అగ్రపేదల బిల్లును వ్యతిరేకిస్తే తమ ప్రభుత్వాలు పడిపోతాయని స్పష్టం చేశారు. దీంతో నిమిషాల వ్యవధిలోనే కాంగ్రెస్ పార్టీ తన వైఖరి మార్చుకొని బిల్లుకు మద్దతు తెలిపింది.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని అనేక ఆందోళనలు, నిరసనలు జరిగిన నేపథ్యంలో మొత్తానికి పార్లమెంటు ఈ బిల్లును ఆమోదించింది. 1952 నుంచి షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో, పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల్లో, ఇతరత్రా అన్ని ప్రభుత్వ వ్యవస్థల్లో 22 శాతం రిజర్వేషన్లను అనుభవిస్తూ వస్తున్నాయి. 1990లో వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్లను ఉద్యోగాల్లో, విద్యారంగంలో, స్కాలర్‌షిప్‌ల్లో దేశవ్యాప్తంగా అమలు చేయడం మొదల పెట్టారు. వెనుకబడి తరగతులకు పార్లమెంటు, అసెంబ్లీల్లో రిజర్వేషన్ పొందకపోయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యా సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు దక్కాయి.

ప్రస్తుతం ఉన్న ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులను చూస్తే, వీరిలో 49 శాతం మంది రాజ్యాంగ పరంగా కుల ఆధారిత రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు పొందినవారిగా గుర్తించవచ్చు. 70 సంవత్సరాలుగా ఈ రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీల్లోనూ, తరువాత బీసీల్లోనూ తీవ్ర అంతరాలకు కారణమయ్యాయి. అదే విధంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహరాష్ట్ర వంటి పురోగతి సాధించిన రాష్ట్రాల్లో ఎస్సీలు బీహార్, ఒడిషా వంటి వెనుక బడిన రాష్ట్రాల కన్నా ఎక్కువగా ఉద్యోగాలు సంపాదించారనే ఫిర్యాదులున్నాయి. ఇక రాజస్థాన్‌లోని మీనాలు, ఈశాన్య రాష్ట్రాల గిరిజనులే ఎక్కువగా ఎస్టీ కోటాలో లబ్ధి పొందారు. కొండ రెడ్లు, ఆంధ్ర కోయలు వంటి గిరిజన తెగలు పెద్ద ఉద్యోగాలు సంపాదించాయని మనమెవ్వరమూ వినలేదు. బీసీ రిజర్వేషన్లలో కూడా పురోగతి సాధించిన వెనుకబడి వర్గాలే అధికంగా ప్రయోజనం పొందుతున్నాయి. దీంతో ఆయా వర్గాలకు రిజర్వు చేసిన ఉద్యోగాలు, లేదా అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలను వివిధ కేటగిరీల కింద విభజించాలనే డిమాండ్ తరుచూ వినపడుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో షెడ్యూల్ కులాల రిజర్వేషన్ కోటాను వర్గీకరించాలని మాదిగలు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నారు.

రిజర్వేషన్ల కోసం అగ్రవర్ణాల డిమాండ్లు:

ఈ నేపథ్యంలో అగ్రవర్ణాలు కూడా వారి వాటా వారు కావాలని కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా కారణంగా చిన్న రైతులు వారి పొలాలను పిల్లలకు పంచడంతో అవి ఆర్థికంగా లాభసాటి కాకుండా పోతున్నాయి. దీంతో రైతుల పిల్లలు వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించలేకపోతున్నారు. వారికి విద్య, ఉద్యోగాల అవసరముంది. ఇతర కులాల యువత కాలేజీల్లో, స్కాలర్‌షిప్పుల్లో, ఉద్యోగాల్లో అవకాశాలు పొందడం వీరు చూస్తున్నారు. పొరుగు వారు రిజర్వేషన్ల కారణంగా లబ్ధి పొందుతుంటే, తమకు రాజ్యాంగం ఏమీ చేయలేకపోతుందనే అసంతృప్తి వీరిలో తరాలుగా గూడు కట్టుకుంటోంది. దీంతో అగ్ర వర్ణాలకు చెందిన పేదలు నిరుద్యోగులుగా ఉండిపోవడమో, నగరాల్లో చిరు ఉద్యోగులుగా మిగిలిపోవడమో జరుగుతోంది. వ్యవసాయం యాంత్రీకరణకు గురి కావడంతో గ్రామాల్లో ఉపాధి లేకుండా పోతోంది. దీంతో ప్రభుత్వ రంగంలో, విద్యా సంస్థల్లో తమ పిల్లలకు సమాన అవకాశాలు దక్కడం లేదని అగ్ర వర్ణాలు భావిస్తూ వచ్చాయి.

ఎందుకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగాన్నే కోరుకుంటారు?

అఖిల భారత సర్వీసుల పరీక్షలకు యేటా 15 లక్షల మంది విద్యార్థులు హాజరవుతుంటే వారిలో కేవలం పది వేల మంది మాత్రమే ఎంపిక అవుతుంటారు. ప్రతి రాష్ట్రంలో లక్షల మంది ఉన్నత విద్యార్హత ఉన్న వారు కానిస్టేబుల్, ప్యూన్ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకుంటుంటారు. దీనికి కారణం.. ప్రభుత్వ ఉద్యోగం ఉంటే అధికారం, ప్రతిష్ట, ఉద్యోగ భద్రత, మంచి జీతం ఉంటుంది. అంతే కాకుండా విపరీతమైన అవినీతికి కూడా ప్రభుత్వ ఉగ్యోగాల్లో ఆస్కారముంది. చిన్న ప్రభుత్వ ఉద్యోగులు కూడా వందల కోట్లు అక్రమంగా సంపాదించి అవినీతి నిరోధక విభాగానికి ఎలా చిక్కుతున్నారో ఇటీవల కాలంలో మనమంతా చూస్తున్నాం. నిజానికి కేవలం ఒక శాతం అవినీతి అధికారులే చిక్కారు. చాలామంది అవినీతి అధికారులు దొరకకుండా విలాసవంతమైన జీవితాలను గడిపేస్తున్నారు. దురాశ, ఆంహకారంతో ఈ అవినీతి అధికారులు విర్రవీగుతుంటారు.

ప్రభుత్వ ఉద్యోగం ఏ స్థాయిది అయినా సరే అందులో ఉండే అధికారం కారణంగానే అంతా సర్కార్ కొలువు కోసం వెంట పడుతుంటారు. అది కలెక్టర్ అయినా, ప్యూన్ అయినా ప్రభుత్వ ఉద్యోగమైతే చాలని అనుకుంటారు. ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో సీట్లు, ప్రభుత్వ సంస్థల్లో స్కాలర్‌షిప్పులు తదితరాల్లో కేవలం పది శాతమే రిజర్వేషన్లను అగ్ర వర్ణ పేదలకు కల్పించినప్పటికీ ఇది ఒక ముందడుగా భావించాలి. దేశవ్యాప్తంగా జాట్లు, రాజ్‌పుట్లు, బ్రాహ్మిణ్స్, వైశ్యులు, మరాఠాలు, పటేళ్లు, కాపులు వంటి అగ్ర వర్ణాలు రిజర్వేషన్లు కావాలని ఆందోళనలు చేశారు. గడిచిన 70 సంవత్సరాల్లో ఉన్నత కులాలకు చెందిన ప్రజలకు చివరికి అర్థమైంది ఏంటంటే.. ఉద్యోగాల్లో, కాలేజీ సీట్లలో, స్కాలర్‌షిప్పుల్లో ఇతర సౌకర్యాల్లో తమకు అన్యాయం జరిగిందని గుర్తించారు. కేంద్రీయ విశ్వ విద్యాలయాల్లో రిజర్వుడు కేటగిరీ విద్యార్థులు పీహెచ్‌డీ వంటి ఉన్నత చదువులు చదువుతూ ముప్పై, నలభై వేల ఫెలోషిప్పులను పొందుతున్నారు. అగ్ర వర్ణాల్లోని పేదలు తమకు కూడా అలాంటి సదుపాయాలు కల్పించాలని కోరుకున్నారు.

పది శాతం రిజర్వేషన్లతో అగ్ర వర్ణాలకు కలిగే ప్రయోజనాలు:

1. ఇప్పటికే గుజరాత్ వంటి అనేక రాష్ట్రాలు ఈ చట్టాన్ని అమలు చేయడం మొదలు పెట్టాయి. తెలంగాణా కూడా ఇదే మార్గంలో ఉంది. అగ్ర వర్ణాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే.. ఉద్రిక్తతలు తగ్గుతాయని రాష్ట్రాలు కూడా భావిస్తున్న నేపథ్యంలో ఈ చట్టం శరవేగంగా అమల్లోకి వస్తోంది. సామాజిక వర్గాల మధ్య ఉద్రిక్తతలు తగ్గడంతో ప్రజల మధ్య సామరస్యం నెలకొంటుంది.

2. ఈ పది శాతం రిజర్వేషన్లు క్రిస్టియన్లకు, ముస్లింలకు, ప్రస్తుత రిజర్వేషన్ ఫలాలు పొందని పేదలందరికీ వర్తిస్తుంది. దీని ప్రకారం పేదవాడైన, అర్హత ఉన్న ముస్లిం విద్యార్థికి ప్రయోజనాలు అందుతాయి. గతంలో బ్రాహ్మణులుగా ఉండి క్రిస్టియానిటీ స్వీకరించడంతో కేరళ సిరియన్ క్రిస్టియన్లుగా మారిన వారు కూడా ఈ పది శాతం రిజర్వేషన్లతో లబ్ధి పొందుతారు. నిజానికి పది శాతం అన్నది చాలా తక్కువ మొత్తంలో ఉన్నప్పటికీ, అగ్ర వర్ణ పేద యువకుల్లో అసంతృప్తి జ్వాలలను తగ్గించడానికి దోహదపడుతుంది.



3. 1952 నుంచి కేవలం పది సంవత్సరాలు మాత్రమే రిజర్వేషన్లు అమల్లో ఉండాలని డాక్టర్ అంబేద్కర్ చెప్పారు. అప్పటి నుంచి ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి పార్లమెంటు రిజర్వేషన్లను మరో పదేళ్లకు పొడగిస్తూ వస్తోంది. దీంతో ఈ చట్టం సరిగ్గా లేదని అగ్రవర్ణాలు ఆందోళన చేస్తూ వచ్చాయి. ఇప్పుడు తాజా పది శాతం రిజర్వేషన్లు ఆయా వర్గాల్లోని యువత ఆగ్రహాన్ని కొంతైనా చల్లారుస్తాయి.

4. అగ్రవర్ణాల్లోని పేదలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని మాయవతితో పాటు దేశంలోని దళిత నేతలు సమర్థించారు. అగ్రవర్ణ పేదలకు ఎలాంటి అవకాశాలు లభించకపోవడంతో వారు అగ్రహోదగ్రులుగా ఉన్నారన్న వాస్తవాన్ని ఈ నేతలకూ బాగా తెలుసు. రాజ్యాంగం న్యాయబద్ధంగా ఉంటేనే ప్రజలు అంగీకరిస్తారన్న విషయమూ వారు బాగానే ఎరుగుదురు. రాజ్యాంగం తమ పట్ల వివక్షతతో ఉందని సమాజంలోని ఒక వర్గం భావిస్తే, దీంతో ఇతర సమస్యలు తలెత్తుతాయి. అందువల్లనే అగ్ర వర్ణాల రిజర్వేషన్లకు దళిత నాయకులు సంతోషంగా మద్దతిచ్చారు.

5. అయితే ఈ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కొంతమంది వెనుకబడి తరగతుల నాయకులు ప్రకటనలు ఇచ్చారు. అయితే పార్లమెంటులో వెనుకబడిన వర్గాలకు చెందిన అందరు ఎంపీలు ఈ చట్టానికి అనుకూలంగా ఓటేశారు. రాజ్యాంగపరమైన రక్షణ వలయం వెలుపుల ఉన్నామనే అగ్ర వర్ణ పేదల ఆగ్రహంలో న్యాయముందని వీరికీ తెలుసు.

మలేసియా ఉదాహరణ: దేశంలోని మెజారిటీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన ప్రపంచంలోని ఏకైక దేశం మలేసియా. మలేసియాలో మలయాస్(ముస్లింలు), చైనీయులు, భారతీయులు ప్రధానంగా ఉంటారు. శతాబ్ధాలుగా చైనీయులు మలేసియా ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం చలాయిస్తూ వచ్చారు. అక్కడి భారతీయులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలపై గుత్తాధిపత్యం కలిగి ఉన్నారు. ఇక దేశంలో మిగిలిన 60 శాతం మంది ముస్లింలు దీనిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బ్రిటీష్ వారి నుంచి మలేసియాకి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భూమిపత్ర విధానాన్ని తీసుకొచ్చారు. దీని ప్రకారం ఉపాధి, ఉద్యోగాలు, వ్యాపారాలు తదితరాల్లో మాల్యాస్‌కి తప్పనిసరిగా అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అభివృద్ధి చెందాల్సిన స్థాయిలో మలేసియా ఆర్థిక వ్యవస్థ పురోగమించకపోవడంతో భూమిపత్ర విధానాన్ని మార్చాలనే వాదనలు తలెత్తుతున్నాయి. మలేసియా నుంచి చైనీయుల పెట్టుబడులు విదేశాలకు తరలివెళ్లడం, బాగా చదువుకున్న భారతీయులు యూరోప్, అమెరికాకి వలస వెళ్లడం ఆ దేశానికి సమస్యగా మారింది.

అందుకనే అన్ని రిజర్వేషన్ విధానాలను జాగ్రత్తగా అమలు చేయాలి. అగ్ర వర్ణాల్లోని పేదల ఆగ్రహాన్ని పది శాతం రిజర్వేషన్లు పూర్తిగా చల్లారుస్తాయని భావించలేం. అయితే అగ్ర వర్ణ పేదలకు కొంత ఊరట అయితే అవసరముంది. వీరికి ఉద్యోగాలు, విద్యాలయాల్లో సీట్లు, స్కాలర్‌షిప్పుల విషయంలో జరిగిన అన్యాయానికి తాత్కాలిక పరిష్కారం లభించినట్లు అనుకోవాలి. ఇక ఇటువంటి చట్టాలు భారతదేశాన్ని ఎలా ప్రభావితం చేయనున్నాయో కాలమే వెల్లడించాలి.

విదేశీ పర్యటనల వల్ల ఒరిగిందేమిటి?

ప్రధానమంత్రి నరేంద్రమోడీ గడిచిన నాలుగు సంవత్సరాల తొమ్మిదిమాసాల్లో 52సార్లు విదేశీ పర్యటనలు జరిపారు.ఇందుకోసం కేంద్రం 2,021కోట్ల రూపాయిలు ఖర్చు చేసింది.ప్రధాని విదేశీ పర్యటనలన్నీ పెట్టుబడుల కోసం కాదు.విదేశాలతో దౌత్య సంబంధాలు మెరుగుపర్చుకోవడానికి జరిపే పర్యటనలు ఎక్కువగా ఉంటాయి.దేశాధినేతగా ఆయనకు ఆ బాధ్యత ఉంది,హక్కూ ఉంది.దానిని ఎవరూ ప్రశ్నించడానికి వీలులేదు.కేంద్రమంత్రులు,రాష్ట్రా ల ముఖ్యమంత్రులు,మంత్రులు జరిపేవి పూర్తిగా పెట్టుబడుల కోసమే. పూర్వపు ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కన్నా మోడీ ఎక్కువగా విదేశీ పర్యటనలు జరిపారు.మన్మోహన్ సింగ్ 2009 నుంచి 2014 వరకూ జరిపిన విదేశీ పర్యటనలకు 1,304 కోట్ల రూపాయిలు వ్యయం అయింది. ప్రధానమంత్రి విదేశీ పర్యటనలు జరిపినా, స్వదేశంలో వివిధ రాష్ట్రా ల్లో పర్యటించినా అయ్యే వ్యయం ఎప్పుడూ ఎక్కువగానే ఉంటుంది.భద్రతాపరమైన కారణాలతో విఐపీల పర్యటన వ్యయం నానాటికీ పెరిగిపోతోంది.మన దేశం గురించి విదేశీ ప్రసార సాధనాలు,ముఖ్యంగా టెలివిజన్‌చానల్స్ లోనూ, సామాజిక మాధ్యమాలలోనూ వ్యతిరేక ప్రచారం ఎక్కువగా జరుగుతోంది. ఇది ఇప్పుడు కొత్త పోకడ కాకపోయినా, మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత, భారత్‌పై మతపరమైన ముద్ర వేయడానికి పెద్ద ఎత్తున ప్రచారాలు జరిగాయి.అయితే, అవన్నీ ఫలించి ఉంటే మన దేశం ఈ పాటికి ఏక —కి అయి ఉండేది.మన విఐపీలు జరిపే విదేశీ పర్యటనల వల్ల అదనంగా కలిసొచ్చేది ఏమీ లేకపోయినా, చులకన అవుతున్నామన్న అభిప్రాయాన్ని విశ్లేషకులు తరచూ వ్యక్తంచేస్తుంటారు.సంకీర్ణ యుగంప్రారంబమైన తర్వాత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను అమెరికాలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, మన దేశం వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగిఉండటం వల్ల కొంత మెరుగు ఉన్నట్టే, అగ్రరాజ్యంవైపు మొగ్గి పోయామన్న విమర్శలనూ మన దేశం ఎదుర్కొంటోంది. మన దేశంపై గతంలోదాయాది దేశమైన పాకిస్తాన్ మాత్రమే విషం కక్కేది.ఇప్పుడు పాక్ తోపాటు చైనా జత కట్టింది.చైనా పాక్ ని వెనకేసుకువచ్చేందుకు మన దేశంపై విష ప్రచారం చేస్తోంది.ఈ విషయం ప్రభుత్వానికి తెలుసు.అందుకు తగిన నివారణ చర్యలను తీసుకుంటోంది.కానీ అవిచాలవు. చైనా నుంచి దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలు విధించడం పూర్తిగా ఆ రెండు దేశాల మధ్య ఉన్న ఆంతరంగికవ్యవహారం.అయితే అమెరికాతో మన దేశం రక్షణ రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నందుకు చైనా మనపై గుర్రుగా ఉంది.అంతేకాక,దక్షిణ చైనా సముద్రంలోని దీవుల విషయంలో చైనా అనుసరిస్తున్న పెత్తందారీ వైఖరిని మన దేశం వ్యతిరేకించడం,సిక్కిం సరిహద్దుల్లో డోక్లాం వద్ద చైనీస్ సైనికుల చొరబాట్లను అడ్డుకోవడం వల్ల కూడా చైనా మనపై శత్రు వైఖరిని అనుసరిస్తోంది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలోనూ, అణు ఇంధన దేశాల మండలిలోనూ మన దేశానికి సభ్యత్వం రాకుండా అడ్డుకుంటోంది. అమెరికాతో మన దేశం రక్షణ రంగంలో భాగస్వామ్యాన్ని కలిగి ఉండటం వల్ల చైనా మన దేశంపై మరింతగా శత్రు వైఖరిని అనుసరిస్తోంది.ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అనుసరిస్తున్న యాక్ట్ ఈస్ట్ విధానం పట్ల కూడా చైనా తీవ్ర అసంతృప్తితో ఉంది. తూర్పు, ఆగ్నేయాసియా దేశాల్లో తన ప్రాబల్యానికి ఎక్కడ ముప్పు వస్తుందోనని చైనా బెదురుతోంది.మోడీ మయన్మార్,మంగోలియా,జపాన్,వియత్నాం తదితర దేశాల్లో జరిపిన పర్యటనలూ, కుదుర్చుకున్న ద్వైపాక్షిక ఒప్పందాలు చైనా అపోహలకు ఆజ్యం పోశాయి. చైనామన దేశం పట్ల శత్రువైఖరినే ప్రదర్శిస్తోంది.చైనా కుతంత్రాలను ఎదుర్కోవడానికి ఇతరదేశాలతో మన దేశం మరింతగా సాన్నిహిత్యాన్ని పెంచుకోవల్సి ఉంది.ఈ క్రమంలోనే ప్రధానమంత్రి ఎక్కువగా విదేశీ పర్యటనలు చేస్తున్నారు. రాష్ట్రా ల ముఖ్యమంత్రులు.మంత్రులు జరిపే విదేసీ పర్యటనలు పూర్తిగా విదేశీ పెట్టుబడుల కోసమైనందున వారి పర్యటన్లలో ఏమేరకు ఒప్పందాలు కుదుర్చుకుని వచ్చారో తెలుసుకోవాలన్న ఆసక్తి పౌరుల్లో ఉండటం సహజమే.అయితే,సమాచార హక్కు చట్టం కింద ప్రతిపక్షాలు, ఆ చట్టం అమలు కోసం పని చేస్తున్న కార్యకర్తలు సమాచారం కోసం దాఖలు చేసే దరఖాస్తులను పట్టించుకోకపోవడంతో ప్రజలకు సమాచారం అందడం లేదు.

కాంగ్రెస్ హయాంలో కూడా విఐపీల విదేశీ పర్యటనలు ఎక్కువగా ఉండేవి. విదేశాలకు మన దేశం మాదిరిగా ఆర్థిక,సైనిక సాయం అందజేయడం లేదన్నది వాస్తవం.అయితే, ఆఫ్ఘనిస్థాన్‌కు మన దేశం ఇప్పటికీ అందిస్తున్న సాయం గురించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తక్కువచేసి మాట్లాడటం అవమానకరమే. అమెరికాతో సమాన దూరంలో ఉండాలన్న అలీన విధానానికి భిన్నంగా వ్యూహాత్మక ఒప్పందాలూ, భాగస్వామ్యాలను కుదుర్చుకోవడం వల్ల అమెరికా అధినేతకు చనువుపెరిగింది.అందుకే ట్రంప్ ఆప్రకటన చేసి ఉంటారు.అలీనఉద్యమంలో క్రియాశీలంగా కొనసాగినంత కాలం మన దేశాన్ని వేలెత్తి చూపడానికి అమెరికా,రష్యాలు అప్పట్లో బెదిరేవి. అలీనోద్యమ అధినేత్రిగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తన హయాంలోఅమెరికా అధ్యక్షులను గడగడలాడించేవారు. అలీనోద్యమ అధినేత్రిగా ఆమె వాషింగ్టన్ పర్యటనకు వెళ్లినప్పుడు ఆనాటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చిన తీరుతో ఆమెను పది మంది మగవారి పెట్టు అని నిక్సన్ చేసిన వ్యాఖ్యను గురించి ఇప్పటికీ గుర్తుకు తెచ్చుకుంటూ ఉంటారు. మహిళా రిజర్వేషన్లపై ఇటీవల లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్య భారత మహిళలకు లభిస్తున్న గౌరవానికి నిదర్శనం.

-స్వామి



సాఫీగా తిరుగు ప్రయాణం

• టోల్‌గేట్ అడ్డంకులకు స్వస్తి

చౌటుప్పల్, ప్రభ న్యూస్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని హైద్రాబాద్ నుంచి వివిధ జిల్లాలకు వాహనాలలో తరలి వెళ్లిన ప్రజలు సెలవు ముగియడంతో బుధవారం సాయంత్రం పెద్ద ఎత్తున హైద్రాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ సమస్యలు ఎదురుకాకుండ ఉండేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు ఫీజులు వసులు చేయకుండా గేట్లు అన్ని ఎత్తివేయడంతో ప్రయాణికులంతా సాఫీగా హైద్రాబాద్‌కు తరలివెళ్లారు. వాహనాలన్నీ ఒకేసారి వెళ్లడంతో జాతీయ రహదారి పూర్తిగా నిండిపోయింది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండ డీసీపీ రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు ట్రాఫిక్ పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

నేడూ టోల్ వసూళ్లు లేవు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్రాంతికి గ్రామాలకు వెళ్ళి వచ్చే వారికి గురువారం సాయంత్రం వరకు టోల్ వసూళ్ళు లేవు. వాస్తవానికి 16 న టోల్ వసూలు చేయొద్దని రెండు తెలుగు రాష్ట్రా లు ఆదేశాలు జారీ చేశాయి. అయితే బుధవారం కనుమ నేపథ్యంలో చాలా మంది బుధవారం సాయంత్రం నుంచి ప్రయాణాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ నేపత్యంలో టోల్ ప్లాజాల వద్ద గురువారం సాయంత్రం వరకు రద్దీ ఏర్పడే అవకాశాలున్నందున గురువారం అర్థరాత్రి గం. 12వరకు టోల్ వసూళ్ళు ఉండవని అధి కారులు స్పష్టం చేశారు.

షర్మిలపై దుష్ప్రచారం

10 వెబ్‌సైట్లను గుర్తించాం: డీసీపీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వైఎస్ షర్మిల ఫిర్యాదుపై విచారణ వేగం పెంచినట్లు అదనపు డీసీపీ రఘువీర్ తెలిపారు. సోషల్ మీడియాలో వీడియో అండ్ కామెంట్స్‌కు సంబంధించి యూఆర్ఎల్‌పై విచారణ చేస్తున్నామన్నారు. పది వెబ్‌సైట్లను గుర్తించామని, 15 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే విచారణ కోసం స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేశామని, యూట్యూబ్, ఫేస్‌బుక్ నుంచి సమాచారం రావాల్సి ఉందన్నారు. కొన్ని యూట్యూబ్ అండ్ ఫేస్‌బుక్ గ్రూప్స్‌లో ఎక్కువగా అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టారన్నారు. వీడియోలు తయారీ చేసిన వాళ్లతో పాటు వెనుకాల ఉన్న వాళ్లపై కూడా చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదుపైన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు.

షర్మిలకు రాములమ్మ మద్దతు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు విజయశాంతి, వైఎస్ఆర్ పార్టీ నేత వైఎస్ షర్మిలకు మద్దతుగా నిలిచారు. వైఎస్ జగన్ సోదరి షర్మిలపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారంపై విజయశాంతి తీవ్రంగా ఖండిస్తూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజంలో మహిళల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో షర్మిలపై చేస్తున్న వ్యాఖ్యలే నిదర్శనమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా మహిళా సెలబ్రిటిలపైన కూడా కొంత మంది అల్లరి మూకలు విషం కక్కుతున్నారని, వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని విజయశాంతి డిమాండ్ చేశారు. 40 ఏళ్లుగా సినిమా, రాజకీయలలో మహిళా సాధికారత కోసం పోరాడిన వ్యక్తిగా తాను స్పష్టమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నట్లు వివరించారు. ఇందులో ఎలాంటి రాజ కీయం లేదని, పార్టీ ప్రమేయం కూడా లేదని ఆమె చెప్పారు.

జగన్‌పై దాడి కేసు.. కొందరికి నోటీసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి కేసులో కొందరికి నోటీసులు జారీ చేసింది జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ. జగన్‌పై దాడి చేసిన శ్రీనివాసరావును ఏడు రోజుల కస్టడీకి తీసుకున్నారు ఎన్ఐఏ అధికారులు. అందులో భాగంగా 5 రోజులుగా విచారిస్తున్న అధికారులు.. మంగళవారం రాత్రి గాంధీ ఆసుపత్రిలో శ్రీనివాసరావుకు వైద్య పరీక్షలు చేయించినట్లు తెలిపారు. అతడి తరపు న్యాయవాది సలీమ్. అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. జగన్‌పై దాడి చేయడం వెనుక ఉన్న పరిణామాలను ఎన్ఐఏ అధికారులకు శ్రీనివాసరావు వివరించాడని తెలిపారు సలీమ్. జగన్‌కు సానుభూతి తిరిగి వచ్చే ఎన్నికల్లో ఆయన సీఎం అవుతాడనే కారణంగా ఈ దాడికి పాల్పడినట్లుగా అధికారులకు వెల్లడించినట్లు చెప్పారు. అదలా ఉంటే శ్రీనివాసరావు కాల్‌డేటాపై ఎన్ఐఏ అధికారులు దృష్టిసారించారు. అంతేకాదు, అతడు జైల్లో ఉన్నప్పుడు రాసిన 22 పేజీలపై కూడా నజర్ పెట్టారు. ఈ క్రమంలో తాజాగా శ్రీనివాసరావు పనిచేసిన విశాఖపట్నం విమానాశ్రయం క్యాంటీన్ ఓనర్‌తో పాటు ఇంకొందరికి నోటీసులు జారీ చేశారు.

హైదరాబాద్‌లో వ్యక్తి దారుణ హత్య



హైదరాబాద్ / చార్మినార్, ఆంధ్రప్రభ : పాతబస్తీ ఒక్కసారిగా ఉలికిపాటుకు గురైంది. ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మంగళవారం అర్థరాత్రి చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దారుణ సంఘటన చోటు చేసుకుంది. మామాజుమ్మా పాఠక్ ప్రాంతంలోని నోమినాథ్ మఠ్‌లో మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తిపై ఇద్దరు దుండుగులు కత్తులతో దాడిచేసి హత్య చేశారు. ఘాన్సీ బజార్‌కు చెందిన రవి అలియాస్ పీటర్ రవిలను ఇద్దరు దుండగులు కలిశారు. ముగ్గురి మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీయడంతో రవిని హత్య చేశారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను మొబైల్ ఫోన్‌లో కొందరు రికార్డు చేసినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న చార్మినార్ ఇంఛార్జి ఏసీపీ ఆనంద్, ఇన్‌స్పెక్టర్ ఘటనాస్థలికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను ఘటనాస్థలికి రప్పించారు. రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా, పథకం ప్రకారమే రవిని ఆ ఇద్దరు హత్య చేశారని తెలుస్తోంది. ఆ ఇద్దరు రవికి స్నేహితులని సమాచారం. నిందితులు బజరంగ్, పప్పులతో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది.

సెల్ టవర్ దొంగల పట్టివేత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సెల్‌టవర్ల బ్యాటరీ దొంగల ముఠాను ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. శివార్లలో సెల్‌టవర్లకు ఏర్పాటు చేసిన బ్యాటరీలను ఈ ముఠా దొంగిలించింది. ఆదిభట్ల, చౌటుప్పల్, పటాన్‌చెరుతో పాటు పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ ముఠా వరుస దొంగతనాలకు పాల్పడిందని పోలీసులు తెలిపారు. ముఠాలోని ముగ్గురు సభ్యులతో పాటు.. ఆ బ్యాటరీలను నిందితుల నుంచి కొనుగోలు చేసే మరో ఇద్దరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు దొంగిలించిన బ్యాటరీలను బోలక్‌పూర్‌లోని స్క్రాప్ దుకాణాల్లో విక్రయిస్తున్న తరుణంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, మరికొంతమంది ముఠా సభ్యులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు అయిన ముగ్గురు ముఠా సభ్యుల నుంచి రూ.2.50 లక్షల నగదు, రెండు కార్లతో పాటు చోరీకి ఉపయోగించే పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వ్యవసాయ రంగాన్ని ఆదుకోండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్షోభంలో చిక్కుకుంటున్న వ్యవసాయ రంగానికి ఊతమివ్వాలని జేఆర్‌జీ గ్రూపు కంపెనీల ఛైర్మన్ సుదీప్ బంధోపాధ్యాయ్ అన్నారు. పంటల నూర్పిడి తర్వాత మార్కెట్ దోపిడీకి గురికాకుండా రైతులను ఆదుకునేందుకు ఆర్థిక సాయంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొన్నారు. జాతీయ స్థూల ఉత్పత్తిలో ఎక్కువ భాగస్వామ్యం కలిగిన వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతులను ఆదుకునేందుకు పారిశ్రామిక వర్గాలు, ప్రభుత్వం, విద్యావేత్తలు సంయుక్తంగా కృషి చేయాలని బంధోపాధ్యాయ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇక్ఫాయ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జె.మహేందర్‌రెడ్డి, ఎస్‌బీఐ స్టాఫ్ కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ర వర్ణ పేదలకు తాంబూలం



(మొదటిపేజీ తరువాయి)

అమల్లోకి తీసుకురావాలనుకుంటున్నారు. అందులో భాగంగానే ప్రత్యేక రిజర్వేషన్లు, సరికొత్త పథకాలకు కసరత్తు చేయాల్సిందిగా ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రంలో అమలవుతున్న రిజర్వేషన్లలో బీసీలకు 25శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, ముస్లింలకు 4శాతం, మొత్తం 50 శాతం లోపు ఉన్నాయి. అయితే ఆ పరిధిని మించి రిజర్వేషన్లు కల్పించాలన్న ఆలోచనతో ముందడుగు వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రిజర్వేషన్లను పరిశీలిస్తే 15 శాతం ఎస్సీలకు, 7.5శాతం ఎస్టీలకు, 27శాతం ఈబీసీలకు నిర్ధేశింపబడ్డాయి. తాజాగా పార్లమెంట్‌లో చేసిన రాజ్యాంగ సవరణ ప్రకారం అగ్రవర్ణాల్లో పేదలుంటే రిజర్వేషన్లు పెంచుకునే వెసులుబాటు కలిగింది.

రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం నిర్విరామంగా కొనసాగుతున్నప్పటికీ పెరుగుతున్న జనాభా, ఆర్థిక స్వావలంబనకు దూరంగా ఉన్న కొన్ని కులాలను దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ అగ్రకులాల పట్ల ఆదరణ చూపాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ వర్గాల కోసం ఇప్పటికే విద్యా, వైద్య, ఆరోగ్య పరిరక్షణ విషయంలో ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు కల్పిస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందలేకపోతున్న అగ్రకుల పేద వర్గాలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికోసం త్వరలోనే ప్రత్యేక పథకాలను అమలు చేస్తామని గత ఏడాది తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున సీఎం ప్రకటించారు. రాష్ట్రంలో అగ్రకుల పేదలందరికీ న్యాయం జరుగుతుందని సంకేతాలు ఇచ్చారు. తన దృష్టిలో రాష్ట్ర ప్రజలంతా సమానమేనని, అయితే దశల వారీగా అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్న ఆలోచనను ప్రజాక్షేత్రంలో ఆవిష్కరించారు.

వాస్తవానికి అగ్రకులాల్లోనూ అనేక మంది పేదలు ఉన్నారు. వారి జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే ఒక కార్యాచరణ ప్రణాళికను ప్రకటించనుంది. ఉద్యమ నేతగా 14 ఏళ్ళ పాటు గ్రామగ్రామాన పర్యటించి ప్రజల జీవన స్థితిగతులపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉన్న సీఎం కేసీఆర్ అగ్రకుల పేదలకు తప్పకుండా న్యాయం చేస్తారన్న ధీమా, నమ్మకం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రత్యేకంగా విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో కొన్ని పథకాల ద్వారా ప్రాధాన్యత కల్పిస్తారు. రిజర్వేషన్ల అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. కులం ఏదైనా పేదరికాన్ని నిర్మూలించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్న ఉద్దేశంతోనే విధాన ప్రకటన చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇప్పటికే రికార్డు స్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మందికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ట్రాఫిక్ కానిస్టేబుళ్ళకు 30 శాతం రిస్క్ అలవెన్స్‌ను ఇస్తున్నారు. గత ఏడాది జూన్ 2 నుంచి రైతు సమన్వయ సమితుల భూమిక అత్యంత ప్రాధాన్యతగా మారింది.

వచ్చే రెండేళ్ళలో అత్యంత ధనికులున్న రైతు కుటుంబాలు ఎక్కడున్నాయంటే.. అది తెలంగాణేనని చెప్పుకోవాల్సిన పరిస్థితి ని తీసుకురావాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వెయ్యికోట్లతో మత్స్యకారుల సంక్షేమం, రూ.5వేల కోట్లతో గొల్ల, కుర్మలకు గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన ప్రభుత్వం వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుస్తోంది. అలాగే 50 శాతం సబ్సిడీపై చేనేత కార్మికులకు నూలు, రసాయనాలు, మరమగ్గాలు సరఫరా చేస్తున్నారు. దేశానికే ఆదర్శంగా మారిన రైతుబంధు పంట పెట్టుబడి, జీవిత బీమా పథకాలకు తెలంగాణా నుంచే బీజంవేసి చరిత్రలో నిలిచారు. మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రూ.4వేల కోట్లు కేటాయిస్తే ఒక్క తెలంగాణలోనే రూ.2వేల కోట్లు కేటాయించి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. అన్ని వర్గాలకు మేలు చేకూర్చే ప్రతిష్టాత్మకమైన మిషన్ భగీరథ కార్యక్రమంపై ఇప్పటికే 20 రాష్ట్రాలు అధ్యయనం చేశాయి. తాజాగా వచ్చే బడ్జెట్‌లో అగ్రవర్ణ పేదలకు ప్రాధాన్యత ఇచ్చి సంక్షేమ రంగంలో తానంటే ఏమిటో నిరూపించుకోవాలన్న తపనతో సీఎం ముందుకు సాగుతున్నారు.

ఈసారీ ఖైదీలకు క్షమాభిక్ష లేనట్టే!

• మూలనపడ్డ మార్గదర్శకాల ఫైల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: క్షణికావేశంలో తప్పు చేసి దీర్ఘకాలంగా జైలులో మగ్గుతున్న వారికి ఇది చేదు వార్త. చేసిన తప్పును తెలుసుకుని మానసికపరివర్తన చెందిన వారికి ఇది మరీ బాధించే విషయం. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు ప్రభుత్వం ప్రసాదించే క్షమాభిక్షతో బాహ్య ప్రంపంచంలో జీవించాలనుకునే ఖైదీలకు తీరని క్షోభ కలిగించే విషయం. సత్ప్రవర్తనతో మెలిగిన ఖైదీలకు ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదిస్తుందని ఎదురు చూస్తున్న ఖైదీలు, వారి కుటుంబీకులు, బంధు, మిత్రులకు ఈసారీ నిరాశే ఎదురవుతుంది. జనవరి 26 న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదిస్తుందని భావిస్తున్నారు. అయితే ఖైదీల క్షమాభిక్షకు సంబంధించిన మార్గదర్శకాలకు ప్రభుత్వ ఆమోదం తెలపడంలో జాప్యం కారణంగా ఖైదీల విడుదలలో జాప్యం ఏర్పడనుంది.

వాస్తవానికి గడచిన రెండేళ్ళుగా రాష్ట్ర ప్రభుత్వం ఖైదీల క్షమాభిక్షపై ఎప్పటికప్పుడు కసరత్తు చేస్తోంది. గతేడాది ఖైదీల విడుదలకు అనుసరించాల్సిన మార్గ దర్శకాల రూపకల్పనపై ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీకి తెలంగాణ జైళ్ళ ఐజీ ఆకుల నర్సింహా నేతృత్వంలో జైళ్ల శాఖకు చెందిన ఇద్దరు డీఐజీలను కూడా చేర్చింది. ఈ కమిటీ కేవలం మూడు మాసాలలోనే మార్గదర్శకాలను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. అప్పటి నుంచి ఈ మార్గదర్శకాల ఫైల్ ప్రభుత్వ పరిశీలనలో ఉంది. వాస్తవానికి గత ఏడాది జనవరి 26న మార్గదర్శకాలకు ఆమోదం తెలిపి ఖైదీలకు క్షమాభిక్షపై స్పష్టత వస్తుందని భావించారు.

ఆ తర్వాత ఆగస్టు 15, గాంధీ జయంతి రోజైనా అక్టోబర్ 2న ప్రకటన వస్తుందని అనుకున్నప్పటికీ సాధ్యం కాలేదు. కారణం అసెంబ్లీకి మధ్యంతర ఎన్నికలు రావడమేనని అనుకున్నారు. తాజాగా ఎన్నికలు ముగిసి ప్రభుత్వం ఏర్పాటై పాలన సాఫీగా సాగుతున్నప్పటికీ ఖైదీల విడుదలకు సంబంధించిన మార్గదర్శకాల ఫైల్ ఎక్కడ పెట్టింది అక్కడే ఉండిపోయింది. దీంతో ఈసారి కూడా ఖైదీలకు క్షమాభిక్ష లేనట్లేనని అధికారులు అంటున్నారు.

క్షమాభిక్ష కోసం రాష్ట్రంలోని చంచల్‌గూడ, చర్లపల్లి, వరంగల్ కేంద్ర కారాగారాలతో పాటు వేర్వేరు జైళ్ళలో మగ్గుతున్న సుమారు 158 మంది ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్న సమయంలో ఖైదీల క్షమాభిక్షకు ప్రభుత్వం అనుమతించింది. ఆ తర్వాత క్షమాభిక్ష ప్రకటన రాకపోవడంతో ఎంతో మంది ఖైదీలు, వారు కుటుంబీకులు ప్రభుత్వ ప్రకటన కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. గతంలో ఖైదీల పక్షాన పలు రాజకీయ పార్టీలు క్షమాభిక్ష కోసం ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం కనిపించడం లేదు. చివరకు ప్రత్యేక రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్షమాభిక్ష ప్రక్రియ కొలిక్కి వచ్చిందనుకున్నప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో ఖైదీలు, వారి కుటుంబీకులున్నారు.

రేపు మారెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ నియమించిన తొలి కార్పొరేషన్ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎర్రమంజిల్‌లోని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ భవన్‌లో పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్‌గా శుక్రవారం ఉదయం 11 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నట్లు మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

విజయవాడలో 25న స్వార్థంపై యుద్ధం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తనను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి అన్యాయంగా బహిష్కరించారని శివకుమార్ అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి హోదాలో పార్టీ పేరుతో పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రకటన జారీచేసి బహిష్కరణకు గురైన శివకుమార్ మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపకుడినైన తనని బహిష్కరించడానికి నిరసనగా ఈనెల 25న విజయవాడలో స్వార్థంపై యుద్ధం పేరుతో దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు.

పండుగ పిలిచింది...

మృత్యువు మింగేసింది

• సొంత ఊరు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం • రెండు వాహనాలను ఢీకొట్టిన కారు • ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం • ఆరుగురికి గాయాలు... సూర్యాపేట జిల్లాలో దుర్ఘటన • మృతులంతా నూజివీడువాసులు



మృతులు మురళీకృష్ణ, కవిత, ధనూష

కోదాడ, ప్రభ న్యూస్ : స్వగ్రామమైన నూజివీడు మండలం పోతినేనిపాలెంలో సంక్రాంతి వేడుకలు జరుపుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైన ఓ కుటుంబాన్ని మృత్యువు కాటేసింది. సంక్రాంతి వేడుక ముగించుకుని వస్తూండగా వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురికావడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ రావిరాల వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణాజిల్లా నూజివీడు మండలం పోతినేనిపాలెం గ్రామానికి చెందిన రావి వెంకట మురళీకృష్ణ(48), అక్కినేని కవిత (35), రావి ధనూష (16) వారి కుమారుడు హైద్రాబాద్‌కు వెళ్తుండగా సూర్యాపేట జిల్లా కొమరబండ బైపాస్ వద్దకు రాగానే కారు ముందు టైర్ పేలిపోయింది. వాహనం అదుపుతప్పి డివైడర్ మీద నుండి ఫల్టీకొట్టి, అవతల విజయవాడ వైపు వెళ్తున్న రెండు కార్లను ఢీట్టింది. ప్రమాదానికి గురైన కారులో ప్రయాణిస్తున్న మురళీకృష్ణ, కవిత, ధనూష అక్కడికక్కడే మృతి చెందారు. కాగా వారి కుమారుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతదేహాలను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా రెండు కార్లలో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలవడంతో వారిని కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి, సీఐ రవిల ఆధ్వర్యంలో ఎస్ఐ, సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

స్టోన్ క్రషర్ల పునరుద్ధరణకు ఎన్జీటీ నో

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : అనంతపురం జిల్లా నేమికల్లు స్టోన్ క్రషర్‌ల పునరుద్ధరణకు జాతీయ హరిత ట్రిబ్యునల్ నిరాకరించింది. స్టోన్ క్రషర్‌లకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై ఎన్జీటీ బుధవారం విచారణ చేపట్టింది. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి స్టోన్ క్రషర్‌లను మూసివేయాలని ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇవ్వాలని కంపెనీ యజమానులు కోరారు. దీనిపై స్టే ఇచ్చేందుకు ఎన్జీటీ నిరాకరించింది. ఒక్క కంపెనీ కూడా పూర్తి స్థాయి పర్యావరణ నిబంధనలు పాటించడం లేదని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదిక సమర్పించింది. ధన్ బాద్ మైన్స్ ఐఐటీ అధ్యయనం జరపడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు నెలల సమయం కోరింది. దీంతో ఆరు వారాల్లో అధ్యయనం చేయాలని ఎన్జీటీ ఆదేశించింది. తాము కమిటీ వేసి తనిఖీలు జరిపే వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ట్రిబ్యునల్ ప్రభుత్వ తరఫు న్యాయవాదులను ప్రశ్నించింది. కంపెనీల యజమానులు చంపేస్తామని బెదిరిస్తున్నారని పిటిషనర్ హీరోజీ రావు తెలిపారు. నేమికల్లులో స్టోన్ క్రషర్‌లు పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని, వాటి వల్ల పరిసర గ్రామాలు కాలుష్యానికి గురవుతున్నాయని ఆయన పిటిషన్ వేశారు. పరిస్థితులు అలా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ సూచించింది. నేమికల్లు స్టోన్ క్రషర్‌లపై దాఖలైన పిటిషన్‌పై తదుపరి విచారణను మార్చి 6కు వాయిదా వేసింది.



అలహాబాద్: రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ పర్యటన నేపథ్యంలో భరద్వాజ్ ముని పార్క్‌లో భరద్వాజ్ ముని విగ్రహానికి తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారులు..

పశుసంపద వృద్ధికి

బ్రెజిల్‌తో ఒప్పందం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో మేలు జాతి పశుసంపద అభివృద్ధి కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం బ్రెజిల్ దేశంతో ఎంఓయు కుదుర్చుకునేందుకు సూత్రప్రాయంగా అంగీకరించింది. బ్రెజిల్ 1908నుంచి ఇండియాకు చెందిన ఉత్తమ పశు జాతులు గిర్, సాహీవాల్, కంక్రేజ్, ఒంగోలు పశువుల బ్రీడ్‌ను అభివృద్ధి చేస్తూ వస్తోంది. 75 లీటర్ల దాక పాల దిగుబడి ఇచ్చే విధంగా ఈ జాతి పశువుల్లో జన్యుపరమైన అభివృద్ధిని చేస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం బ్రెజిల్ దేశాల మధ్య పశుసంపద అభివృద్ధికి చెందిన సాంకేతిక పరిజ్ఞానం మార్పిడి చేసుకునేందుకు సూత్రప్రాయంగా అంగీకారం కుదిరింది. ఏప్రిల్‌లో బ్రెజిల్‌లో జరిగే పశుప్రదర్శనను సందర్శించాలని ఆ దేశ ప్రతినిధులు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారులను ఆహ్వానించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, డైరెక్టర్ డి.వెంకటేశ్వర్లు, బ్రెజిల్ ప్రతినిధులు టార్సీ, సియో క్కజ్ మెస్కిటా, జోస్ రిబామార్ తదితరులు పాల్గొన్నారు.

కన్హా శాంతివనంలో 200 మందికి శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నుంచి 200 మంది విద్యార్థులు, 23 మంది ఉపాధ్యాయులు నైపుణ్యాలు పెంచుకునేందుకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. చేగూరులోని కన్హా శాంతివనంలో ఈ నెల 5 నుంచి 15వ తేదీవరకు ఆకాంక్షల పెంపు, జీవన నైపుణ్యాలపై ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. గచ్చిబౌలిలోని నేషనల్ ట్రైబల్స్ స్పోర్ట్స్‌లో నిర్వహించే స్పోర్ట్స్‌లో 20 రాష్ట్రాల నుంచి 1100 మంది విద్యార్థులు పాల్గొంటారు. ఈ స్పోర్ట్స్‌లో పాల్గొనే విద్యార్థులకు కన్హా శాంతివనం ఆతిథ్యమిస్తోంది. 11 రోజులపాటు నిర్వహించే బ్రైటర్ మైండ్స్ కార్యక్రమం విద్యార్థుల ఆకాంక్షలకు పదును పెట్టనుంది. ఈ శిక్షణా కాలంలో నైపుణ్యాల పరిశీలన, బీఎం ట్రైనింగ్ మెథడ్స్, అబాకస్ టూల్స్ వినియోగం, యోగ తదితర విభాగాల్లో శిక్షణ పూర్తి చేసుకున్నారు. పోచారంలోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌ను సందర్శించారు. సేంద్రీయ వ్యవసాయం, ఆహారం, నీటి సంరక్షణ, ఆధ్యాత్మిక విలువలు, స్ఫూర్తిదాయకమైన సినిమాను ఈ సందర్భంగా చూశారు. శిక్షణా కార్యక్రమం పూర్తయిన 11వ రోజున విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

రేపు ఎన్టీఆర్ వర్ధంతి

తెలుగు రాష్ట్రాల్లో రక్తదాన శిబిరాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టి రామారావు వర్ధంతి సందర్భంగా ఎన్‌టిఆర్ ట్రస్టు ఈనెల 18న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో లెజండరీ బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఎన్‌టిఆర్ మహోన్నత వ్యక్తిత్వాన్ని, సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని మరింత సేవ చేయనున్నామని ఆమె పేర్కొన్నారు. గత ఏడాది రెండు రాష్ట్రాల్లో 140కిపైగా బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా స్వచ్ఛంద రక్త దానానికి స్ఫూర్తినిస్తూ మరింత ఉత్సాహంతో పాల్గొనాలని భువనేశ్వరి పిలుపునిచ్చారు.

ఈ రక్తదాన శిబిర కార్యక్రమంలో ఎన్‌టిఆర్ ట్రస్టు బ్లడ్ బ్యాంకుతో పాటు రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, ప్రభుత్వ, ఇతర బ్లడ్ బ్యాంకులు పాల్గొంటున్నాయని ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో టి.విష్ణువర్ధన్ తెలిపారు. హైదరాబాద్ ఎన్‌టిఆర్ ట్రస్టు భవన్‌లో భువనేశ్వరితో పాటు నారా బ్రహ్మణీ ఉదయం 9 గంటలకు రక్తదాన సేకరణను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

ప్రజా నాయకుడు ఎన్టీఆర్: సుహాసిని

తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్య మంత్రి దివంగత ఎన్‌టి రామారావు ప్రజా నాయకుడని, తెలుగు ప్రజల్లో ఆయన స్థానం ఎప్పటికీ పదిలంగా ఉంటుందని ఆ పార్టీ నాయకురాలు నందమూరి సుహా సిని అన్నారు. గుంటూరులోని పార్టీ కార్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్‌టిఆర్ చేసిన సేవలను కొనియా డారు. సినిమా, రాజకీయ రంగాల్లో ప్రజలకు సేవ చేయాలని ఎన్‌టిఆర్ తపించా రని, ప్రజలు ఆయనను దేవునిగా ఆరాధిస్తున్నారని చెప్పారు. మహిళలకు ఆస్థి హక్కు కల్పించిన ఘనత ఎన్‌టిఆర్‌దేనని సుహాసిని గుర్తుచేశారు. పార్టీ స్థాపించి అనేక మంది సామాన్యులకు చట్ట సభలకు పంపిన ఘనత కూడా ఆయనదేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఏవీ రమణ, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్ర, అన్నాబత్తిని శ్రావణ్ కుమార్, తెనాలి జడ్పీటీసీ సభ్యురాలు జయలక్ష్మీ, కావూరి చంద్రమోహన్, గోగినేని పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ ఘాట్‌లో టీడీపీ ఎమ్మెల్యేల నివాళి

రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో పాల్గొనే ముందు గురువారం తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగే శ్వరరావు ఎన్‌టిఆర్ ఘాట్‌కు నివాళులర్పిస్తారు. తెలంగాణ తెదేపా అధ్యక్షుడు ఎల్.రమణ, పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డితో కలిసి నివాళు లర్పించి అక్కడి నుంచి శాసనసభకు బయలుదేరుతారు.

నూతన ఒరవడి సృష్టించిన ఎన్టీఆర్

తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత ఎన్‌టి రామారావు 23వ వర్ధంతిని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నారు. జిల్లాల్లో స్థానిక నాయకత్వం ఈ కార్యక్రమానికి బాధ్యత తీసుకుని పెద్దఎత్తున నిర్వహించాలని పార్టీ అధిష్టానం పిలుపునిచ్చింది. హైదరాబాద్‌లో ప్రతి ఏటా తెదేపాతో పాటు అఖిల భారత ఎన్‌టీఆర్ అభిమాన సంఘం సంయుక్తంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తోంది. ఈసారి కూడా ఈనెల 18న ఎన్‌టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. అఖిల భారత ఎన్‌టిఆర్ అభిమాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీపతి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో రసూల్‌పుర చౌరస్తా నుంచి ఎన్‌టిఆర్ ఘాట్ వరకు అమరజ్యోతి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెదేపా తెలంగాణ ప్రధాన కార్యదర్శి బుచ్చిలింగం బుధవారం విలేకరుల సమావేశంలో చెప్పారు.

ఏపీ ఎమ్మెల్యే కర్రసాము అదుర్స్




కర్రసాము చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)

జగ్గయ్యపేట టౌన్, ప్రభ న్యూస్ : సంక్రాంతి, కనుమ సంబరాలలో శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కర్రసాము చేశారు. బుధవారం కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలోని పాతపేటగడ్డ సెంటర్లో కనుమ సంబరాలు వేదికపై పలువురు కళాకారులు పాల్గొని తప్పెటగుళ్ళు, శక్తివేషాలు, కాళికానృత్యాలు, గారడి, పులివేషాలు, జానపదగేయాలు, గొర్రెపొట్టేళ్ల ప్రదర్శనలు, హరిదాసు కీర్తనలు, కర్రసాములతో చేసిన విన్యాసాలు స్థానికులను అలరించాయి. కళాకారుల ప్రదర్శన అనంతరం ఎమ్మెల్యే తాతయ్య వేదికపై చేసిన కర్రసాము విన్యాసం స్థానికులను ఉత్సాహపరిచింది. వేదిక మొత్తం తిరుగుతూ కర్రతో వేగంగా కర్రసాము చేయడంతో పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మున్సిపల్ కౌన్సిలర్లు, నియోజకవర్గ స్థాయిలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మార్కెట్ ఫ్లాట్!

• గ్లోబల్ మార్కెట్లో మిశ్రమ స్పందన



ముంబై : స్టాక్ మార్కెట్లు బుధవారం ఫ్లాట్‌గా ముగిశాయి. ప్రపంచం లోని కొన్ని దేశాల్లో రాజకీ య ఒడిదుడుకుల కారణం గా గ్లోబల్ మార్కెట్ల నుంచి మిశ్రమ స్పందనలు కనిపిం చాయి. సుమారు 200 పా యింట్ల వరకు ర్యాలీ ఏర్పడి .. మార్కెట్ ముగిసే నాటికి 2.96 పాయింట్ల లాభంతో 36,321.29 వద్ద ముగి సింది. నిఫ్టీ విషయానికి వస్తే 3.50 పాయింట్ల లాభంతో 10,890.30 వద్ద స్థిరప డింది. బీఎస్ఈలో ఎస్ బ్యాంకు, ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంకు, టీసీఎస్, ఎస్‌బీఐ, రిలయన్స్ ఇండస్ట్రీ, ఓఎన్‌జీసీ, యాక్సిస్ బ్యాంకు, ఎన్‌టీపీసీ షేర్లు 2.66 శాతం వరకు లాభపడ్డాయి. దీనికి వ్యతిరేకంగా భారతి ఎయి ర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, వేదాంత, హెచ్‌సీఎల్ టెక్, హెచ్ యూఎల్, హీరోమోటోకార్ప్, కొటక్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాం కు, ఐటీసీ షేర్లు 1.38 శాతం వరకు నష్టపోయాయి.

బుధవారం నాడు మొత్తానికి మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ అయ్యాయి. మార్కెట్లను ఉత్తేజపరిచే అంశాలు ప్రస్తుతం ఏవీ లేకపోవడం దేశీయ మార్కెట్లలో ట్రేడింగ్ పరిమిత స్థాయిలో తచ్చాడాయని మార్కెట్ పండితులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో మార్కెట్లకు దశదిశ చూపించే అంశాల విషయానికి వస్తే ప్రధా నంగా క్యూ3 ఫలితాలేనని చెప్పవచ్చు. దీంతో పాటు అమెరికా ప్రభుత్వం షట్ డౌన్‌తో పాటు బ్రెగ్జిట్, చైనా ద్రవ్యపరపతి సమీక్షలో ఎలాంటి చర్యలు తీసుకుం టుందో ఇన్వెస్టర్లు వేచి చూస్తున్నారు. ఇదిలా ఉండగా విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు మంగళవారంరూ.159.60 కోట్ల షేర్లు కొనుగోలు చేస్తే.. దేశీయ సం స్థాగత మదుపరులు రూ.417.44 కోట్ల షేర్లు కొనుగోలు చేసినట్ల స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. గ్లోబల్ ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీన పడ్డానికి ప్రధాన కారణం బ్రిటిష్ ప్రధానమంత్రి థెరిసా మే యూరోపియన్ యూనియన్ నుంచి నిష్క్రమించడాన్ని మెజారిటి ఎంపీలు తిరస్కరించారు. దీంతో పాటు మే ప్రభుత్వంపై ఎంపీలు అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా మార్చి 29న బ్రిటన్ బ్రెగ్జిట్ నుంచి నిష్క్రమించే అవకాశాలు కనిపిం చడం లేదు. తాజా పరిణామాల నేపథ్యంలో బ్రిటిష్ ప్రభుత్వం చరిత్రలో అధికా రంలో ఉన్న పార్టీకి ఇలాంటి పరిస్థితి ఎదురు కావడం ఇదే మొదటిసారి.

నేడు పారిశ్రామిక సమాఖ్యలతో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ భేటీ

ముంబై : రిజర్వుబ్యాంకు గవర్నర్ శక్తికాంతదాస్ గురువారం దేశంలోని పలు పరిశ్రమల గ్రూపులతో సమావేశం జరుపనున్నట్లు బుధవారం తెలిపారు. ఆయన ఇప్పటికే దేశంలోని పలు ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులతో రెం డుసార్లు సమావేశం అయ్యారు. ప్రైవేట్ బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు చిన్న వ్యాపారులతో ఆర్‌బీఐ గవర్నర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత గత నెలలోనే సమావేశం అయ్యారు. దేశంలోని పరిశ్రమలకు చెందిన సమాఖ్యలు, మండలులతో గురువారం మావేశం అవుతున్నట్లు తన ట్విటర్ పేర్కొన్నారు.



కొడాక్ హెచ్‌డీ ఎల్‌ఈడీ టీవీ

• అమ్మకాల లక్ష్యం 2లక్షల యూనిట్లు

హైదరాబాద్ : టీవీలు, ఎలక్ట్రానిక్స్ తయారు చేసే అతి పెద్ద కంపెనీ సూపర్ ప్లాస్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌పీపీఎల్) కొడాక్ బ్రాండ్ లైసెన్స్‌ను దక్కించుకుంది. కాగా కొత్త టీవీ కొడాక్ 4కె43యుహెచ్‌డీఎక్స్ స్మార్ట్ ఎల్‌ఈడీ టీవీను మార్కెట్లో ఆవిష్కరించింది. ఈ కొత్త స్మార్ట్ టీవీకి ఆకర్షణీయమైన ఫీచర్లను అందుబాటులోకి తెచ్చింది. వాటిలో డ్యూయెల్ కోర్ 1.4జీహెచ్‌జీ ప్రాసెసర్, 1జీ మెమురీ, ఫ్లాష్‌స్టరేజీ 8 జీబీ వరకు ఉంటుంది. ఈ టీవీ రెసొల్యూషన్ విషయానికి వస్తే 3840 x 2160 ఫిక్సిల్‌తో పాట డిస్‌ప్లే సైజు 109 సెంటిమీటర్లు ఉంటుంది. దీంతో పాటు ఇంటెలిజెంట్ ఫీచర్లు ఉదాహరణకు లాన్ కనెక్టివిటి, వైఫై, మిరాకాస్ట్‌తో పాటు ప్రీలోడెడ్ యాప్స్ ఉదాహరణకు జీమెయిల్, యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్‌బుక్, హాట్‌స్టార్, నెట్‌ఫ్లిక్స్‌లను వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అందుబాటులో ఉంచింది. ఇటీవల 55 అంగుళాలు 50 అంగుళాల కొడాక్ 4కె యూహెచ్‌డీఎక్స్‌స్మార్ట్ లెడ్ టీవీ తాజాగా బుధవారం 43 అంగుళాల కొడాక్ 4కె 43 యూహెచ్‌డీఎక్స్‌స్మార్ట్ లెడ్ టీవీ ఎస్‌పీపీఎల్ వినయోగదారులకు మరింత మెరుగైన టెక్నాలజీ ద్వారా కొత్త టీవీ అనుభూతిని తీసుకొస్తున్నట్లు ఎస్‌పీపీఎల్ డైరెక్టర్, సీఈవో అవనీత్‌సింగ్ మార్వా ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ఆర్థిక సంవత్సరం 2 లక్షల యూనిట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరం 3.5 లక్షల యూనిట్లు విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

స్టార్టప్‌లకు ఊరట!

• ఏంజిల్స్ ఫండ్ పెట్టుబడులపై పన్ను మినహాయింపు నిబంధనలు సడలింపు • నోటీసులు అందిన వారే అర్హులు • 45 రోజుల్లోనే దరఖాస్తులు పరిశీలన తదుపరి నిర్ణయం





న్యూఢిల్లీ : స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టే ఏంజిల్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ప్రైవేట్‌గా పెట్టుబడులు పెట్టేవారు.. వ్యాపారవేత్తలు) తదితరులు పెట్టే పెట్టుబడులపై ఆదాయపు పన్ను మినహాయింపు నిబంధనలను ప్రభుత్వం సడలించింది. ఇలాంటి దరఖాస్తులపై 45 రోజుల డెడ్‌లైన్ విధించి ఆ దరఖాస్తులను పరిశీలిస్తుందని ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. ఇదిలా ఉండగా స్టార్టప్ కంపెనీల వ్యవస్థాపకులు ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 56(2) (7బీ)కింద తమకు ఐటి శాఖ నుంచి నోటీసులు అందుతున్నాయని స్టార్టప్ కంపెనీలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. ఐటి శాఖ చెప్పేదేమిటంటే మీరు అంటే స్టార్టప్ కంపెనీలు ఏంజిల్ ఫండ్స్ నుంచి నిధులు సేకరించారు కాబట్టి .. దానిపై పన్ను కట్టాలని డిమాండ్ చేస్తోంది. ఈ పన్ను నోటీసులపై స్టార్టప్ కంపెనీలు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేశాయి. వాణిజ్య పరిశ్రమలమంత్రి సరేశ్‌ప్రభు తాజా నోటీఫికేషన్ క్లాజులో ఏంజిల్ ఇన్వెస్టర్లకు కొంత అలవెన్స్ ఇచ్చే ప్రతిపాద నకు ఆమోదించారు. త్వరలోనే దీనిపై అధికారిక నోటిఫికేష న్‌ను డీఐపీపీ విడుదల చేస్తుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కొత్త నిబంధనల ప్రకారం ఐటి మినహాయింపు కోరే స్టార్ట ప్‌లు తమ వద్ద ఉన్న అన్నీ డాక్యుమెంట్లను పారిశ్రామిక విధా నం ప్రోత్సాహక శాఖ (డీఐపీపీ)కి దరఖాస్తు చేసుకోవాల్సి వస్తుంది. అటు నుంచి ఈ దరఖాస్తులు .. గుర్తింపబడిన స్టార్టప్ కంపెనీ లవి నేరుగా సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (సీబీడిటీ)కి పంపుతుంది.అటు తర్వాత సీడీడీటి ఈ దరఖా స్తులను పరిశీలించి డీఐపీపీ నుంచి వచ్చిన దరఖాస్తును 45 రోజుల్లోగా పరిశీలించి .. ఫలానా స్టార్టప్ కంపెనీకి మినహా యింపు ఇవ్వాలా వద్దా అనేది నిర్ణయిస్తుం దని ఆ వర్గాలు తెలియ జేశాయి.

గతంలో ఈ తంతు ను ఇంటర్ మినిస్టీరియల్ బోర్డు ఆఫ్ సర్టిఫికేషన్ చూసేది. ప్రస్తుతం డీఐపీ పీ ద్వారా సీబీడీటికి పంపించేదర ఖాస్తులను కూడా సరళతరం చేయడం జరిగందని చెబు తున్నారు. గతంలో స్టార్టప్ కంపెనీ మర్చం ట్ బ్యాంకర్ నుంచి ఏంజి ల్ ఇన్వెస్టర్‌కు మార్కె ట్ విలువ ప్రకారం ఎన్ని షేర్లు కేటా యించారో బ్యాంకు నుంచి సర్టిఫికేట్ తీసుకొని సమర్పిం చాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ ని బంధ నను పూర్తిగా తొల గించారు. పన్ను మిన హాయింపు కోరే స్టార్టప్ కంపె నీలు ముందుగా డీఐపీపీ నుం చి గుర్తింపు పొందాల్సి ఉంటుంది. గుర్తింపు పొందిన స్టార్టప్‌లకు మాత్రమే ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది.

3 ఏళ్ల ఐటీ రిటర్న్స్ సమర్పించాలి

ఐటి మినహాయింపు కోరే స్టార్టప్ కంపెనీలు గత మూడు సంవత్సరాల ఆదాయపు రిటర్న్స్ వివరాలు పూర్తిగా సమ ర్పించాల్సి ఉంటుంది. దీంతో పాటు ఏంజిల్ ఇన్వెస్టర్లు కూడా తమ నికర విలువతో పాటు పెట్టుబడిపై వచ్చిన ఆదాయం వివరాలు పొందుపర్చాల్సి ఉంటుం ది.

ఏంజిల్ ఇన్వెస్టర్‌కు ఒక ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడిపై ఆదాయం రూ.50 లక్షలు లేదా అంత కంటే ఎక్కువ మొత్తం వస్తే.. అదే సమయంతో నికర విలువ రూ.2 కోట్లు దాటిపోతే.. ఆ మొత్తాన్ని స్టార్టప్ కంపెనీలు ఆర్థిక సంవత్సరం చివరి రోజు పెట్టుబ డిగా ... కొత్త ఆర్థిక సంవత్స రం పెట్టుబడి ప్రతిపాదనగా గుర్తిస్తారని ప్రభుత్వ వర్గా లు తెలియజేశాయి. గతం లో స్టార్టప్‌పై వచ్చే ఆదా యం పై రూ.25 లక్షలకు పరి మితి విధించేవారు. సెక్షన్ 56(2) (7బి) ఆదాయపు పన్ను చట్టం ప్రకారం ... స్టార్టప్ కంపెనీలు మార్కెట్ విలువ కంటే ఎక్కువ మొత్తంలో పెట్టుబడులు సేకరిస్తే.. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం 30 శాతం వరకు పన్ను విధిస్తారని ఆ వర్గాలు వివరించాయి. ఇదిలా ఉండగా ఏప్రిల్ 2018లో ప్రభుత్వం స్టార్టప్ కంపెనీలు రూ.10 కోట్ల పెట్టుబడులపై పూర్తిస్థాయి పన్ను మినహాయింపును వినియో గించుకోవచ్చునని.. ఇది ఏంజిల్‌ఫైనాన్సర్స్‌కు కూడా వర్తిస్తుందని పేర్కొంది. అయితే కొత్త నిబంధన లు ఎవరికి వర్తిస్తాయి అంటే ఇప్పటి వరకు ఐటి శాఖ నుంచి నోటీసులు అందుకున్న వారికి మాత్రమే సవరించిన నిబంధనలు వర్తిస్తాయి. కొత్త నిబంధనల వల్ల కొత్తగా స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో ఇవే స్టార్టప్ కంపెనీలు ఐటి మినహాయింపుల కోసం పెద్దెత్తున డాక్యుమెంట్‌ల సమర్పించాల్సి వచ్చేవి. ఇదిలా ఉండగా ఏప్రిల్ 2018 నుంచి అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం కేవలం రెండు స్టార్టప్ కంపెనీలు మాత్రమే ఐటి మిన హాయింపులు పొం దాయి.



సాధారణంగా చూస్తే ప్రతి ఏడాది సుమారు 300-400 ఏంజిల్ ఇన్వె స్టర్లు స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులు పెడుతుంటాయి. స్టార్టప్ నుంచి వస్తున్న ఫిర్యాదులను సురేశ్ ప్రభు ఆర్థిక మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకువ చ్చారు. కేంద్రప్రభుత్వం జనవరి 2016న స్టార్టప్ ఇండియాను తీసుకొచ్చింది. దేశంలోని యువకులు వినూత్నమైన ఆలోచనతో కొత్త వ్యా పారాలు చేసుకోవడానికి స్టార్టప్ ఇండియాకు శ్రీకారం చుట్టింది.

ఎల్ఐసీ దక్షిణ మధ్యజోన్ రికార్డు

క్యూ3లో రూ.35వేల కోట్ల ప్రీమియం వసూళ్లు

హైదరాబాద్ : ప్రభుత్వరంగానికి చెందిన ఎల్ఐసీకి చెందిన దక్షిణ మధ్య జోన్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక)లు డిసెంబర్ త్రైమాసికంలో రికార్డుస్థాయిలో రూ.35వేల కోట్ల ప్రీమియం వసూలు చేశాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఇది కాస్తా రూ.55వేల కోట్లకు ఎగబాకే అకాశాలున్నాయని దక్షిణ మధ్య జోనల్ మేనేజర్ టీసీ సుశీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కొత్తగా విడుదల చేసిన 'జీవన్‌శాంతి' ప్లాన్‌కు విశేష స్పందన లభించిందన్నారు. జీవన్‌శాంతి ప్లాన్ ద్వారా రూ.750 కోట్ల ప్రీమియం వసూలు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.2,000కోట్ల ప్రీమియం సాధిస్తామన్న ధీమాను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ మార్కెటింగ్ సిబ్బందిని అభినందించారు. తమ జోన్‌లోని క్లెయిమ్‌లపై సమీక్షనిర్వహించినట్లు సుశీల్‌కుమార్ చెప్పారు. డిసెంబర్ చివరి నాటికి క్లెయిమ్‌ల విషయానికి వస్తే. డెత్ క్లెయిమ్, మేచురిటి క్లెయిమ్స్, యాన్యుటీ పేమెంట్స్‌తో పాటు ఇతర చెల్లింపులు రూ.25వేల కోట్ల వరకు చెల్లించినట్లు ఆయన వివరించారు. డెత్ క్లెయిమ్‌ల విషయానికి వస్తే ఉదాహరణకు ప్రమాదాలకు గురై మరణించిన వారి క్లెయిమ్లను 48 గంటల్లో పూర్తి చేశామన్నారు. ఇటీవల మైసూరు, కరీంనగర్‌లలో జరిగిన ప్రమాదాల్లో మృతి చెందిన వారి క్లెయిమ్‌లను వేగంగా చెల్లించామని, దీన్ని బట్టి ఎల్ఐసీ తమ కస్టమర్లకు ఎంత అంకిత భావంతో పనిచేస్తోంది తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల అమెరికాలో జరిగిన మిలియన్ డాలర్ రౌండ్‌టేబుల్‌లో దక్షిణ మధ్య జోన్ సుమారు 1385 ఏజంట్లను తయారు చేసిందన్నారు.



నెక్స్‌జెన్ ఐటీ ఫైలింగ్ సిస్టమ్ కాంట్రాక్ట్ ఇన్ఫోసిస్‌కు

విలువ రూ. 4వేల కోట్లు

న్యూఢిల్లీ : నెక్స్ట్ జనరేషన్ ఐటి ఫైలింగ్ సిస్టమ్‌ను అమలు చేయడానికి కేంద్రప్రభుత్వం ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్‌ను ఎంపిక చేసింది. ఈ ప్రాజెక్టు విలువ రూ.4,241.97 కోట్లు. ఈ ప్రాజెక్టు అమల్లోకి వస్తే ఇన్‌కంటాక్స్ రిటర్న్ (ఐటిఆర్) ప్రాసెసింగ్ సమయం ఒక రోజుకు తగ్గుతుంది. దీంతో పాటు రీఫండ్స్ వేగవంతంగా చేయవచ్చునని కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ..ఇంటిగ్రేటెడ్ అండ్ సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ సెంటర్ 2.0 ప్రాజెక్టు ఆదాయపు పన్ను శాఖ పరిధి లోనిది. ఈ ప్రాజెక్టు విలువ రూ.4241.97 కోట్లని గోయెల్ వివరించారు. ప్రస్తుతం ఐటిఆర్‌ల ప్రాసెసింగ్ సమయం 63 రోజులు అవుతోందని.. కొత్త ప్రాజెక్టు అమల్లోకి వస్తే దీని సమయం ఒక రోజు తగ్గుతుందని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టు అమలు చేయడానికి సుమారు 18 నెలల సమయం పడుతుందని, ముందుగా మూడు నెలల పాటు దీనిపై టెస్టింగ్ జరుగుతుందన్నారు. బిడ్డింగ్ ప్రాసెస్ ద్వారా ఈ ప్రాజెక్టు కోసం ఇన్ఫోసిస్‌ను ఎంపిక చేయడం జరిగందని ఆయన తెలిపారు.



డీసీబీ లాభంలో 51శాతంవృద్ధి

క్యూ3లో 86 కోట్లు

న్యూఢిల్ల : ప్రైవేట్ రంగానికి చెందిన డీసీబీ బ్యాంకు డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో ఏకంగా 50.8 శాతం వృద్ధితో రూ.86.10 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.57.01 కోట్లు నమోదుచేసింది. బ్యాంకు మొత్తం ఆదాయం పెరిగి రూ.871.78 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.685.72 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. బ్యాంకు నిరర్థక ఆస్తులు 1.92 శాతానికి ఎగబాకగా.. క్రితంఏడాది ఇదే కాలంలో 1.89 శాతంగా నమోదైంది. అయితే నికర ఎన్‌పీఏ మాత్రం కాస్తా తగ్గి 0.71 శాతానికి దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో 0.89 శాతంగా నమోదైంది.



ఆమ్రపాలి బడా మోసం!

న్యూఢిల్లీ : రియల్ ఎస్టేట్ దిగ్గజం అమ్రపాలి మోసాలు ఒక్కొక్కటే వెలుగు చూస్తున్నాయి. గ్రూపులో జరిగిన మోసాల గురించి కోర్టు నియమించిన ఆడిటర్లు బుధవారం నాడు దిగ్భ్రాంతికి గురి చేసే నిజాలు సుప్రీంకోర్టు ముందుంచింది. సుమారు 500 మంది పేర్లపై కేవలం రూ.1, రూ.5, రూ.11కు చదరపు అడుగు ఫ్లాట్‌ను బుక్ చేసినట్లు తెలిపింది. ఆడిట్‌లో సుమారు 23 డొల్లా కంపెనీలు సృష్టించినట్లు గుర్తించడం జరిగింది. ఆఫీస్ బాయ్స్, ప్యూన్‌లు, డ్రైవర్ల పేర్లతో కంపెనీలు సృష్టించారు. ఈ కంపెనీలన్నీ అమ్రపాలి కన్సార్షియం కిందికి వస్తాయి. వాస్తవంగా డబ్బు పెట్టి కొనుగోలు చేసిన వారి డబ్బును ఈ కంపెనీలకు బదిలీ చేశారు. బెనామీ పేర్లతో ఫ్లాట్‌లు కొనుగోలు చేసిన 655 మందికి నోటీసులు జారీ చేశామని ఆడిటర్లు కోర్టుకు సమాచారం అందించారు. కొనుగోలు దార్లకు పంపిన నోటీసుల్లో 122 అడ్రసుల్లో ఫ్లాట్ కొనుగోలు చేసిన వారు లేరని ఆడిటర్లు తెలిపారు.



చదరపు అడుగు కేవలం రూపాయి

ఆడిటర్లు సమర్పించిన మధ్యంతర నివేదికను జస్టిస్ అరుణ్ మిశ్రా, యు యు లలిత్‌కు సమర్పించారు. కాగా అమ్రపాలి చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) చందర్ వాధ్వా .. అమ్రపాలి ఫ్లాట్‌లు కొనుగోలు చేసిన వాస్తవ యజమానుల డబ్బు రూ.3వేల కోట్లను వేరే ఖాతాలకు బదిలీ చేసిన మూడు రోజుల తర్వాత వాధ్వా రూ.4.75 కోట్లను గుర్తు తెలియని వ్యక్తుల పేర్లకు బదలీ చేశారు. ఇదిలా ఉండగా వాధ్వా ఖాతాలో మార్చి 2018న రూ.12 కోట్ల నగదు ఉంది. ఆయన భార్యపై రూ.1 కోటి బదిలీ చేశారు. అక్టోబర్ 26,2018న మొట్టమొదటిసారి కోర్టు ముందు హాజరు కావడానికి మూడు రోజుల ముందే ఈ బదిలీ చేశారని ఫోరెన్సిక్ ఆడిటర్ పవన్ కుమార్ అగర్వాల్ బెంచ్‌కు తెలియ జేశారు.అగర్వాల్ కోర్టుకు అందించిన నివేదికతో న్యాయమూర్తులు వాధ్వాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ధిక్కారం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. న్యాయవ్యవస్థ చక్రంలో అడ్డుపుల్లవేస్తున్నారని వాధ్వాపై ఆగ్రహించింది. ఫ్లాట్‌లు కొనుగోలు చేసిన యజమానుల డబ్బు వారం రోజుల్లోగా ఇచ్చేయాలని హెచ్చరించింది.

మైండ్ ట్రీ లాభంలో 35 శాతం అప్

క్యూ3 లాభం రూ.191 కోట్లు

న్యూఢిల్లీ : మిడ్‌సైజ్ ఐటి కంపెనీ మైండ్‌ట్రీ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరలాభంలో 35.1 శాతం వృద్ధితో రూ.191.2 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.141.5 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ విషయానికి వస్తే 29.7 శాతంతో రూ.1787.2 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1377.7 కోట్లని తెలిపింది. డాలర్ ప్రాతిపదికన నికరలాభంలో 22.2 శాతం వృద్ధితో 26.9 మిలియన్ డాలర్లకు చేరగా.. రెవెన్యూ విషయానికి వస్తే 17.4 శాతం వృద్ధితో 251.5 మిలియన్ డాలర్లకు చేరిందని కంపెనీ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ రస్టోవో రావణన్ చెప్పారు. సాధారణంగా క్యూ3లో మార్కెట్లు బలహీనంగా ఉన్నా తాము మంచి ఫలితాలను సాధించామని ఆయన అన్నారు. కాగా కంపెనీ బోర్డు మధ్యంతర డివిడెండ్ షేరుకు రూ.3గా ప్రకటించింది. డిసెంబర్ చివరి నాటికి 340 చురుకైన క్లయింట్లున్నారు. ఉద్యోగుల సంఖ్య 19,908 కాగా, వలసల రేటు 13.4 శాతంగా నమోదైంది.

ఎక్స్‌పెన్స్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్‌ను ఆవిష్కరించిన జాగ్గెల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : డిజిటల్ చెల్లింపులు, ఉద్యోగ ప్రయోజనాలు, రివార్డు, రికగ్నైజేషన్, లాయల్టీ, గిఫ్ట్‌కార్డ్స్ విభాగంలో అగ్రగామి సంస్థ జాగ్గెల్ ఎక్స్‌పెన్స్ మేనేజ్‌మెంట్ పరిష్కారాన్ని ఆవిష్కరించింది. ఉద్యోగులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యకు పరిష్కారం అందించే ఈ ప్లాట్‌ఫామ్ 100 శాతం డిజిటల్, పూర్తి ఆటోమేటెడ్ వ్యాపార ఖర్చు నిర్వహణ పరిష్కారం చూపుతుందని సంస్థ ఫౌండర్, చైర్మన్ రాజ్ ఎన్.ఫణి అన్నారు. వ్యాపార సంస్థలు సమర్థవంతంగా తమ ఖర్చుల విధానాన్ని అతి సులభంగా, సురక్షితంగా, భద్రమైన విధానంలో నిర్వహించే అవకాశం ఈ నూతన ప్రొడక్ట్ అందిస్తుందన్నారు.

టీవీ 18 బ్రాడ్‌కాస్ట్ లాభం రూ.146 కోట్లు



న్యూఢిల్లీ : టీవీ 18 బ్రాడ్‌కాస్ట్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసి కంలో నికరలాభం రూ.146.96 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.8.53 కోట్లు మాత్రమే నమోదు చేసింది. అయితే గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం ఫలితాలను తాజా ఫలితాలను పోల్చి చూడరాదని కంపెనీ బీఎస్ఈకి సమాచా రం అందించింది. ఎందుకంటే మార్చి 1,2018 నుంచి వయాకామ్ 18 మీడియా, ఇండియా కాస్ట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ అను బంధ సంస్థలు మారిపోయాయని తెలియజేసింది. ఇక రెవెన్యూ విషయానికి వస్తే డిసెంబర్ త్రైమాసికంలో రూ.1,474.7 కోట్లకు ఎగబాకగా.. క్రి తం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.271.13 కోట్లు ఆర్జించింది. బీఎస్ఈలో దీని షేరు 1.73 శాతం పెరిగి రూ.38.20 వద్ద ముగిసింది.


ఎగ్జిమ్ బ్యాంకుకు రూ.6,000 కోట్ల మూలధన సహాయం

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన ఎగ్జిమ్ బ్యాంకుకు ప్రభుత్వం మరో రూ.6,000 కోట్ల మూలధనం సర్దుబాటు చేసి అధీకృత మూలధనం రూ.10వేల కోట్ల నుంచి రూ.20వేల కోట్లకు పెంచడానికి కేంద్ర కేటినెట్ బుధవారం నాడు ఆమోదం తెలిపింది. ఈ మూలధనం రెండు దఫాలుగా సమకూరుస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరంలొ రూ.4,500 కోట్లు.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1,500 కోట్ల వరకు మూలధనం సమకూరుస్తామని రైల్వేమంత్రి పీయూష్ గోయెల్ కేబినెట్ సమావేశం తర్వాత తెలిపారు. ఎగ్జిమ్ బ్యాంకును కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎగుమతి చేసే కంపెనీలకు రుణాలు ఇస్తుంది. చిన్న, మధ్య తరహారంగానికి చెందిన కంపెనీల అభివృద్ధికి రుణాలను అందుబాటులో ఉంచుతుంది.

ఎస్సార్ ఎన్‌పీఏల విక్రయం

• రూ.15వేల కోట్ల బకాయిల వసూలు • స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఎస్సార్‌స్టీల్ నుంచి బకాయిలు వసూలుచేయడానికి కంపెనీ ఎన్‌పీఏ ఖాతాలను విక్రయానికి పెట్టాలనే ఆలోచనలో ఉంది. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఎల్)న ం బ్యాంకులు/ ఏఆర్‌సీలు/ ఎన్‌బీఎఫ్‌సీలు/ ఎఫ్ఐల నుంచి ఈఓఎల్‌ను ఆహ్వానించింది. కాగా బ్యాం కుకు ఎస్సార్ నుంచిరూ. 15,431.44 కోట్లు బకాయిలు రావాల్సి ఉందని ఎస్‌బీఐ వార్తా పత్రికలకు ఇచ్చిన ప్రకటనలో పేర్కొం ది. ఈ ఖాతాను విక్రయించడా నికి ఎస్‌బీఐ రిజర్వుధర రూ.9,587.64 కోట్లుగా నిర్ణయించింది.



ఎన్‌సీఎల్‌టి అహ్మదాబాద్ ఎస్సార్ మొండిబకా యిల ఖాతాల ను అనమతిస్తూ తీర్మా నం చేయడంతో బ్యాంకు ఈ ఖాతాను విక్రయానికి పెట్టింది. ఎస్సార్‌కు ఇచ్చిన బకాయిల నుంచి కనీసం రూ. 11,313.42 కోట్లు బకాయిలు రాబట్టు కోవాలని ఎస్‌బీఐ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఎన్‌పీఏ ఖాతాను ఈ- వేలం ద్వారా జనవరి 30వ తేదీన వేలం వేస్తారని బ్యాంకు తెలిపింది. ఇదిలా ఉండగా ఎస్సార్ స్టీల్ ఎస్‌బీఐ నేతృత్వంలోని సుమారు రెండు డజన్ల బ్యాంకుల కన్సార్షి యానికి సుమారు రూ.49వేల కోట్ల కంటే ఎక్కువ బకాయి పడింది. కాగా దివాలాచట్టం కోడ్ ప్రక్రియ కింది చేసిన తీర్మానం నేపథ్యంలో ఎస్సార్‌ను ఆర్సిలర్ మిట్టల్ కొనుగోలు చేస్తామని ప్రతిపాదన చేశారు. ప్రతిపాదనల్లో భాగంగా బ్యాంకులకు రూ.42వేల కోట్లు చెల్లిస్తానని.. రూ.8వేల కోట్లు మూలధనం కింద సమకూరుస్తామని ఆఫర్ చేశారు. ఎస్సార్ స్టీల్ టేకోవర్‌ను కమిటీ ఆఫ్ క్రెడిటార్స్ (సీఓసీ) ఆమోదించింది.

నుమాలిగఢ్ రిఫైనరీ సామర్థ్యం పెంపునకు కేబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ : నుమాలిగఢ్ రిఫైనరీ లిమిటెడ్ (ఎన్ ఆర్ఎల్) సామర్థ్యం ఏడాదికి మూడు మిలియన్ టన్నల నుంచి తొమ్మిది మి.టన్నులకు పెంచడానికి కేంద్రకేబి నెట్ ఆమోదం తెలిపింది. దీంతో పాటు ముడిచమురు పైపులైన్‌ను పారాదీప్ నుంచి నుమా లిగఢ్‌కు, అలాగే ప్రొడక్టు పైప్‌లైన్ నుమాలీగఢ్ నుంచి సి లిగురికి ఏర్పాటు చేయ డానికి బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమో దించారు. ఈ ప్రాజెక్టుపై మొత్తం వ్యయం రూ.22,594 కోట్లు కాగా ఈ పెట్టుబడు లు డెబిట్‌తో పాటు ఈక్విటి, వైబిలిటి గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) ద్వారా సేకరిస్తుం ది. (ఎన్ఆర్ఎల్) విషయా నికి వస్తే రూ.15,102 కోట్లు రుణాలు సేకరిస్తే.. అంత ర్గతం గా రూ.2,307 కోట్లు సమకూర్చుకుంటుంది. ప్రమోటర్లు (భారత్ పెట్రోలి యం కార్పొరేషన్ లిమిటెడ్) అస్సాం ప్రభుత్వం కూడా కొంత పెట్టుబడులు సమకూర్చు తాయి.

హిందుస్తాన్ మీడియా వెంచర్స్ లాభం రూ.29 కోట్లు

క్యూ3లో శాతం 25 శాతం పతనం

న్యూఢిల్లీ : హిందుస్తాన్ మీడి యా వెంచర్స్ లిమిటెడ్ (హెచ్ఎం వీఎల్) డిసెం బర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం లో 25.40 శాతం క్షీణించి రూ.29.16 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రమాసికంలో నికరలాభం రూ.69.09 కోట్లు నమోదు చేసి నట్లు బీఎస్ఈకి సమాచారం అందిం చింది. మొత్తం ఆదాయం విషయానికి వస్తే 6.01 శా తం పెరిగి రూ.252.80 కోట్లకు ఎగ బాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికం లోరూ.238.45 కోట్లని తెలిపింది. బీఎస్ ఈకి దీని షేరు 1.12 శాతం క్షీణించి రూ.123.25 వద్ద మధ్యాహ్నం ట్రేడ్ అయ్యిం ది.


ప్రపంచ బ్యాంకు అధ్యక్ష ఎన్నిక

తెరపైకి ఇంద్రానూయి



వాషింగ్టన్: ప్రపంచబ్యాంకు అధ్యక్షురాలిగా ప్రవాస భారతీయురాలు, పెప్సీకో మాజీ సీఈవో ఇంద్రానూయి పేరు తెరపైకి వచ్చింది. ఇవాంక ట్రంప్ సూచన మేరకు ఈ పదవికి నూయి పేరును ప్రతిపాదించేందుకు శ్వేతసౌధం సుముఖంగా ఉన్నట్లు అమెరికా ప్రముఖ దినపత్రిక ఒకటి ప్రచురించింది. 63 ఏళ్ల పెప్సీకో సీఈవోగా 12 ఏళ్లపాటు సుదీర్ఘసేవలు అందించారు. ట్రంప్ బిజినెస్ సలహా కౌన్సెల్‌లో సభ్యురాలిగా కొంతకాలం పనిచేశారు. ఇవాంక తమ కౌన్సెల్ సభ్యురాలంటూ గతంలో ట్వీట్‌చేసి మద్దతుగా నిలిచారు కూడా. అయితే, ట్రంప్ పాలకవర్గం నిర్ణయాన్ని ఇంద్రానూయి అంగీకరిస్తారా? లేదా ? అన్నది ఆసక్తికరంగా మారింది. నూయి తనకు మార్గదర్శకురాలు.. స్ఫూర్తిదాయకం అంటూ ఇవాంక ట్వీట్‌చేశారు. ప్రస్తుతం ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా ఉన్న జిమ్ యాంగ్ కిమ్ పదవీకాలం ముగియకముందే బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారు. ఓ ప్రైవేటు ఇన్‌ఫ్రా పెట్టుబడుల సంస్థలో చేరబోతున్నానని, ఫిబ్రవరి తర్వాత రాజీనామా చేయబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో కొత్త అధ్యక్షుడి ఎంపిక అనివార్యం కానుంది. ఈ పదవికి అమెరికా ప్రతిపాదనలో తొలుత కొందరిపేర్లు ప్రధానంగా వినిపించాయి. స్టీవెన్ నుచిన్, తాత్కాలిక చీఫ్ ముల్వానీ, ఇవాంక ట్రంప్, నిక్కీహేలీ పేర్లు వైట్‌హౌజ్ పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరిగింది. వీరితోపాటు అంతర్జాతీయ వ్యవహారాల ట్రెజరీ కార్యదర్శి డేవిడ్ మాల్‌పాస్, విదేశీ ప్రైవేటు పెట్టుబడుల కార్పొరేషన్ అధ్యక్షుడు రే వాష్‌బర్న్ పేర్లు వినిపిస్తున్నాయి. ఇవాంకను అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాల బాధ్యతల్లో నియమించడాన్ని కొందరు విమర్శించారు. నూయి విషయంలోనూ కొన్ని సమస్యలున్నట్లు తెలుస్తోంది. 2016 ఎన్నికల సమయంలో ఆమె చేసిన అనుచిత వ్యాఖ్యలు ఆమె అభ్యర్థిత్వానికి బ్రేకులు వేయొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టాక, ఎన్‌వైటీ ఒప్పందంపై నూయి మాట్లాడుతూ, మా ఉద్యోగులంతా రోదిస్తున్నారు.. ముఖ్యంగా శ్వేతజాతీయులు కానివారు భద్రతపై సందేహాలు లేవనెత్తుతున్నారు. మేము సురక్షితమేనా? అని ప్రశ్నిస్తున్నారు. మహిళలు, ఎల్‌జీబీటీ పౌరులూ ఇదే ప్రశ్న అడుగుతున్నారు. వారి ప్రశ్నలకు నేను సమాధానం చెప్పలేక పోతున్నానంటూ కామెంట్ చేసి వివాదాస్పదం అయ్యారు. ఈ నేపథ్యంలో నూయి పేరును ఇవాంక ప్రతిపాదించడం ఆసక్తికరంగా మారింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఆవిర్భవించిన ప్రపంచ బ్యాంకులో అమెరికా ప్రధాన వాటాదారుగా ఉంది. దాంతో అధ్యక్షుడి ఎంపికలో శ్వేతసౌధం నిర్ణయమే కీలకం అవుతూ వచ్చింది. ఇప్పటి వరకు అమెరికా ప్రతిపాదించిన వ్యక్తులే ప్రపంచబ్యాంకు అధ్యక్షులుగా కొనసాగుతూ వచ్చారు.

మోడీకి కొట్లర్ అభినందనలు



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ప్రతిష్టాత్మక పురస్కారాన్ని ప్రదానం చేయడాన్ని మార్కెట్ గురు ఫిలిప్ కొట్లర్ సమర్థించుకున్నారు. ఈ విషయంపై రాజకీయ విమర్శలను ఆయన తోసిపుచ్చారు. ప్రధానికి అభినందనలు తెలిపారు. పురస్కారానికి మోడీ ఎందుకు అర్హుడో ట్విట్టర్ ద్వారా వివరించారు. తొలిసారి ఫిలిప్ కొట్లర్ అధ్యక్షపురస్కారం అందుకున్నందుకు ముందుగా మోడీకి నా అభినందనలు. అద్భుత నాయకత్వం, దేశ అభివృద్ధికి అలుపెరగని, నిస్వార్థ సేవలు అందించినందుకు గాను ఈ పురస్కారం వరించింది అని నార్త్‌వెస్ట్రన్ యూనివర్సిటీలో మార్కెటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఫిలిప్ వివరణ ఇచ్చారు. అసాధారణ ఆర్థిక, సామాజిక, సాంకేతిక పురోగతి దిశగా భారత్‌ను ముందుకు నడిపించారు. భావితరానికి భవిష్యత్‌పై కొంగొత్త ఆశలు చిగురింపజేశారు అంటూ మోడీని ప్రశంసించారు. ప్రధానికి అవార్డు లభించడంపై రాహుల్ చేసిన వ్యంగ్య విమర్శల నేపథ్యంలో ఫిలిప్ ట్వీట్‌లో స్పందించారు.

రాహుల్ ఏమన్నారంటే..



ప్రపంచ ప్రతిష్టాత్మక కొట్లర్ ప్రెసిడెన్షియల్ పురస్కారం లభించినందుకు మన ప్రధానికి అభినందనలు. న్యాయ నిర్ణేతలు లేని ఈ అవార్డు చాలా ప్రత్యేకమైనది. ఇంతవరకెవరికీ ఇలాంటి పురస్కారం దక్కలేదు. ఊరూపేరూ లేని, ఎప్పుడూ వినని అలీఘర్ కంపెనీ ఈ పురస్కారం ప్రదానం చేయడం విశేషం అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్విట్టర్ వేదికగా ఎద్దేవా చేశారు. దీన్ని మోడీ విమర్శకులు మరికొందరు అనుకరించారు. ఇందులో వామపక్ష నేత సీతారాం ఏచూరి, ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ ఒకరు. కాగా ఈ విమర్శలను కేంద్రమంత్రి స్మృతి ఇరానీ తిప్పికొట్టారు. మోడీని వ్యతిరేకించడమే లక్ష్యంగా పెట్టుకున్న గాంధీ కుటుంబం, తమకుతామే దేశానికి గొప్పగా భావిస్తున్నారంటూ రీట్వీట్ చేశారు.

యూపీఎస్సీ ద్వారానే డీజీపీల నియామకం

న్యూఢిల్లీ: రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్‌ను యూపీఎస్సీ ద్వారా కాకుండా తాము సొంతంగా కమిటీ ద్వారా నియమించుకునేందుకు అనుమతి ఇవ్వాలన్న ఐదు రాష్ట్రాల అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. పంజాబ్, పశ్చిమ బెంగాల్, కేరళ, బీహార్, హర్యానా రాష్ట్రాల పిటిషన్లను కొట్టివేసింది. డీజీపీలను రాష్ట్రాలు తమ సొంత చట్టాల ద్వారా నియమించుకునేందుకు అవకాశం లేదని స్పష్టం చేసింది. పోలీసు శాఖ రాష్ట్రానికి సంబంధించిన అంశమని, కాబట్టి దీని అధిపతిని తామే నియమించుకుంటామని ఇప్పటివరకు అన్ని రాష్ట్రాలు కోరాయి. ప్రస్తుత కేసులో ధర్మాసనానికి నేతృత్వం వహించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ మాట్లాడుతూ డీజీపీల ఎంపికపై సుప్రీం కోర్టు గతంలోనే ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. డీజీపీల ఎంపిక విస్తృత ప్రజా ప్రయోజనాలు ఇమిడి ఉన్న అంశమని, రాజకీయ జోక్యం నుంచి పోలీసు శాఖను రక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు.

బెంగాల్‌లో రథయాత్రలొద్దు..

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో బీజేపీ తలపెట్టిన రథయాత్రకు సుప్రీంకోర్టు బ్రేకులు వేసింది. రథయాత్రకు బదులుగా సభలు నిర్వహించుకోవచ్చని సూచించింది. కొత్త టూర్ ప్లాన్‌తో రావాలని బీజేపీ తరుపు న్యాయవాదిని ఆదేశించింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు పశ్చిమబెంగాల్‌లో అమిత్ షా రథయాత్రకు బీజేపీ ప్రణాళిక చేసింది. శాంతిభద్రతల సమస్యలు వస్తాయని.. ఇంటెలిజెన్స్ హెచ్చరించిందని రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. దీనిపై బీజేపీ కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించింది. బెంగాల్ ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పునివ్వగా, సుప్రీం కోర్టులో సవాల్ చేసిన బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది.

రథయాత్రకు బీజేపీ ప్రత్యామ్నాయం

పశ్చిమ బెంగాల్లో బీజేపీ రథయాత్ర నిర్వహణకు సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వకపోవడంతో ఆ పార్టీ ప్రత్యామ్నాయం సిద్ధం చేసింది. రథయాత్ర స్థానంలో బహిరంగ సభలను తెర మీదికి తెచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించింది. రథయాత్రపై రాష్ట్ర ప్రభుత్వ ఆందోళనను, శాంతిభద్రతల సమస్యను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు రథయాత్ర ప్రతిపాదనకు బ్రేకులు వేసి ప్రత్యామ్నాయ ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పించాలని బీజేపీని ఆదేశించింది. దీంతో పార్టీ అధ్యక్షుడు అమిత్ షా నేతృత్వంలో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించింది. మొదటి సభ జనవరి 20న మాల్దా జిల్లాలో జరుగుతుంది. 21న బీరభుమ్‌లో జరుగుతుంది. మిగతా సభలను మరో మూడు ప్రాంతాల్లో నిర్వహిస్తారు.

కర్నాటకం...

తొలగని ఉత్కంఠ



● తిరిగొచ్చిన ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ● ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది.. బీజేపీతో కలవలేదని వివరణ ● ప్రభుత్వానికి స్వతంత్రుల మద్దతు వెనక్కి ● అయినా.. ఇబ్బంది లేదంటున్న కాంగ్రెస్, జేడీ(ఎస్) ● రేపు ఎమ్మెల్యేలతో కూటమి నేతల భేటీ ● త్వరలో అంతా సర్దుకుంటుంది: సీఎం కుమారస్వామి ● గుర్‌గావ్ రిసార్ట్‌లోనే బీజేపీ ఎమ్మెల్యేలు

బెంగళూరు: కర్నాటకలో అధికార కాంగ్రెస్- జేడీ(ఎస్) కూటమి సంకటస్థితిని ఎదుర్కొంటోంది. బీజేపీ వ్యూహాలు సంకీర్ణ ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. గత నాలుగు రోజులుగా రాష్ట్ర రాజకీయం ఉత్కంఠభరితంగా మారింది. రోజుకో మలుపు తిరుగుతోంది. కుమారస్వామి సర్కార్‌కు రోజులు దగ్గరపడ్డాయని, కొత్త ప్రభుత్వం కొలువుదీరడం ఖాయమని బీజేపీ చేస్తున్న ప్రకటనలు అధికార పక్షాన్ని గందరగోళానికి గురిచేస్తున్నది. మంగళవారం ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించడం, బీజేపీ ఎమ్మెల్యేలు హర్యానా రిసార్ట్‌లోనే ఉండిపోవడం మరిన్ని ఊహాగానాలు తెరలేపింది. దీనికితోడు కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ మహారాష్ట్ర సదస్సుకు వెళ్లడం, మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య చిక్‌మగళూరు జిల్లా పర్యటనకు వెళ్లడం రాజకీయ వర్గాల్లో రకరకాల చర్చకు దారితీసింది. హోంమంత్రి ఎంబీ పాటిల్ వదంతులను కొట్టిపారేశారు. ఎమ్మెల్యేలంతా పార్టీతోనే ఉన్నారని, దురదృష్టవశాత్తు మంగళవారం మద్దతు ఉపసంహరించుకున్న ఇద్దరు స్వతంత్రులు తిరిగి ప్రభుత్వానికి అండగా వస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుత పరిమాణామాలను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్ పర్యవేక్షిస్తున్నారు. బీజేపీ కుట్రలను తిప్పికొడతామని, సంకీర్ణ ప్రభుత్వం పూర్తికాలం అధికారంలో ఉంటుందని సీఎం కుమారస్వామి పునరుద్ఘాటించారు.

ఒకటి రెండు రోజుల్లో అంతా సర్దుకుంటుంది: కుమారస్వామి

రాష్ట్రంలో ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. ఆ దిశగా కుయుక్తులతో గందరగోళం సృష్టిస్తోంది. త్వరలోనే పరిస్థితి చక్కబడుతుంది. ప్రభుత్వానికి వచ్చిన ప్రమాదం ఏమీలేదని ముఖ్యమంత్రి కుమారస్వామి ధీమా వ్యక్తంచేశారు. బడ్జెట్ కూర్పులో తలమునకలై ఉన్న ఆయన మీడియా ప్రశ్నలకు సావధానంగా బదులిచ్చారు. ప్రధాని నరేంద్రమోడీతో భేటీ ప్రచారాన్ని ఖండించారు. అదేవిధంగా నలుగురు కాంగ్రెస్ మంత్రులు పదవులకు రాజీనామా చేస్తారన్న వదంతులను తోసిపుచ్చారు. కాంగ్రెస్-జేడీ(ఎస్) సంకీర్ణం బలంగా ఉంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ కలసికట్టుగానే పోటీ చేయబోతున్నాం. ప్రధానితో సమావేశం అయ్యే ప్రణాళికేదీ లేదు. అలాగే కాంగ్రెస్ మంత్రులెవరూ కేబినెట్ నుంచి వైదొలగరు. బీజేపీలో చేరరు. ఇదంతా బీజేపీ చేస్తున్న దుష్ప్రచారమే. కాషాయ పార్టీ ప్రలోభాలకు మా ఎమ్మెల్యేలు లొంగరు. ఒకటి రెండు రోజుల్లో గందర గోళానికి తెరపడుతుంది అని కుమారస్వామి ధీమా వ్యక్తం చేశారు. ఇదిలావుండగా, జేడీఎస్ నేత ఒకరు బీజేపీ తీరుపై ధ్వజమెత్తారు. కాషాయపార్టీ 104 మంది ఎమ్మెల్యేలను హర్యానాలోని గుర్గావ్ రిసార్ట్‌లోఎందుకు దాచివుంచింది? ఇలాంటి చర్యలతో వారిలోని అధికార దాహాన్ని దేశానికి చాటిచెప్పినట్లు అవుతున్నది. ప్రజల ముందు వాళ్లంత వారే ఫూల్స్‌గా నిరూపించుకుంటున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలకు భారీ మొత్తంలో డబ్బు, తాయిలాలు ఎరవేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ స్థానిక మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తోందని సీఎం కుమార స్వామి ధ్వజమెత్తారు. 224 మంది సభ్యులునన కర్నాటకశాసనసభలో బీజేపీ-104, కాంగ్రెస్ 79, జేడీఎస్ 37, బీఎస్పీ, కేపీజేపీ, స్వతంత్రులు ఒక్కొక్కరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

సంప్రదింపులు జరపలేదు

ఇదిలావుండగా, కొద్ది రోజులుగా కనిపించకుండా పోయిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భీమా నాయక్, ఆనంద్‌సింగ్ బుధవారం తిరిగొచ్చారు. అధికార కూటమి ఎమ్మెల్యేలు సమావేశమైన అతిథి గృహం వద్దకు చేరుకున్నారు. బీజేపీతో తామెలాంటి సంప్రదింపులు జరపలేదని, తమ పార్టీ ముఖ్యనేతలతో టచ్‌లోనే ఉన్నామని చెప్పారు. తన ఫోన్ అందుబాటులో లేనందుకు పార్టీ నేతలు తనను సంప్రదించలేక పోయారన్నారు. తన వద్ద రెండు ఫోన్లు ఉన్నాయని, వాటిలో ఒకటి స్విచ్ ఆఫ్ అయిందన్న నాయక్, తాను బీజేపీతో కలవలేదని తెలిపారు. కాగా శుక్రవారం సీఎల్‌పీ సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందని వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర్ ఖండ్రే తెలిపారు. ఎమ్మెల్యేలంతా పార్టీతోనే ఉన్నారని స్పష్టం చేశారు. 2008 మాదిరిగా ఎమ్మెల్యేలను కొనడం ద్వారా ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని యెడ్యూరప్ప బృందం కుట్ర పన్నుతోందంటూ కాంగ్రెస్ ఆరోపిస్తున్నది.

చిన్నారిని లాక్కెళ్లిన చిరుత



ఫైల్

కోల్‌కతా: పశ్చిమబంగా అలీపుర్‌దవార్ జిల్లాలోని తల్లి ఒడిలో నిద్రిస్తున్న చిన్నారిని చిరుతపులి లాక్కెళ్లి చంపేసిన ఘటన వెలుగుచూసింది. అలీపుర్‌దవార్ జిల్లాలోని లేబర్ లైన్‌లో నివాసముంటున్న పూజ ఓరాన్ ఇంట్లోకి ప్రవేశించిన ఓ చిరుత పూజ తన మూడేళ్ల కుమార్తె ప్రణీతను నిద్రపుచ్చుతోంది. ఇంటిలోపలికి వచ్చిన చిరుత వీరిపై దాడిచేసి, పూజ ఒడిలోని చిన్నారిని నోటకరచుకుని వెళ్లింది. కుమార్తెను కాపాడుకునేందుకు పూజ చిరుతతో పోరాడినప్పటికీ అది ఫలించలేదు. అయితే, పూజ అరుపులు విన్న స్థానికులు వెంటనే అక్కడకు చేరుకుని చిన్నారి కోసం గాలించగా, కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. బుధవారం ఉదయం మదరిహత్‌లోని ఓ తేయాకు తోటలో చిన్నారి శరీర భాగాను గుర్తించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కన్హయ్యను విమర్శించే హక్కు బీజేపీకి లేదు



న్యూఢిల్లీ: జేఎన్‌టీయూ మాజీ విద్యార్థి నాయకుడు కన్హయ్యకు మార్‌ని విమర్శించే నైతిక హక్కు బీజేపీకి లేదని శివసేన తెలిపింది. కన్హయ్యను విమర్శించడం కేవలం పొలిటికల్ మైలేజ్ కోసమేనని శివసేన తన అధికార పత్రిక సామ్నాలో ఓ ఆర్టికల్ ప్రచురించింది.అంతేకా కుం డా పార్లమెంట్‌పై దాడికి పాల్పడిన అఫ్జల్ గురుని ఫ్రీడమ్ ఫైటర్, అమరవీ రుడంటూ మాట్లాడిన పీడీపీతో జమ్మూకాశ్మీర్‌లో పొత్తు పెట్టుకుని బీజేపీ పాపానికి పాల్పడిందని, అటువంటి బీజేపీ కన్హయ్యపై విమర్శలు చేస్తోందని, అటువంటి నైతిక హక్కు బీజేపీకి ఎక్కడిదని ప్రశ్నించింది. కన్హయ్యకు తన కేసు తాను వాదించుకునేందుకు అవకాశం ఇవ్వాలని, కోర్టు ఉగ్రవాది కసబ్‌కే ఇచ్చిన అవకాశం కన్హయ్యకు ఎందుకు ఇవ్వకూడదని శివసేన ప్రశ్నించింది. అయితే, కన్హయ్యపై వస్తు న్న ఆరోపణలు నిరాధారణమైనవి అయితే అవి కోర్టులో నిలబడవని శివసేన తెలిపింది.

స్థానిక మిలిటెంట్లు ఈ భూమి పుత్రులే

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదంలోకి అడుగుపెడుతున్న స్థానికులు ఈ భూమి పుత్రులేనని వారిని రక్షించడానికి అవసరమైన చర్యలు చేపట్టాల్సి ఉందని మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ అన్నారు. రాష్ట్రంలో తుపాకీ సంస్కృతికి ముగింపు పలకడానికి కేంద్రం స్థానిక మిలిటెంట్ నాయకత్వంతో చర్చలు జరపాలని ఆమె సూచించారు. పాకిస్తాన్‌తోనూ, కాశ్మీర్ వేర్పాటువాదులతోనూ వెంటనే చర్చలు జరపాలని, అలాగే స్థానిక మిలిటెంట్ నాయకత్వంతోనూ చర్చలు జరపాలని ఆమె అన్నారు.

ఆప్‌తో పొత్తుపై నిర్ణయం తీసుకోలేదు



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)తో పొత్తుపై ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు షీలా దీక్షిత్ చెప్పారు. ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా షీలా దీక్షిత్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా షీలా దీక్షిత్ మాట్లాడుతూ రాజకీయాలు పూర్తిగా సవాళ్లతో నిండి ఉంటాయన్నారు. తదనుగుణంగానే తాము కలిసికట్టుగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తామని చెప్పారు. బీజేపీ, ఆప్‌లు రెండూ కూడా తమకు సవాళ్లే నని ఆమె అన్నారు. ఆప్‌తో పొత్తుపై ఇప్పటి వరకూ ఏమీ ఆలోచించలేదన్నారు.

సుప్రీం జడ్జీలుగా సంజీవ్, మహేశ్వరి

● కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం ● బార్‌కౌన్సిల్ అభ్యంతరం



న్యూఢిల్లీ: సర్వోన్నత న్యాయస్థానానికి మరో ఇద్దరు న్యాయమూర్తులు నియమితులయ్యారు. కర్నాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దినేశ్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి సంజీవ్ ఖన్నాను సుప్రీం జడ్జీలుగా నియమిస్తూ బుధవారం సాయంత్రం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదముద్ర వేశారు. కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్‌కు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ఖాళీల భర్తీకి కొలీజియం కసరత్తు చేసింది. అఖిలభారత స్థాయిలో సీనియారిటీ ప్రాతిపదికన హైకోర్టు సీజేలు, ఇతర కిందిస్థాయి కోర్టులకు చెందిన ఐదుగురిని ఎంపిక చేసి, చివరకు వీరిద్దరిని ఖరారు చేసింది. కొద్దిరోజుల కిందట వీరి ఎంపికపై వివాదం రాజుకుంది. పలువురు సిట్టింగ్ హైకోర్టు సీజేలు, కిందిస్థాయి కోర్టుల సీనియర్ జడ్జీలు సంజీవ్ ఖన్నా కంటే సీనియర్లుగా ఉన్నారన్న విమర్శలు వచ్చాయి. దీంతో ఈ విషయం వివాదాస్పదమైంది. సుప్రీం సీజే గొగొయ్ సారథ్యంలోని కొలీజియం నిర్ణయంపై ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి కైలాష్ గంభీర్ స్పందించారు. భారత న్యాయవ్యస్థలో ఇదొక చీకటి రోజని వ్యాఖ్యానించారు. వీరి నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేసి చారిత్రక తప్పిదం చేశారని, కుల ప్రాధాన్యతలో ప్రతిభ, సమగ్రతలను అణచివేశారని ఆరోపించారు. బార్ కౌన్సెల్ సైతం ఇదేవిధమైన అభిప్రాయాన్ని వ్యక్తంచేసింది. మా బృందం కొలీజియంతో భేటీ అవుతుంది. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, వారిద్దరినీ రీకాల్ చేయాలని కోరతాం. ఇందుకు అంగీకరించకుంటే ధర్నాకు దిగుతామని బార్ కౌన్సెల్ చైర్మన్ ఎంకే మిశ్రా చెప్పారు.

ఆ ఇద్దరు జడ్జీలకు పదోన్నతలొద్దు


సుప్రీంకోర్ట్ కొలీజియం ఎంపిక చేసిన న్యాయమూర్తుల పేర్లలో మార్పులపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పదోన్నతులు కల్పించవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. గత నెలలో ఇద్దరు హైకోర్ట్ చీఫ్ జస్టిస్‌లకు పదోన్నతి కల్పిస్తూ వారి పేర్లను సుప్రీంకోర్టుకు కొలీజియం సిఫారసు చేసి పంపింది. జనవరి 10న ఆ రెండు పేర్లను తొలగించి ఆ స్థానంలో మరో రెండు కొత్త పేర్లను సిఫార్సు చేసింది. ఈ మార్పులపై నలుగురు రిటైర్డ్ జడ్జిలు తీవ్రంగా స్పందించారు. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం, విశ్వసనీయత కాపాడేందుకు వెంటనే జోక్యం చేసుకోవాలని కోరుతూ ఢిల్లీ హైకోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ కైలాష్ గంభీర్ ఏకంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కి లేఖ రాశారు. 32 మందికి పైగా సీనియర్ జడ్జిలను కాదని జస్టిస్ సంజీవ్ ఖన్నాను సుప్రీంకోర్ట్ న్యాయమూర్తిగా సిఫార్సు చేయడాన్ని తీవ్ర తప్పుబట్టారు.దీనిపై సుప్రీంకోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ జస్టిస్ చలమేశ్వర్ తీవ్రంగా స్పందించారు. పరిస్థితిలో ఇప్పటికీ మార్పు లేదని జస్టిస్ చలమేశ్వర్ పేర్కొన్నారు. కొలీజియం వ్యవస్థ బలహీనంగా మారిందని మాజీ సీజేఐ ఆర్ఎం లోధా వ్యాఖ్యానించారు. కొలీజియం పనిచేస్తున్న తీరు చూస్తుంటే తీవ్ర నిరాశ, నిస్పృహలు కలుగుతున్నాయని అన్నారు.

బీజేపీకి మాజీ సీఎం గెగాంగ్ గుడ్‌బై



గువహటి: బీజేపీ సీనియర్ నాయకుడు, అరుణాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి గెగాంగ్ అపాంగ్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ప్రస్తుత బీజేపీ తీరుపట్ల తాను అసంతృప్తికి గురయ్యానని, స్వర్గీయ వాజ్‌పేయి సిద్ధాంతాలను ఎవరూ పాటించడం లేదని గెగాంగ్ అన్నారు. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు గెగాంగ్ లేఖ రాశారు. అధికారం చేపట్టడానికి వేదికగా పార్టీ పని చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్ణయాలు తీసుకోవడం, అధికార వికేంద్రీకరణలను అసహ్యించుకునే నేతలను పార్టీ సమర్థిస్తోందని గెగాంగ్ తన లేఖలో పేర్కొన్నారు. ఏ ఉద్దేశ్యాలతో పార్టీ స్థాపించారో వాటికి తిలోదకాలిచ్చారని ఆయన అన్నారు.

అయోధ్యకు సాధువుల పాదయాత్ర?



లక్నో: అయోధ్య కేసులో సుప్రీం కోర్టు విచారణ ఆలస్యమైతే సాధువులు అయోధ్యకు పాదయాత్ర చేస్తారని వివాదాస్పద బీజేపీ ఎంపీ సాక్షి మహారాజ్ అన్నారు. సుప్రీం కోర్టులో విచారణ ఆలస్యమవుతున్న కొద్దీ సాధువుల్లో ఆగ్రహం పెరిగిపోతోందన్నారు. రామ మందిర నిర్మాణానికి సంబంధించి చట్టం చేయాలని తాను ప్రభుత్వాన్ని కోరుతున్నానని, అలా కాకుంటే మందిర నిర్మాణం కోసం సాధువులు పాదయాత్ర చేయక తప్పదన్నారు.

రామ జన్మభూమి ఉద్యమ నేత దాల్మియా మృతి

రామ జన్మభూమి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విశ్వ హిందూ పరిషత్ సీనియర్ నాయకుడు విష్ణుహరి దాల్మియా(91) మరణించారు. రామ జన్మభూమి ట్రస్టీ అయిన దాల్మియా ఢిల్లీలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. దాల్మియా భారత్ గ్రూప్ అధినేత అయిన విష్ణుహరి దాల్మియా పెద్ద పారిశ్రామికవేత్త కూడా. వృద్ధాప్య సమస్యల కారణంగా ఈయన మృతి చెందారని, అంత్యక్రియలు సాయంత్రం నిగమ్‌బోధ్ ఘాట్‌లో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రైవేటులోనూ 10శాతం?

● పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు?



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలో విద్య, ఉద్యోగ రంగాల్లో ఆర్థికంగా వెనుకబడినవారికి రిజర్వేషన్ కల్పించిన నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రైవేట్ విద్యా సంస్థల్లోనూ ఈ రిజర్వేషన్ తెచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు డ్రాఫ్ట్ బిల్లు సిద్ధమైందని అధికార వర్గాల సమాచారం. సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రాకముందే ఈ చట్టాన్ని తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. జనవరి 31 నుంచి జరుగనున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే ఈ బిల్లును ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రైవేట్ రంగంలోనూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు కల్పిస్తున్న రిజర్వేషన్ తరహాలోనే ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. న్యాయ, మానవ వనరుల అభివృద్ధి శాఖలో కొత్త బిల్లుపై చర్చ జరిగింది. దీనికి ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించినట్లు తెలుస్తోంది. 2006లో ఓబీసీ వర్గాలకు రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం 93వ రాజ్యాంగ సవరణ తెచ్చింది. ఇదే తరహాలో ఇటీవల ఆమోదించిన 103వ రాజ్యాంగ సవరణను అమల్లోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు బీజేపీ వర్గాల కథనం. 2006లో అప్పటి యూపీఏ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులు అందుతున్న ప్రైవేట్ సంస్థలన్నింటిలోనూ ఓబీసీ రిజర్వేషన్ తేవాలని నిర్ణయించింది.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈబీసీ రిజర్వేషన్లు అమలు

2019-20 విద్యా సంవత్సరం నుంచి విద్యాసంస్థల్లో 10 శాతం ఈబీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ చెప్పారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వారం రోజుల్లో ఇస్తామన్నారు. ఈ రిజర్వేషన్లు ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల్లో వర్తిస్తాయని జవదేకర్ స్పష్టం చేశారు. ఇక.. ప్రస్తుతం ఉన్న సీట్లకు అదనంగా సీట్లను కూడా మంజూరు చేస్తామని చెప్పారు. వార్షిక ఆదాయం రూ. 8 లక్షల లోపు ఉన్న అగ్రవర్ణ పేదలు మాత్రమే ఈబీసీ కోటా కింద సీట్లు పొందవచ్చు. స్కూళ్లు, కాలేజీలు ఈ కోటాను అమలు చేస్తాయని మంత్రి తెలిపారు. ఈబీసీతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటాను కూడా అమలు చేయనున్నట్లు ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా మొత్తం 40 వేల కాలేజీలు, 900 వర్సిటీల్లో ఈబీసీ కోటా అమలు చేస్తారన్నారు. ఈబీసీ కోటా అమలు కోసం ప్రత్యేకంగా విద్యా సంస్థల్లో 25 శాతం సీట్లను కూడా పెంచనున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్పీ-బీఎస్పీ కూటమికి అజెండా లేదు



లక్నో: ఉత్తర్‌ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి), బహుజన్‌సమాజ్‌వాదీ పార్టీ (బిఎస్‌పి)లు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పొత్తు పెట్టుకోవడంపై కేంద్రమంత్రి, యూపీ బీజేపీ లోక్‌సభ ఎన్నికల ఇన్‌ఛార్జి జేపీ నడ్డా స్పందించారు. పొత్తు పెట్టుకోవడం ద్వారా ప్రధాని మోడీ శక్తిని ఆ పార్టీలు గుర్తించాయని పేర్కొన్నారు. ఎస్‌పి, బిఎస్‌పి కూటమికి ఎలాంటి అజెండా లేదని ఆయన అన్నారు. కేవలం మోడీని పదవి నుంచి తొలగించడమే అజెండాగా వారు పొత్తు పెట్టుకున్నారని నడ్డా అన్నారు. రాష్ట్ర ప్రజలకు కాని, దేశ ప్రజలకు కాని దీనివల్ల ఎలాంటి ఉపయోగం ఉండబోదని ఆయన చెప్పారు. వారి దురుద్దేశ్యాలను బహిర్గతం చేయడం తమ బాధ్యత అని ఆయన చెప్పారు.

ఎమ్మెల్యేకి కోటి!

• కోడి పందాల ముడుపులు • సుప్రీమ్ ఆదేశాలు బేఖాతర్ • కోట్లు చేతులు మారాయి • అశ్లీలం నర్తించింది • జూదం పెట్రేగింది... • మద్యం ఏరులై పారింది • కళ్లు మూసుకున్న శాంతి, భద్రత





(అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ఎన్నికల ఏడాది సంక్రాంతి సంబరాలు ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాప్రతినిధులకు బాగా కలిసొచ్చాయి. సంప్రదాయాల పేరిట ఏటా జరిగే కోడిపందాల నిర్వహణకు ఈసారి చివరివరకు డైలమా కొనసాగింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబే నేరుగా సంప్రదాయాల పరిరక్షణకు నడుంబిగించారు. అటువైపు చూడొద్దంటూ పోలీసులకు మౌఖిక ఆదేశాలిచ్చేశారు. ప్రతిఏటా సంక్రాంతి పందాల నిర్వహణ ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారుతోంది. నిబంధనల పేరిట వీటికి అడ్డుకట్టేస్తే ప్రజావ్యతిరేకత తప్పడంలేదు. ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని ప్రజల్లో సంతృప్తిని గరిష్ఠస్థాయికి తీసుకెళ్ళే ప్రయత్నాలు చేస్తున్న చంద్రబాబు అందొచ్చిన సంక్రాంతి సంప్రదాయ అవకాశాన్ని కూడా అనుకూలంగా మార్చుకున్నారు. సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యతంటూ స్పష్టం చేసేశారు. ఈ అవకాశాన్ని ప్రజాప్రతినిధులు అందిపుచ్చుకున్నారు. గతంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కోడిపందాలు జరిగేవి. ఈ ఏడాది చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతిగ్రామంలోనూ పందాలు నిర్వహించారు. సాక్షాత్తు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ పందాల్ని దగ్గరుండి మరీ నిర్వహించారు. ప్రతి పందాల నిర్వహణ ప్రాంతం వద్ద అర్ధనగ్న నృత్యాలు ప్రదర్శించారు. నెంబర్ గుండాటలు పెట్టారు. అసాంఘిక వ్యాపారాల్ని విచ్చలవిడిగా నిర్వహించారు. వీటికితోడు ఏకంగా బెల్ట్‌షాపుల్ని నెలకొల్పారు. దీంతో లక్షల్ని మించి కోట్లలో వ్యాపారాలు సాగాయి. ఇందుకు బదులుగా ఎమ్మెల్యేలకు ఒక్కో గ్రామం నుంచి లక్షల్లోనే ముడుపులు ముట్టాయి స్టేషన్లకు గ్రామాల వారీగా వేల రూపాయలు అందాయి. ఇలా చూస్తే ఒక్కో ఎమ్మెల్యేకు నియోజకవర్గ స్థాయిలో కోటి రూపాయలకు పైగా సంక్రాంతి కోడిపందాల ముడుపులు ముట్టినట్లు పరిశీలకులు అంచనాలేస్తున్నారు.

కోడిపందాల నిర్వహణపై భారత సర్వోన్నత న్యాయస్థానం కొన్ని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జంతువులు లేదా పక్షుల్ని సంప్రదాయాలు, పందాల పేరిట హింసకు గురిచేస్తే అంగీకరించేది లేదని తేల్చిచెప్పేసింది. కత్తులు, రక్తపాతాల్లేకుండా కోళ్ళ మధ్య పోటీలు నిర్వహించుకోవడం వరకు సమంజసమే తప్ప కోడికాలికి కత్తి కట్టినా పందాల పేరిట జూదాలు నిర్వహించినా తాటతీస్తామని హెచ్చరికలు జారీ చేసింది. ఈ ఉత్తర్వ్యుల్ని తూచ తప్పకుండా అమలు చేయాల్సిన ప్రభుత్వమే ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని ప్రజల్లో తమకనుకూలంగా సంతృప్తిని పెంచి ఓట్ల రూపంలోకి మార్చుకునే యత్నానికి ఒడిగట్టింది. ప్రభుత్వ సూచనల మేరకు పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో కోళ్ళ కాళ్ళకు కత్తులు వేలాడాయి. కోళ్ళు, కోళ్ళు కలియబడ్డాయి. కుత్తుకలు తెగ్గోసుకున్నాయి. గ్రామాల్లో హింస ప్రజ్వరిల్లింది. లక్షలు, కోట్లు చేతులు మారాయి. అశ్లీలం విశృంఖులంగా నర్తించింది. జూదం పెట్రేగిపోయింది. మద్యం ఏరులైపారింది. ఇది కొంతమందికి సంతృప్తి ఏ మేరకు కలిగించిందో లేదో తెలీదు గాని ఈ ప్రయోగం ఎన్నికల్లో ఏ మేరకు అధికార పార్టీకి ఉపకరిస్తుందన్న సందేహాలు మాత్రం వ్యక్తమౌతున్నాయి. గతంలో కూడా కోడిపందాలు జరిగాయి. ఇవి కొన్ని గ్రామాలకు లేదా కొన్ని ప్రాంతాలకు పరిమితయ్యాయి. ఎమ్మెల్యేలు లేదా ప్రజాప్రతినిధులు లేదా పేరెన్నికగన్న నాయకులు పాల్గొన్న పందాల బరులవైపు పోలీసులు వెళ్ళేవారు కాదు. మిగిలిన బరులపై దాడులు చేసేవారు. కొన్ని సందర్భాల్లో కోళ్ళను కూడా తెచ్చి స్టేషన్‌లో బంధించేవారు. జూదర్లను అరెస్టు చేసేవారు. కానీ సాక్షాత్తు ప్రభుత్వమే సంప్రదాయాలంటూ పందాలకు అలవోకగా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పోలీసులు అటువైపు వెళ్ళే సాహసం చేయలేదు. దీన్ని ఆర్థికంగా మార్చుకునేందుకు పరిమితమయ్యారు. చివరికి సంప్రదాయం ప్రజాప్రతినిధులకు ఆర్థిక లాభాల్ని తెచ్చింది. ఎన్నికల ఖర్చుల్లో కొంతమేరకు రాబట్టింది. అయితే ప్రతి అంశాన్ని దూరదృష్టితో లెక్కేసి నిర్ణయాలు తీసుకునే చంద్రబాబును సంప్రదాయాల కొనసాగింపునకు ఇచ్చిన అనుమతి సంతృప్తి రూపంలో ఎంతవరకు ఓట్లేయిస్తుందన్నది సందేహాస్పదమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

భారీగా కో(ట్ల)డి పందాలు చేతులు మారిన రూ.600 కోట్లు

సంక్రాంతి పండుగ మూడురోజులు కోడిపందా లు భారీగా జరిగాయి. కత్తులు కట్టకుండా కోడిపందా ల సంప్రదాయం కొనసాగించుకోవచ్చనే వెసులుబాటును ఆసరాగా చేసుకుని రికార్డు స్థాయిలో పందాలు నిర్వహించారు. కోడిపందాలకు పెట్టింది పేరైన తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలతోపాటు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ పందాలు జరిగాయి. సుమారు రూ.600 కోట్లు పైగానే చేతులు మారినట్లు అంచనా వేస్తున్నారు. ఈ కోడిపందాల స్థావరాల వద్దే గుండాట, పేకాట, అనధికార మద్యం షాపులు విచ్చలవిడిగా ఏర్పాటుచేసారు. చివరిరోజు కనుమ పండుగైన బుధవారం ఈ కోడిపందాలు మరింత రసవత్తరంగా సాగాయి. తెలంగాణతోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధికసంఖ్యలో ఈ పందాలకు తరలివచ్చారు. ఎవరిస్థాయినిబట్టీ వారు పందాలు కట్టారు. ఎక్కడా పోలీసులు వస్తారనే భయం లేకుండా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో డ్రోన్ కెమెరాలు, ఎల్ఈడీ స్క్రీన్‌లతో కోడిపందాలు నిర్వహించారు. పోలీసులు మాత్రం ఏమీ ఎరగనట్లు ఈ పందాల జోలికెళ్ళలేదు. అందుకు అధికమొత్తంలో ముడుపులు ముట్టాయనే ఆరోపణలున్నాయి. ఒకవేళ నిజాయితీపరుడినంటూ ఏ ఖాకీ అయినా ఇటువంటి భారీ పందాల స్థావరాలకు వెళ్ళి అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే అక్కడి నుంచి మామూలుగా తిరిగివచ్చే పరిస్థితి ఉండదనే చెప్పవచ్చు. అటువంటి ఏర్పాట్లు చాలాచోట్ల పందెంరాయుళ్లు చేసుకున్నారు. అందుకనే పోలీసు బాస్‌లు కూడా పండగపూట ఇటువంటి వివాదాల జోలికి వెళ్ళవద్దని ఆదేశించినట్లు స్పష్టమవుతోంది.



కేసుల కోసం పోలీసుల ఆరాటం

పండగ ముగిసిపోయింది. ఇప్పుడు పోలీసులకు కావలసింది కేసులు. కోర్టులు చివాట్లు పెట్టకుండా ఉండేందుకు పోలీసు శాఖ కూడా రాష్ట్రంలో ఉందని తెలియజేసేందుకు ఇప్పుడు పోలీసులు ఎన్నో కొన్ని కేసులు పెట్టడానికి ఆరాటపడుతున్నారు. అందుకు ఈ పందెంరాయుళ్ళనే బతిమలాడుతున్నారు. కోడిపందాలు ఎలాగో జరిగిపోయాయి కాబట్టి స్టేషన్‌కు ప్రాంతాన్ని బట్టి మూడు నుంచి ఆరు కేసులు నమోదు చేయడానికి చర్యలు చేపట్టారు. పందాలంటే తెలియని పెంటలవైపు తిరిగే కోడిపుంజులతోపాటు అసలు పందాలంటే ఎరుగని కిరాయి వ్యక్తులపైన కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడానికి పోలీసులు నిమగ్నమై ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోడిపందాలపై ఇన్ని కేసులు నమోదు చేసామని చెప్పుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కోడితో ఫొటోలు

గతంలో కోడిపందాలు ఆడినా, చూసేందుకు వెళ్ళినా సమాజంలో నేరంగా ఉండేది. అందుకనే చాటుమాటుగా ఈ కోడిపందాలకు వెళ్ళేవారు. కానీ ఇప్పుడు అందుకు పూర్తివిరుద్ధంగా ఉంది. సంక్రాంతి పండుగ మూడురోజులు కోడిపందాలు చూడలేదంటే అసలు పండగ చేసుకోలేనట్లే అన్నట్టుగా మారింది. అందుకనే ప్రతీఒక్కరూ ఈ కోడిపందాలకు వెళ్ళి కోడితో ఫొటోలు తీయించుకుని ఫేస్‌బుక్, వాట్సాప్‌ల్లో అందరికీ తెలిసేలా పోస్టుచేసి గర్వంగా ఫీలవుతున్నారు. మగవాళ్ళే కాదు అమ్మాయిలు, చిన్నారులు కూడా అదేబాటలో నడుస్తున్నారు. ఈ కోడిపందాల బరుల్లోకి కుటుంబసభ్యులంతా వెళ్లి తిలకించడం పెద్ద స్టేటస్‌సింబల్‌గా భావిస్తున్నారు. ప్రభుత్వం నిషేధించిన ఈ పందాలను తిలకించడం గర్వకారణమైపోవడం విచారకరం. సంక్రాంతి అంటే కోడిపందాలు ఒక్కటేనని భావిస్తుండడం మరీ దారుణం.

పల్లెకు పోయాం... పండుగ చేశాం

పచ్చని పొలాలు, ఆకాశంలోకి దూసుకుపోయే కొబ్బరిచెట్లు, వేదంలా ఘోషించే గోదారమ్మ పరవళ్ళతో కళకళలాడుతూ ఉండే గోదావరి జిల్లాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ప్రతి ఇంటా ఈ వేడుకలను ఎవరిస్థాయిలో వారు ఘనంగా నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా ఏమాత్రం ఆ ఆనవాయితీకి మచ్చలేకుండా సంక్రాంతి వేడుకలు ముగిసాయి. భోగి, సంక్రాంతి, కనుమ మూడురోజులు పేద ధనిక అనే భేదం లేకుండా పండుగ వేడుకల్లో మునిగితేలారు. దేశవిదేశాల్లో ఉద్యోగ వ్యాపారాల నిమిత్తం స్థిరపడినవారంతా స్వగ్రామాలకు విచ్చేసి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఏడాదికి ఒక్కసారైనా పుట్టిన గడ్డను, కన్న తల్లిదండ్రులను, ఆదరించే బంధువులను, అభిమానించే మిత్రులను కలుసుకుని ఆనందంగా వారిమధ్య గడపడం ఆశామాషీ అనుభూతి కాదు.

ఆ అనుభూతినంతా మూటగట్టుకుని తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఈ సంక్రాంతి పండుగవేళ చదువుకున్న పాఠశాలల్లో పూర్వవిద్యార్థుల కలయికలు అలాగే కుటుంబసభ్యుల ఆత్మీయకలయికలు ఈ ఏడాది అధికంగా జరిగాయి. కోనసీమలో ప్రభల తీర్థమహోత్సవాలు ఘనంగా జరిగాయి. రాజకీయ ప్రముఖులు, అధికారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కోనసీమ ప్రాంతంలో జరిగే ఈ ప్రభల తీర్థమహోత్సవాలు తిలకించడానికి సుదూరప్రాంతాల నుంచి సందర్శకులు తరలివస్తుంటారు.

ఆ సుందర దృశ్యాలను కెమెరాల్లో బంధించేందుకు స్వదేశీ విదేశీ ఫొటోగ్రాఫర్‌లు కూడా పోటీపడ్డారు. గ్రామాలు, సామాజికవర్గాల వారీగా ఈ ప్రభల తీర్థమహోత్సవాలు ఘనంగా జరిగాయి.

గ్రామదేవతల తీర్థమహోత్సవాలు

గ్రామాల్లో ఎంతో భక్తిశ్రద్ధలతో కొలిచే గ్రామదేవతల తీర్థమహోత్సవాలు ఈ సంక్రాంతి వేడుకల్లోనే జరుపుకుంటారు. ఆ గ్రామదేవతల ఉత్సవాల్లో పాల్గొనేందుకు సుదూరప్రాంతాల నుంచి సొంతూళ్ళకు తరలివస్తుంటారు. ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా గ్రామదేవతల తీర్థమహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి.

సోషల్ మీడియాల్లో సంక్రాంతి సందడి

సోషల్‌మీడియా అందుబాటులోకి రావడంతో సంక్రాంతి సంబరమంతా వాటిద్వారానే బహిర్గతమయ్యాయి. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్‌లలో ఎవరికి వారు సంక్రాంతి సంబరాలను మూడురోజులుగా పోస్టుచేస్తున్నారు. దీంతో ఈ వేడుకలకు మరింత ప్రాధాన్యత చేకూరింది.

మంచు కురిసే వేళలో... ప్రయాణం... జరభద్రం!

• పొగ మంచులో పొంచి వున్న ప్రమాదం
• ఆదమరిస్తే.... అంతే సంగతులు
• వేకువజాము ప్రయాణాలు వాయిదా వేసుకోవాలంటున్న అధికారులు



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఉదయం వేళల్లో దట్టమైన పొగ మంచు కురుస్తోంది. ఈ నేపథ్యంలోనే భాగ్య నగరంలో వివిధ వృత్తులు, వ్యాపారాలు, ఉద్యోగాల్లో స్థిరపడి సంక్రాంతి పండుగకు స్వరాష్ట్రానికి వచ్చే వారికి వాతావరణ అధికారులు, నిపుణులు అనేక సూచనలు, సలహాలు ఇస్తున్నారు. పోలీసులు కూడా ఈ అంశంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పొగ మంచు కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయిన పరిస్థితిని వారు ఈ సందర్భంగా ఉటంకిస్తున్నారు. పండుగ వేళ ఆనందాలు ఆవిరయ్యే ప్రమాదం ఉందని, దానిని నివారించేందుకు తరుణోపాయం మన చేతుల్లోనే ఉందని చెబుతున్నారు. దట్టమైన పొగమంచువల్ల రోడ్డు కనిపించక ప్రమాదాలకు కారణమవుతోందని స్పష్టంగా చెబుతున్నారు. తెల్లవారుజామున దారి పొడవునా దట్టంగా కమ్మేసిన పొగ మంచు కారణంగా ఎదురుగా ఏ వాహనం వస్తుందో, ఎక్కడ ఏముందో కనిపించక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల దేశ వ్యాప్తంగా, తెలుగు రాష్ట్రాల్లోనూ పొగమంచుతో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రయాణీకులు ప్రాణాలు కోల్పోయారు.

రోడ్డుపై దట్టంగా మంచు కమ్మేయడం వల్ల మనకు ఎదురుగా ఏముందో కనిపించని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ఎదురుగా వస్తున్న, రోడ్డు పక్కన నిలిపి ఉన్న వాహనాలను ఢీ కొట్టడమో, డివైడర్లను ఢీ కొట్టడమో జరిగిన ప్రమాదాలు అనేకం ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో ఒక్కసారిగా వాహనాన్ని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించడంవల్ల బోల్తాపడి ప్రమాదాలు చోటుచేసుకున్న సందర్భాలు కూడా లేకపోలేదు. షడన్ బ్రేకులు వేయడం వల్ల వాహనం తిరగడటం ఒక ప్రమాదం అయితే, అది తప్పినా కొంత దూరం ఈడ్చుకెళ్లి డివైడర్లను ఎక్కే ప్రమాదం ఉందని, దీనివల్ల ప్రాణాలు కోల్పోవడమో లేక అంగవైకల్యం పొండమో జరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం వేకవ జాము ప్రయాణాలు వాయిదా వేసుకోవడం ద్వారా నిండైన జీవితాన్ని కాపాడుకొనే ప్రయత్నంచేయాలని సూచిస్తున్నారు.





అతివేగం... ప్రాణాంతకం

సాధారణంగా మనముందున్న రోడ్డు సరిగా కనిపించనప్పుడు ఎంత నెమ్మదిగా వెళ్తే అంత మంచిదని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. అలా చేస్తే ఎదురుగా ఏదైనా అవరోధం వచ్చినా బ్రేకు వేసిన వెంటనే వాహనం ఆగిపోతుందని చెబుతున్నారు. ఫలితంగా ప్రమాదాన్ని నివారించొచ్చంటున్నారు. అదే మంచుకు వేగం తోడైతే ముప్పు మరింత పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. వేగంగా వెళ్తున్న వాహనాన్ని అకస్మాత్తుగా ఆపడం కష్టమై ప్రమాదానికి దారితీస్తుందని సూచిస్తున్నారు. వాహనాలకు ప్రస్తుతం ఉన్న లైట్లకు అదనంగా పసుపు లైట్లు ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు వెల్లడిస్తున్నారు. మంచులో వాహనం నడిపేప్పుడు ఈ పసుపు లైట్లు వినియోగించడంవల్ల వెలుతురు ఎక్కువ పడి దారి స్పష్టంగా కనిపిస్తుందని వారు వివరిస్తున్నారు.

బ్రేకు వేసినా ఆగని వేగం

వేగం గంటకు కి.మీ.	బ్రేకు వేశాక వెళ్లే దూరం (సెకనుకు మీటర్లలో)
60	16.6
70	19.44
80	22.22
90	25
100	27.7
110	30.55
120	33.3

పొగమంచుతో రోడ్డు ప్రమాదాలు (2017లో)

రాష్ట్రం / దేశం	రోడ్డుప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
దేశంలో	26,982	11,090	11,577
ఆంధ్రప్రదేశ్	1,352	457	572
తెలంగాణ	604	156	701


తీసుకోవలసిన జాగ్రత్తలు:

1. వేగంగా వాహనాన్ని నడిపితే మంచును తప్పించుకొని త్వరగా వెళ్లిపోవచ్చని కొందరు భావిస్తారు. కానీ అది సరికాదు.
2. దట్టమైన మంచు కురుస్తున్నప్పుడు రోడ్డు మధ్యలో వాహనాన్ని నిలపడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు.
3. వాహనం నడిపేప్పుడు ముందున్న దారి ఎన్ని మీటర్లు దూరం కనిపిస్తుంది ...బ్రేకు వేస్తే ఎంత దూరంలో వాహనం ఆగుతుందనే దానిపై పూర్తిస్థాయిలో స్పష్టత, అవగాహన ఉండాలి.
4. ఎక్కువ మంచు ఉంటే సురక్షిత ప్రదేశంలో వాహనాన్ని నిలిపి తగ్గే వరకూ వేచి చూడటం మంచింది.
5. అద్దంపై పడుతున్న మంచును తొలగించేలా వైపర్లు పనిచేస్తున్నాయా ? లేదా చూసుకోవాలి.
6. అతి తక్కువ వేగంతో వెళ్లాలి. లైట్లు తప్పని సరిగా ఆన్‌చేసి ఉంచాలి.
7. ఇతర వాహనాలను అధిగమించే ప్రయత్నం చేయకూడదు.
8. కూడళ్లవద్ద ఆగి ఒకసారి చూసుకుని ముందుకెళ్లడం మంచిది.

బీజేపీ మేనిఫెస్టో కమిటీకి పురందేశ్వరి, ఐవైఆర్



అమరావతి, ఆంధ్రప్రభ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ రాష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టో కమిటీని నూతనంగా ఏర్పాటు చేశారు. కమిటీ ఛైర్‌పర్సన్‌గా దగ్గుబాటి పురందేశ్వరి, కన్వీనర్‌గా మాజీ ఐఏఎస్ అధికారి ఐవైఆర్ కృష్ణారావును నియమిస్తూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ప్రకటన విడుదల చేశారు. అలాగే సభ్యులుగా పి. విజయ్‌బాబు, ఎమ్మెల్సీ పివియన్ మాధవ్, దాసరి శ్రీనివాసు లు, షేక్ మస్తాన్, పాక సత్య నారాయణ, కె. కపీలేశ్వరయ్య, పి. సన్యాసి రాజు మురళీ, సుధీష్ రాంబొట్ల, ప్రొఫెసర్ డిఏఆర్ సుబ్రమణ్యం లను నియమించారు.





శారదా పీఠంలో గోపూజ

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక పండుగలు: స్వరూపానందేంద్ర సరస్వతి

విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: విశాఖ శారదా పీఠంలో సంక్రాంతి పర్వదినం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కనుమ పండగను పురస్కరించుకుని బుధవారం పీఠం ప్రాంగణంలో కొలువున్న దేవతామూర్తులకు స్వరూపానందేంద్ర చేతుల మీదుగా ప్రత్యేకపూజాది కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి గోపూజ జరిపి గోవులకు పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు స్వామీజీ ఆశీర్వాదం అందజేసి తదుపరి అనుగ్రహ భాషణం నిర్వహించారు. సంస్కృతీ, సాంప్రదాయాలకు పండగలు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. లోకకల్యాణార్థం శారదా పీఠంలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండగ అతి పెద్దదని, ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లినవారంతా తమ తమ స్వగ్రామాలకు చేరుకుని పిల్లలు, కుటుంబాలతో కలిసి ఆనందంగా గడిపే సమయమన్నారు. దీంతోపాటు సాంప్రదాయాల ప్రకారం పెద్దల్ని స్మరించుకోవడం కూడా ఒక మధురానుభూతిగా స్వరూపానందేంద్రస్వామి అభివర్ణించారు. భవిష్యత్‌లో పండగలకు సంబంధించిన అన్ని వివరాలను పిల్లలకు తెలియజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. ఉత్తర పీఠాధిపతి కిరణ్‌కుమార్ శర్మ పర్యవేక్షణలో కనుమ పండగ, గోపూజ నిర్వహించగా పీఠం శ్రీకార్యం కామేశ్వర శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఢిల్లీలో సంక్రాంతి సంబురాలు




న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: సంక్రాంతి సంబురాలతో దేశ రాజధాని ఢిల్లీ పులకించిపోయింది. బుధవారం కనుమను తెలుగు కుటుంబాలు కన్నులపండువగా జరుపుకున్నాయి. సంక్రాంతి సందర్భంగా అతిథి మర్యాదలు స్వీకరించిన దేవతలు స్వర్గానికి పయనవుతారనే గాథలు ప్రచారంలో ఉండడంతో చాలా మంది తమ లోగిలి ముందు రథం ముగ్గు వేసి కనుమను ఆస్వాదించారు. మరోవైపు నాలుగు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ భవన్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబురాలు ఘనంగా ముగిశాయి. ప్రత్యేకించి వేదికపై సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణతో కలిసి ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ డాక్టర్ ఆర్జ శ్రీకాంత్, భవన్ అధికారులు, సిబ్బంది, ఆహుతులు కలిసి పాడిన జన్మభూమి పిలుస్తోంది...నీ పుణ్యభూమి పిస్తోంది అంటూ జన్మభూమిమా ఊరు గీతం పండుగ వేడుకలే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయబద్ధంగా ఈనెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించిన ఉత్సవాల్లో కూచిపూడి నృత్యాలు, పోటీలు, జానపద గేయాలు, నాట్యాలు, డప్పుల విన్యాసాలు, పగటి వేషగాళ్లు, సినీ సంగీత విభావరి, సంప్రదాయ దుస్తులు, ఉత్తమ జంటల పోటీలు, ముత్యాల ముగ్గులు, ఆంధ్ర పిండి వంటల పోటీలు, కబడ్డీ, చెస్, క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్, బాల్యాన్ని గుర్తుకు తెచ్చేలా నిర్వహించిన కుర్చీలాట, లెమన్ అండ్ స్పూన్, తొక్కుడు బిళ్ల ఆటలకు విశేష స్పందన లభించింది. తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన వెంకటగిరి, ధర్మవరం, పోచంపల్లి, ఉప్పాడ, గద్వాల చీరలు, కాకినాడ, తాపేశ్వరం కాజా, బందరు లడ్డు, మచిలీపట్నం వన్ గ్రామ్ గోల్డ్, కళంకారీ, చేనేత వస్త్రాలు, బొమ్మలు, ఆంధ్ర పచ్చళ్లు, పిండి వంటల స్టాల్స్ భారీగా కొనుగోళ్లు జరిగాయని నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. విశిష్ట అతిథులు విజేతలకు ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. అలాగే భోగిమంటలు, గొబ్బెమ్మలు, సంక్రాంతి పొంగళ్లు, చిన్నారులకు భోగి పళ్ల వేడుకలు కన్నులపండువగా జరిగాయి. ముగింపు ఉత్సవాలకు కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీమతి ప్రీతి సుదాన్ ముఖ్య అతిథిగా హాజరై భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, ఫుడ్ కోర్టును సందర్శించారు. విజేతలకు బహుమతి ప్రదానం అనంతరం ఆమె మాట్లాడుతూ... ఈ పండుగ వాతావరణం చూస్తుంటే తాను కృష్ణా జిల్లా నూజివీడులో సబ్ కలెక్టర్‌గా పని చేసిన రోజులు గుర్తుస్తున్నాయంటూ ఆమె తన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలు దేశ రాజధానివాసులు, విదేశీయులు తెలుసుకోవాలనే సదుద్దేశంతో అధికారగణమంతా సమష్టి కృషితో పని చేశామని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పేరు గడించిన జానపద, సంప్రదాయ కళాకారులను రప్పించి ప్రదర్శనలు ఏర్పాటు చేసి మన కళల గొప్పదనాన్ని అందరికీ తెలియజెప్పామని కమిషనర్ డాక్టర్ ఆర్జ శ్రీకాంత్ అన్నారు.

ఉర్రూతలూగించిన నేపథ్య గాయకులు సునీత, శ్రీ కృష్ణ బృందం సినీ సంగీత విభావరి

ప్రముఖ సింగర్ సునీత, కుమారి సాహితి, సాయి చరణ్ బృందంతో ఏర్పాటు చేసిన సంగీత విభావరి ప్రేక్షకులను ఆనంద డోలికల్లో ఓలలాడించింది. వారి గానాలాపనకు ఏపీ భవన్ ప్రాంగణం మార్మోగిపోయింది.

పట్టాదార్ బుక్కులకు లైన్ క్లియర్



యుద్ధ ప్రాతిపదికన ఇవ్వాలని సీసీఎల్ఏ ఆదేశం

- ప్రస్తుత తహశీల్దార్లకు 'డిజిటల్ సిగ్నేచర్' వెసులుబాటు
- ఇక పెండింగ్ పుస్తకాలకు కదలిక • ఎన్నికల కోడ్ నుంచి విముక్తి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైతుల పట్టాదార్ పాస్ పుస్తకాల సమస్యల నివారణ దిశగా ప్రభుత్వం దృష్టిసారించింది. ఎన్నికల కారణంతో పెండింగ్ పాస్ పుస్తకా లకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటి వరకు 51.50లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపి ణీకాగా, మిగతావాటికి ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారకుండా ఆదేశాలు జారీ చేస్తోంది. గతేడాది అక్టోబర్‌నుంచి ముందస్తు ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రక్రియ నిల్చిపోయిన సంగతి తెలిసిందే. అంతకు నెలముందే తహశీల్దార్ల బదలీలతో డిజిటల్ సంతకాలు నిలిపివేయడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. భూ రికార్డుల డైరెక్టర్ వాకాటి కరుణ చొరవతో తాజాగా తహశీల్దార్లకు డిజిటల్ సిగ్నేచర్ ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌తో పాస్ పుస్తకాల జారీ ఆలస్యం కాకుండా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా పంపిణీ చేసిన పాస్ పుస్తకాల్లోని 9లక్షల పుస్తకాల్లో తప్పులను కూడా సవరించి పునః పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ చేశారు. వీటిని యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని నిర్ణయించారు. శాసనసభ ఎన్నికలు ముగిసిన తర్వాత తహశీల్దార్ల బదలీలతో ఈ ప్రక్రియ మొదలవుతుందని భావించారు. కానీ మరోసారి పంచాయతీ ఎన్నికల కారణంగా కొంత జాప్యమవుతుందన్న వార్తలతో ప్రభుత్వం అప్రమత మైంది. ఎన్నికలకు ముందు బదలీఅయిన తహశీల్దార్లను తిరిగి పాత స్థానాలకు బదలీ అయ్యేంతవరకు వేచిచూడాలనే యోచనను విరమించుకుని రైతుల సంక్షేమమే ప్రాధాన్యతగా సీసీఎల్ఏ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పుడున్న తహశీల్దార్లకే డిజిటల్ సిగ్నేచర్ అవకాశం కల్పించారు. దీంతో పార్లమెంటు ఎన్నికల జాప్యం పాస్ పుస్తకాల పంపిణీ, పునర్ముద్రణపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. రైతుబంధు పథకం ప్రయోజనం పొందేందుకు పాస్ పుస్తకం తప్పనిసరి కావడంతో రైతులందరికీ పట్టాదార్ పాస్‌పుస్తకాలిచ్చేలా కార్యాచరణ వేగవంతం చేశారు. మొదటి విడత రైతుబంధు పథకంలో రైతు వివరాలు వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లో ఉంటే పాస్ పుస్తకం లేకున్నా చెక్కులిచ్చినట్లుగానే తాజాగా మొదటి పేజీని అందజేస్తున్నారు. ఆన్‌లైన్ రికార్డులో పట్టాదార్ పేరును చేరుస్తున్నారు. దీంతో సమస్య పరిష్కారమవుతోంది.

కొత్త పాస్ పుస్తకాల జారీతోపాటు జారీ చేసిన వాటిలో తప్పుల సవరణ దిశగా కీలక మార్గ దర్శకాలు జారీ చేశారు. గతేడాది సెప్టెంబర్ 15న ఆరంభమైన భూ రికార్డుల ప్రక్షాళన ఏడాదిపాటు కొనసాగి 70లక్షల కమతాలకు చెందిన 57.33 లక్షల కమతాలు వివాదరహితంగా తేల్చారు. అయితే వీటిలో 51.50 లక్షల పాస్ పుస్తకాలను ముద్రిం చారు. ఇందులోనే 42 లక్షల పాస్ పుస్తకాలే పంపిణీ చేయగా, మరో 9లక్షల పాస్ పుస్తకాల్లో

రికార్డుల ప్రక్షాళనలో...

ముద్రణా దోషాలు, పేర్లు, కమతాలు, ఖాతాలు, లింగ బేధాలు, విస్తీర్ణం వంటి తప్పులు దొర్లాయని గుర్తించి పంపిణీ చేయకుండా ఆపేశారు. మరో 1.76లక్షల పాస్ పుస్తకాలు పట్టాదార్లు రాకపోవడంతో నిలిపేశారు. మరో 6 లక్షల తప్పులు దొర్లిన పాస్ పుస్తకాలను తిరిగి ముద్రించి జిల్లాలకు చేర్చారు. ఇప్పుడు ఈ సమస్యలన్నీ నివారించేలా ప్రభుత్వం చొరవ తీసుకుంది. వీలైనంత త్వరగా పాస్ పుస్తకాల సమస్యను నివారించి రైతాంగానికి ఆన్‌లైన్‌లో స్పష్టతనివ్వాలని నిర్ణయించింది.



చంద్రుడిపై చైనా మొక్క

- చాంగె - 4 ప్రోబ్ ద్వారా అద్భుత ఆవిష్కరణ

బీజింగ్: చంద్రమండలంపై చైనా మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. చారిత్రక ప్రయోగానికి ఇటీవల శ్రీకారం చుట్టిన డ్రాగన్, దానిద్వారా అక్కడ మొక్కల పంపకాన్ని చేపట్టింది. చాంగె -4 ప్రోబ్ ద్వారా ఈ అద్భుతాన్ని సృష్టించింది. చాంగె -4 పంపిన చిత్రాల ద్వారా చంద్రుడిపైన తాము చల్లిన విత్తనాలు మొలకెత్తినట్లు ప్రకటించింది. మెటల్ క్యాన్ ద్వారా చేపట్టిన ఈ ప్రయోగానికి పత్తి, ఆలు, ఆయిల్‌సీడ్, ఆరాబోపోసిస్ వంటి విత్తనాలను ఎంపిక చేసుకున్నామని, అయితే, పత్తి విత్తనం ఒక్కటే మొలకెత్తిందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. సౌత్‌వెస్ట్‌చైనాకు చెందిన చాంగ్‌కింగ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ విత్తనాలను ప్రోబ్‌లో పొందుపరిచారు. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలను తట్టుకునే సామర్థ్యంతోపాటు కొద్దిఎత్తుకే పరిమితం అయ్యేవి, రేడియేషన్‌ను తట్టుకోగలవి అయినందున ప్రయోగానికి ఈ విత్తనాలను ఎంపిక చేసుకున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. తక్కువ గురుత్వాకర్షణ, బలమైన రేడియేషన్, తటస్థ కాంతి వంటి వాతావరణంలో మొక్కలు ఎలా పెరుగుతాయో అధ్యయనం చేసేందుకు ఈ ప్రయోగం ఉపకరిస్తుంది. ఇది ఫలవంతం అయితే, భవిష్యత్‌లో వ్యోమ గాములు ఆహారం కోసం భూమికి తిరిగి రావాల్సిన అవసరం ఉండదని, అక్కడ జీవించేందుకు అవసరమైన ఆహారాన్ని అక్కడే సాగుచేసుకునే సౌలభ్యం కలుగుతుంది. గతంలో అంతర్జాతీయ పరిశోధనా కేంద్రంలో మొక్కలు మొలిచాయి. కానీ చంద్రుడిపై ఇలాంటి ఆవిష్కరణ ఇదే ప్రథమం. మూన్‌పై జీవానుకూలిత వాతారణం అభివృద్ధికి మొక్కల పెంపకం దోహదం చేస్తుంది అని చైనా శాస్త్రవేత్తలు వివరించారు.

పక్కాగా అటవీ భూముల లెక్కలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కబ్జాదారుల చేతుల్లో చిక్కుకున్న అటవీ భూముల లెక్కలను పక్కాగా తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనేక జిల్లాల్లో అటవీభూములు అక్రమణలకు గురవుతున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు భూముల లెక్కలు తేల్చే పనిలో రెవిన్యూ, అటవీశాఖలు రంగంలోకి దిగాయి. ఈనెల నుంచి మార్చి నెలాఖరు నాటికి అక్రమణకు గురైన అటవీ భూములను లెక్కపెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో దాదాపు 500 మంది సర్వేయర్లకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. అన్ని జిల్లాల్లోని అటవీ భూములు కబ్జాకు గురయ్యాయి. కొన్ని భూముల విషయంలో కోర్టులలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే అడవుల్లో నివశించే గిరిజనులకు పోడు భూములకు సంబంధించి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో అటవీ హక్కుల గుర్తింపు చట్టం కింద పట్టాలను కొందరికి ఇచ్చారు. అయినప్పటికీ ఈ సమస్య పెండింగ్‌లో ఉంది.

రెవిన్యూ, అటవీ సిబ్బంది సమన్వయంతో భూమి లెక్కలు తేల్చితే, అటవీభూముల పంపిణీ సమస్యకు చెక్‌పెట్టాలని నిర్ణయించారు. గతంలో రెండు లక్షల మంది గిరిజనులు తమకు భూములు కావాలంటూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా, వారిలో లక్షమందికి పట్టాలు ఇచ్చారు. మరో లక్షమందికి పట్టాల పంపిణీ పెండింగ్‌లో పెట్టారు. అనేక సంవత్సరాలుగా అటవీ భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికై రెవిన్యూ, అటవీశాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని భావించినప్పటికీ కార్యచరణ ముందుకు సాగడం లేదు. కబ్జాదారులు కోర్టులో కేసులు వేయడంతో దీర్ఘకాలంగా సమస్య పెండింగ్‌లో ఉంది.

ఈ నేపథ్యంలో ఈనెల నుంచి మార్చి లోగా అక్రమణకు గురైన భూములపై పక్కా లెక్క తేల్చాలని రెవిన్యూ, అటవీశాఖ సర్వేను చేపట్టాయి. అటవీభూములకు సంబంధించి 41 లక్షల ఎకరాల భూమి వివాదంలో లేదు. అడవి, పోరంబోకు తదితర పేర్లతో రికార్డుల్లో ఈ భూమి ఉంది. ఈ భూములను సరిచేసి ఒకేపేరుతో ఉంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ భూమితో పాటు మరో 25 లక్షల ఎకరాల భూమిని సర్వే చేసి రికార్డులను సరి చేయవల్సి ఉందని, అలాగే రాష్ట్రంలో పోడు వ్యవసాయం కింద ఆరు లక్షల ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

'స్లాట్'తో కాసుల గలగల

- ఆన్‌లైన్ స్లాట్‌తో ఫలాలు • మెరుగైన బుకింగ్ విధానం.. అనూహ్యస్పందన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రిజిస్ట్రేషన్ శాఖ అవలంభి స్తున్న ఆన్‌లైన్ స్లాట్ విధానం కాసుల పంట కురిపిస్తోంది. ఇప్పటికే ఈ ఛలాన్లతో జాప్యం నివారించిన రిజిస్ట్రేషన్ల శాఖ గతేడాది నవంబర్ 1నుంచి స్లాట్ విధానం అమలు చేస్తోంది. దీంతో పాస్ పోర్టు తరహాలో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ స్లాట్ అమలవు తోంది. ముందుగానే క్రయ విక్రయదారులు తమకు వీలైన సమయం, తేదీల్లో రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుక్ చేసుకుంటున్నారు. రాష్ట్రంలోని 141 రిజిస్ట్రేషన్ కార్యాల యాల్లో ఈ విధానం అమలులోకి వచ్చింది, ఉదయం 10.30 గంటలనుంచి మధ్యాహ్నం 2.15 గంటలవరకు తొలి ప్రాధాన్యత ఆన్‌లైన్ స్లాట్ రిజిస్ట్రేషన్లకే ఉంటుంది. ప్రతీరోజు ఒక్కో స్లాట్‌లో 18 రిజిస్ట్రేషన్‌లు చేసుకునేం దుకు స్లాట్ విధానంలో వెసులుబాటు ఉంది. అయితేస్లాట్ బుకింగ్‌తో రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్న విని యోగదారు లకు అదేరోజు డాక్యుమెంట్లను స్కాన్ చేసి అందిస్తున్నారు. పబ్లిక్ డాటా ఎంట్రీ పూర్తిచేసి ఈ చలాన్‌ను జతపర్చి ఆన్‌లైన్ లోస్లాట్ బుకింగ్ చేసు కోవాలి. ఆ తర్వాత నిర్దేశిత స్లాట్ లో పేర్కొన్న సమ యానికి కార్యా ల యానికి రావాలి.

నవంబర్ 1నుంచి అమలులోకి వచ్చిన ఆన్‌లైన్ స్లాట్ ద్వారా ఇప్పటివరకు 30871 రిజిస్ట్రేషన్లు జరిగాయి. అనూహ్య స్పందన వ్యక్తమవుతుండటంతో రాబడి పెరగడంతో పాటు, జాప్యం, అవినీతి తగ్గు తోంది. ఆన్‌లైన్ స్లాట్ కారణంగా కొను గోలు దారులు డాక్యుమెంట్ రైటర్ల వద్ద డాక్యుమెంట్ సిద్ధం చేయించు కోవాల్సిన పరిస్థితి తప్పింది. కొను గోలు దారులే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ ను ఎంట్రీ చేసుకొని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళుతున్నారు. దీంతో పనిభారం తగ్గుతోంది. ఇకమీదట ఈసీల్లో పెండింగ్ డాక్యుమెంట్ల వివరాలనూ వెల్లడించేలా రిజిస్ట్రేషన్ల శాఖ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాలు, మీ సేవలు, ఆన్‌లైన్ డాష్‌బోర్డులో వీటిని తెలుగు, ఉర్దూల్లోనూ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. డాక్యుమెంట్ల సంబంధిత సమాచారం, ఆస్తి వివరాలు, విస్తీర్ణం, సర్వే నెంబర్, సరిహద్దులు, మార్కెట్ విలువలు, ఇంటి నెంబర్ వివరాలు దీనిద్వారా అందుబాటులోకి రానున్నాయి.

నూతన సేవలతో ప్రజలకు మరింత మేలు...

రాష్ట్రవ్యాప్తంగా 859 కంప్యూటరైజ్డ్ పోస్టా ఫీసుల్లో స్టాంపు పేపర్ల విక్రయాలు విజయవంత మయ్యాయి. ఇక కోరుకున్న రోజు, కోరుకున్న సమ యంలో విని యోగదారులకు ఆన్‌లైన్ రిజి స్ట్రేషన్ల కోసం అమలు చేస్తున్న స్లాట్ బుకింగ్ కూడా ఇప్పు డిప్పుడే ఆదరణ పొందుతోందని అధికారులు గుర్తిం చారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 2.15 వరకు స్లాట్ బుకింగ్ అమలులో ఉంటోంది. రిజి స్ట్రేషన్ ప్రక్రియను సులభం చేయడం, ప్రజలకు సల హాలు, సూచనలు, అనుమానాల నివృత్తికి వాట్సాప్ సేవలను ఆరంభిం చింది. అవాంతరాలు లేకుండా ప్రజా సేవలను మరింత పారదర్శకం చేయడం, ప్రజలకు సమాచారం అందజేతతో సమస్యలు లేకుం డా ముందుకు సాగుతోంది. అదేవిధంగా నిరంతరం పనిచేసేలా కాల్ సెంటర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం 7093920206 నెంబర్‌తో వాట్సాప్ సేవలను ప్రారంభించింది.

వి.ప్రకాష్‌కు పర్యావరణ సంరక్షక్ అవార్డు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : జలవనరుల రంగంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం, జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వి.ప్రకాష్ చేస్తున్న విశేషకృషికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభిస్తున్నది. వాటర్‌మాన్ ఆఫ్ రాజేంద్రసింగ్ సారథ్యంలోని తరుణ్ భారత్‌సంఘ్ పర్యావరణ సంరక్షక్ అవార్డుకు వి.ప్రకాష్‌ను ఎంపికచేసింది. జనవరి 15,16తేదీలలో రాజస్థాన్ బీకంపురాలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును మహాత్మాగాంధీ మనువడు అరుణ్‌గాంధీ, మునిమనవడు తుషార్ గాంధీ చేతులమీదుగా వి.ప్రకాష్ అందుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర సింగ్ వి.ప్రకాష్ దంపతులను సన్మానించారు. కార్యక్రమానికి దేశవిదేశాల నుండి ప్రముఖ పర్యావరణవేత్తలు, జలవనరుల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలవు తున్న పథకాలను వి.ప్రకాష్ ప్రస్తావించి వాటి విజయాలు వివరించారు.

కెన్యాలో ఉగ్రదాడి

- 15 మంది మృతి



నైరోబీ: కెన్యా రాజధాని నైరోబిలోని ఓ హోటల్‌పై ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడి చేశారు. ఈ ఘటనలో 15మంది చనిపోయారు. పలువురికి తీవ్ర గాయాల య్యాయి. దాడికి పాల్పడ్డ నలుగురు మిలిటెంట్లను పోలీ సులు కాల్చివేశారు. విదేశీయులు ఎక్కువగా బసచేసే నైరోబిలో వెస్ట్‌ల్యాండ్ డిస్ట్రిక్ట్‌లోని ఓ హోటల్‌లో ప్రవేశిం చిన దుండగులు పార్కింగ్ ప్లేస్‌లోని వాహనాలపై బాంబులు విసిరారు. తర్వాత కాల్పులు జరిపారు. ఒక ఉగ్రవాది ఆత్మాహుతికి పాల్పడ్డాడు. ఘటనా స్థలంలోనే ఐదుగురు మృతి చెందారు. మరొకరు హాస్పిటల్‌లో చనిపో యాడు. ఈ దాడి నుంచి 700 మంది తప్పించుకొని సురక్షితంగా బయటపడ్డారు. విదేశీయులే లక్షంగా ఈ దాడి జరిగినట్లు అక్కడి పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు తెలిసిన వివరాల ప్రకారం మొత్తం 15 మంది ప్రాణాలు కోల్పోయారు. దాడి సమాచారం అందుకున్న భద్రతా బలగాలు హోటల్‌కు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చాయి. ఈ దాడికి తామే కారణమని అల్ షబాబ్ ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది.


స్వైన్ ఫ్లూతో ఢిల్లీ ఎయిమ్స్‌లో అమిత్ షా



న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా స్వైన్ ఫ్లూతో బాధపడుతున్నారు. అమిత్ షాకు స్వైన్ ఫ్లూ లక్షణాలు ఉండటంతో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరారు. తాను స్వైన్ ఫ్లూతో ఎయిమ్స్‌లో చేరినట్లు అమిత్ షా ట్విట్టర్ ద్వారా తెలియజేశారు. ఛాతిలో నొప్పిగా ఉండటం.. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది కలగడంతో అమిత్ షా ఎయిమ్స్‌లో పరీక్షలు చేయించు కున్నట్లు బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి. ఫ్లూ లక్షణాలున్నాయని వైద్యులు నిర్ధారించడంతో ఎయిమ్స్ లోనే చికిత్స పొందుతున్నారు. బుధవారం రాత్రి 9 గంటలకు ఎయిమ్స్‌లోని ఓల్డ్ ప్రైవేట్ వార్డులో అమిత్ షా చేరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. షా ఆరోగ్య పరిస్థితిని వైద్యుల బృందం ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది. ఎయిమ్స్ వైద్యుడు రణ్‌దీప్ గులేరియా వైద్యుల బృందానికి సారథ్యం వహిస్తున్నారు. అమిత్ షా స్వైన్ ఫ్లూతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఎయిమ్స్‌కు వెళ్లి ఆయన్ని పరామర్శించారు.

అస్వస్థతతో న్యూయార్క్‌కు జైట్లీ

- కేన్సర్ చికిత్స కోసం రెండు వారాలు అమెరికాకు
- ఆపరేషన్ తప్పనిసరైతే బడ్జెట్ సమావేశాలకు దూరం..!



న్యూయార్క్: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలకు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ హాజరుకావడం లేదా..? చివరి బడ్జెట్ సెషన్స్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాల్సిన జైట్లీ లేకుండానే సమావేశాలు జరగనున్నాయా..? ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అవుననే సమాధానం వస్తోంది. కేన్సర్‌తో బాధ పడుతున్న జైట్లీ ట్రీట్ మెంట్‌కోసం న్యూయార్క్ బయలు దేరివెళ్లారు. రెండు వారాల పాటు అమెరికాకు వ్యక్తిగత పర్యటన కోసం వెళ్తునట్లు జైట్లీ పేర్కొన్నప్పటికీ.. సన్నిహితులు మాత్రం ట్రీట్‌మెంట్ కోసమే ఆయన అమెరికా వెళ్లారని చెబుతున్నారు.

ఒక వేళ ఆపరేషన్ చేయాల్సి వస్తే మాత్రం వచ్చే బడ్జెట్ సమావేశాల్లో జైట్లీ పాల్గొనకపోవచ్చని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. న్యూయార్క్ పర్యటనలో భాగంగా కీమోథెరఫి వంటి చికిత్సలు కూడా చేయించుకోవచ్చని తెలుస్తోంది.

గతేడాది కిడ్నీ మార్పిడి

గతేడాది మే 14న జైట్లీ కిడ్నీ మార్పిడి చికిత్సకోసం బడ్జెట్ సమావేశాలకు దూరంగా ఉండటంతో రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆ బాధ్యతలు నిర్వర్తించారు. దాదాపు 5 నెలల పాటు జీఎస్టీ సమా వేశాలు, ఇతర ఆర్థిక వ్యవహారాలు పీయూష్ గోయలే చూసుకున్నారు. ఆగస్టు 18, 2018లో మళ్లీ జైట్లీ విధుల్లో చేరారు. లోక్‌సభ ఎన్నికల వేళ కొత్త కొత్త వ్యూ హాలు రచిస్తున్న మోడీ ప్రభుత్వం...బడ్జెట్ సమావేశాలే వేదికగా కీలక పథకాలను ప్రకటించాలని భావిస్తోంది. రైతులకు పెద్దపీట వేయడమే లక్ష్యంగా మోడీ మదిలో అనేక ఆలోచనలు రేకెత్తుతున్న తరుణంలో ఇప్పటికే నిపుణులతో సైతం చర్చలు జరిపారు. రుణమాఫీని మించిన నజరానాను రైతులకు ప్రకటించాలని భావిస్తు న్న ప్రధాని.. తెలంగాణలో మంచి ఫలితాలిచ్చిన రైతు బంధును కూడా అందిపుచ్చుకోవాలని యోచిస్తున్నారు. ఇలాంటి తరుణంలో కీలక ప్రకటన చేయాల్సిన అరుణ్ జైట్లీ సభలో లేకుంటే ఆ వెలితి పూడ్చడం ఇత రులకు కష్టమే. ఈనేపథ్యంలో ఆపరేషన్ కంటే చిన్న చిన్న చికిత్సలు చేయించుకుని తిరిగిరావాలని అరుణ్ జైట్లీ అమెరికా వెళ్లారు. వైద్యులు తప్పనిసరిగా ఆప రేషన్ చేయాలని సూచిస్తే మాత్రం జైట్లీ అక్కడే ఉండ కతప్పదు. ఈనేపథ్యంలో బడ్జెట్ సమావేశాల్లో జైట్లీ హాజరౌతారా..? లేదా..? అనేది ఆసక్తికరంగా మారిది.

నాగోబా కోసం గంగా యాత్ర

- ముమ్మర ఏర్పాట్లు... తొలి ఘట్టానికి శ్రీకారం చుట్టిన మెస్రం వంశస్థులు



ఇంద్రవెల్లి, ప్రభన్యూస్ : ఆదిలాబాద్ జిల్లాలోని కేస్లా పూర్ నాగోబా జాతర పూజలలో తొలిఘట్టమైన పవిత్ర గంగాజల సేకరణకు మెస్రం వంశస్థులు బుధవారం బయలు దేరారు. ఆదివాసుల ఆరాధ్యదైవం రాష్ట్ర పండు గగా గుర్తింపు పొందిన ప్రతీ సంవత్సరం పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని మెస్రం వంశీయుల మహాపూజలతో ప్రారం భమయ్యే నాగోబా జాతర మహాపూజకు అవసరమైన గంగా జలం కోసం మెస్రం వంశీయులు బుధవారం గోదావరి హస్తిన మడుగు కు బయలుదేరి వెళ్లారు. బుధవారం ఉదయం నుంచి మెస్రం వంశీయులు కెస్లాపూర్ గ్రామంలోని నాగోబా మురాడి వద్ద కు చేరుకుని గంగాజలం తీసుకువచ్చే యాత్ర నాగోబా మహా పూజ , జాతర నిర్వహణ తదితర విషయాలపై చర్చించారు. ఈసందర్భంగా మెస్రం వంశీయులు మహిళలు గంగాజలం తీసుకువచ్చే ఝూరి (కలుషం) కు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. అనంతరం మెస్రం వంశం కబోడ మెస్రం హనుమంత్ రావ్ ప్రధాన్ మెస్రం తుక్డోజీల ఆధ్వర్యంలో కాలనడకనతో గంగా జలం యాత్రను ప్రారం భించారు. కాలి నడకతో బయలుదేరిన మెస్రం వంశీయులు మొదటి రోజు బుధవారం సాయంత్రం మండ లంలోని ముత్నూర్ గ్రామపొలిమేరకు చేరుకుని బస చేశారు. ఈనెల 17న ఉట్నూర్ మండలం లోని సాలెవాడ , 18న నార్నూర్ మండలం లోని జామ్డ, 19న జామ్ గూడ, ఈనెల 20న జైనూర్ మండలంలోని గౌరి, 21న దబోలి ఈనెల 22 న సిర్పూర్ యు , మండలంలోని దేవుల్‌పల్లి , 23న జన్నారం మండలంలోని ఇస్‌పూర్, 24న కలమడుగు, 25న గోదావరి హస్తిన మడుగు కు చేరుకుని ప్రత్యేక పూజలతో గంగాజలం సేకరించనున్నట్లుతెలిపారు. తిరుగు ప్రయాణంలో భాగంగా ఈనెల 31న ఇంద్రవెల్లి మండల కేంద్రం లోని ఇంద్రా దేవి ఆలయానికిచేరుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. అదే రోజు కెస్లాపూర్ సమీపంలోని మర్రిచెట్టు వద్దకు చేరి బస చేయనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 1,2,3 వరకు మర్రి చెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు సంప్రదాయ పూజలు చేయనున్నారు. ఫిబ్రవరి 4న ఉదయం నాగోబా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. అదే రోజు రాత్రి పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని గోదావరి నది నుంచి తీసుకు వచ్చిన గంగాజలంతో నాగోబా ఆలాయన్ని అభిషేకం చేసి మహా పూజ నిర్వహించి నాగోబా జాతరను ప్రారంభించనున్నట్లు మెస్రం వంశం పెద్దలు తెలిపారు.

పాలమూరులో రెయిన్ ఫారెస్ట్

- తెలంగాణలో మొట్టమొదటి కృత్రిమ వర్షపు పార్క్
- ఆకట్టుకుంటున్న కృత్రిమ జలపాతం అందాలు



మహబూబ్‌నగర్ రూరల్, ప్రభన్యూస్ : తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారి రెయిన్‌ఫారెస్టు వాటర్‌ఫాల్స్‌ను పట్టణంలోని మయూరి పార్కులో ప్రారంభించి నట్లు జిల్లా కలెక్టర్ డి.రోనాల్డ్‌రోస్ తెలిపారు. బుధవారం స్థానిక మయూరి పార్కులో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ కేరళ మరియు ఈశాన్య రాష్ట్రా లలోని సతత హరితారణ్యాలలోని వాతావరణాన్ని, అక్కడి వృక్షజాతులను అధ్యయం చేసి మహబూబ్‌నగర్‌లోని మయూరి పార్కు లోని ఎనిమిదిన్నర ఎకరాల స్థలంలో సతత హరితారణ్యానికి ఏర్పాటు చేసేందుకు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ వారికి అప్పగించడం జరిగిందని, వారు ఎని మిదన్నర ఎకరాలలో 8 రెయిన్ గన్స్‌ను ఏర్పాటుచేసపి కృత్రిమ వర్ష వాతా వరణం కల్పించారని, రెయిన్ ఫారెస్టులో సహత వర్షపాతానికి అవకాశం కల్పించే వివిధ వృక్ష జాతులను నాటించి వర్షాలు పడటానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించడానికి కృషిచేస్తున్నామన్నారు. అందుకోసం సంవత్సరం పొడవునా పచ్చగా ఉండే పొడవైన జాతా మొక్కలను ఈ ప్రాంతంలో పెంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సతత హరితా రణ్యంలో వేసవిలో కూడా వర్షం అనుభూతి పొందవచ్చని, మయూరి పార్కులో ఈ రెయిన్ ఫారెస్టులో గంటపాటు విహరిస్తూ ఈ అనుభూతిని ఆస్వాదించేందుకు, పర్యాటకుల కొరకు రోజు మధ్యాహ్నం 1 గంటల నుంచి 2 గంటల వరకు, 2 గంటల నుంచి 3 గంటల వరకు, మరియు 3 గంటల నుండి 4 గంటల వరకు మూడు టైం స్లాట్లు ఏర్పాటుచేయడం జరిగిం దన్నారు. ఈ సతత హరితా రణ్యంలోని వాతావరణం బయటి వాతావరణం కంటే 4-5 డిగ్రీలు తక్కువగా ఉండి ఆహ్లాదకరమైన అనుభూతి నిస్తుందన్నారు. ఈ అరణ్యం రాబోయే రెండు మూడు సంవత్సరాలలో దట్టమైన అడవిగా మారి ఇంకా అందంగా తయారవుతుందని, ఇందులో ఏర్పాటుచేసిన జలపాతం వద్ద వేసవిలో కూడా ఎంతో ఆహ్లాదాన్ని పొందవచ్చన్నారు. మయూరి పార్కులో 50 మంది పర్యాటకులు బసచేసే విధంగా క్యాంపైన్ సైట్‌ను కూడా ఏర్పాటుచేయడం జరిగిందని, దీనిని ఒక ప్యాకేజీగా ఏర్పాటుచేశామని, అడ్వాన్సుగా బుకింగ్ చేసుకునే సదుపాయం కూడా కల్పించామన్నారు. ఈ సతత హరితారుణ్యంలో ఐదు వాటర్ పాండ్లు ఏర్పాటుచేశామని, ఉపరితల జలాలతో రీసైక్లింగ్ పద్ధతిలో జలపాతాన్ని ఏర్పాటుచేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకట్‌రావు, డీపీఆర్‌వో ఎస్.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.







కుంభమేళాలో మందిర నినాదం

- 33 వేల దీపాలతో సాధువుల ప్రదర్శన
- మేళా ముగిసిన వెంటనే రామ మందిర నిర్మాణం
- రాజకీయ రంగు పులుముకున్న ఆధ్యాత్మిక కేంద్రం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : 'ఎన్నికల వేళ కాదేదీ రాజకీయాలకు అనర్హం' అన్న రీతిలో కుంభమేళా కూడా రాజకీయాలకు వేదికగా మారింది. రాజకీయ వివాదంగా మారిన రామ జన్మభూమిపై సాధువులు, స్వామీజీలు, పీఠాధిపతులు తమ గళం గట్టిగా వినిపిస్తున్నారు. శతాబ్దాల తరబడి న్యాయస్థానంలోనే మూలుగుతున్న రామ జన్మభూమి భూవివాదంపై విచారణ మరింత జాప్యమవుతున్న నేపథ్యంలో.. కుంభమేళా ముగిసిన వెంటనే మందిర నిర్మాణం మొదలవుతుందని ప్రకటించారు. అంతేకాదు, మందిర నిర్మాణం కోసం కుంభమేళాలో ప్రతిరోజూ 33,000 దీపాలను వెలిగిస్తున్నారు. నెల రోజుల్లో మొత్తం 11 లక్షల దీపాలు వెలిగించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని సాధువులు చెబుతున్నారు. మకర సంక్రాంతి నుంచి మహా శివరాత్రి వరకు జరిగే ఈ కుంభమేళా వేదికగా రామమందిర నినాదాన్ని దిక్కులు పిక్కటిల్లేలా మార్మోగిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నారు. దేశవ్యాప్తంగా అన్ని పీఠాల అధిపతులు, మఠాధిపతులు, స్వామీజీలు, సాధు సంతులు ఒక్కచోట చేరే ఈ వేదికను దేశంలోని హిందువుల ఆకాంక్ష నెరవేర్చేందుకు ఉపయోగిస్తామని చెబుతున్నారు. వీరంతా రాజకీయాలకు అతీతంగా తమ ఆకాంక్ష గురించి మాట్లాడుతున్నప్పటికీ, అంతిమంగా దీని వల్ల రాజకీయ లబ్ధి పొందేందుకు అన్ని పార్టీలూ ప్రయత్నిస్తున్నాయి. ఎన్నికల ఏడాది ఈ వివాదానికి మరింత ఆజ్యం పోస్తూ హిందువుల భావోద్వేగాలు రెచ్చగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. నిజంగా వివాదాన్ని పరిష్కరించే విషయంపై చిత్తశుద్ధి ఉంటే అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో వారు చేసిందేంటని ప్రశ్నిస్తున్నాయి.

బీజేపీలో చాలా మంది నేతలు మాత్రం ఎన్నికల లోపే రామ మందిర నిర్మాణ పనులు మొదలుపెడతామని ప్రకటనలు చేస్తున్నారు. అయితే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాత్రం ఈ వివాదంపై కోర్టు తీర్పు వెలువడ్డ తర్వాతనే నిర్ణయం తీసుకుంటామని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఏదెలా ఉన్నా, ఎన్నికల వేళ రామ జన్మభూమి భూ వివాదం తెరపైకి రాగా, రాజకీయ పార్టీలు ఈ అంశం నుంచి వీలైనంత లబ్ధిపొందే ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

రూ. 4,200 కోట్లతోభారీ ఏర్పాట్లు

కోట్లాది మంది భక్తులు కుంభమేళాకు హాజరవుతున్న నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని స్థాయిలో నిధులు వెచ్చించి మెరుగైన సదుపాయాలు కల్పిస్తోంది. దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు ఏమాత్రం ఇబ్బందులు ఎదుర్కొన్నా, రానున్న ఎన్నికలపై దాని ప్రభావం ఉంటుందని భారతీయ జనతా పార్టీ అగ్ర నాయకత్వం భావిస్తోంది. హిందూ ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో బీజేపీ ప్రభుత్వమే సరిగా నిర్వహించలేదంటే, తాము ఇంకెవరికి ఓటేయాలని ఓటర్లు సైతం ప్రశ్నించే అవకాశం లేకపోలేదు. అందుకే, రూ. 4,200 కోట్ల భారీ బడ్జెట్ కేటాయించి మరీ ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో అన్ని రకాల ఏర్పాట్లను చేసింది. ముఖ్యంగా భద్రత, పారిశుధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు కనిపిస్తోంది. రద్దీ ప్రాంతాలను ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకునే ప్రమాదమున్నందున, అడుగడుగునూ సీసీ టీవీ కెమేరాలను ఏర్పాటు చేయడంతో పాటు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. యాత్రికులకు పుణ్యస్నానాలు ఆచరించే ప్రాంతంలో నీరు బురదమయం కాకుండా ఇసుకనింపిన బస్తాలను ఒడ్డు మొత్తం పరచడంతో, నదీ తీర ప్రాంతమంతా సిమెంట్ ఘాట్‌లను తలపిస్తున్నాయి. పైగా నదీ జలాలు ఎగువ ప్రాంతాల్లో కలుషితం కాకుండా తీరప్రాంత భారీ పరిశ్రమలను యూపీ సర్కారు ముందుగానే సీజ్ చేయించింది. గంగా, యమునా నదులను తీవ్రంగా కలుషితం చేస్తున్న తోలు పరిశ్రమలపైనా నిషేధం విధించింది. దీంతో కుంభమేళాలో నదీజలాలు స్వచ్ఛంగా మారాయి.





మరోవైపు పడవ మునక ప్రమాదాలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. లైఫ్ జాకెట్ లేకపోతే ఏ ఒక్క ప్రయాణికుణ్ణీ బోటు ఎక్కించకుండా ఆంక్షలు విధించి, వాటిని కఠినంగా అమలు చేస్తున్నారు. పుణ్య స్నానాలు చేసిన మహిళలు బట్టలు మార్చు కోడానికి ఇబ్బంది పడకుండా ఎక్కడికక్కడ టెంట్ గదులు ఏర్పాటు చేశారు. అలాగే అడుగడుగునా తాత్కాలిక మూత్రశాలలు, మరుగుదొడ్లు భారీ సంఖ్యలో ఏర్పాటు చేశారు. అంతేకాదు, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు పారిశుద్ధ్య కార్మికులను కూడా వేల సంఖ్యలో నియమించారు. 2013లో జరిగిన మహా కుంభమేళా సమయంలో ఏర్పాట్లను, ఇప్పుడు చేసిన ఏర్పాట్లను భక్తులు సరిపోల్చి చూసుకుంటూ యోగీ సర్కారుకు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. తద్వారా మౌత్ పబ్లిసిటీతో మంచి పేరు తెచ్చుకుని సార్వత్రిక ఎన్నికల సమయానికి వాటిని ఓట్లుగా మార్చుకోవాలని అధికార పార్టీ బీజేపీ గట్టిగానే కృషి చేస్తోంది.

అయితే మేళా కోసం కృత్రిమంగా నిర్మించిన నగరంలో ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా, ప్రయాగ్‌రాజ్ నగరానికి వచ్చే భక్తులను టూర్ ఆపరేటర్లు, హోటళ్ల యాజమాన్యాలు దోచుకుంటున్నారు. హోటల్ గదుల ధరలను ఐదింతలు చేసి అందినకాడికి దోచుకుంటుంటే, టూర్ ఆపరేటర్లు కూడా మూడు రెట్ల ధరలు వసూలు చేస్తున్నారని యాత్రికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ధరల దోపిడీని ప్రభుత్వం నియంత్రించాలని మొరపెట్టుకుంటున్నారు. మరోవైపు రద్దీ ప్రాంతాల్లో జేబుదొంగలు తమ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తున్నారు. భక్తుల సెల్‌ఫోన్లు, నగలు చోరీ చేస్తున్నారు. ఈ విషయంలోనూ భక్తుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. అయితే అడపా, దడపా సమస్యల సంగతెలా ఉన్నా.. మొత్తమ్మీద యోగీ సర్కారు కుంభమేళా ఏర్పాట్ల విషయంలో మంచి మార్కులే కొట్టేస్తోంది.



కొండపై మళ్లీ ఉద్రిక్తత

- అయ్యప్ప దర్శనం కోసం ఇద్దరు మహిళల ప్రయత్నం
- పురుష వేషధారణలో వచ్చిన రేష్మా, షాలినీ
- అడ్డుకున్న భక్తులు... కొండపై హై అలర్ట్
- భక్తుల తీరుపై దేవాదాయశాఖ మంత్రి అసహనం

తిరువనంతపురం: శబరి గిరుల్లో మళ్లీ హై అలర్ట్ నెలకొంది. మకరజ్యోతి దర్శనమిచ్చిన మరుసటి రోజే పురుష దుస్తుల్లో ఇద్దరు మహిళలు స్వామి దర్శనానికి రావడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. కన్నూరు జిల్లాకు చెందిన రేష్మా నిశాంత్, షాలినీ పంబ బేస్ క్యాంప్ మీదుగా బుధవారం తెల్లవారు జామున 5 గంటల సమయంలో కొండపైకి వెళ్లేందుకు ప్రయత్నించారు. నీలిమాల వద్ద మహిళలను గుర్తించిన అయ్యప్ప భక్తులు ఆగ్రహంతో ఊగిపోయారు. ఆందోళనకు దిగారు. కొండపైకి వెళ్లొద్దంటూ నినాదాలు చేస్తూ.. ముట్టడించడంతో చేసేది లేక పోలీసులు వారిని పంబ మీదుగా ఇరుమేలికి తరలించారు. రేష్మా, నిశాంత్ కొండపైకి వెళ్లే సమయంలో వారితో పాటు కొంతమంది పురుషులు కూడా ఉన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణం గా అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు ప్రయత్నించామని.. ముందుగా పోలీసుల భద్రతను కూడా కోరామని రేష్మా నిశాంత్ పేర్కొన్నారు. అయ్యప్పను దర్శించుకునేంత వరకు శబరిమల పరిసర ప్రాంతాలను వదిలి వెళ్లేది లేదంటూ ఇద్దరు మహిళలు భీష్మించడంతో.. వారిద్దరిని పోలీసులు కాసేపు తమ కస్టడీలోకి తీసుకున్నారు.

ఇది అనాగరికం

మహిళలు శబరిమల అయ్యప్పను దర్శించుకోకుండా అడ్డకోవడం అనాగరికమని కేరళ దేవాదాయ శాఖ మంత్రి కడకంపల్లి సురేంద్రన్ పేర్కొన్నారు. శబరిమల అయ్యప్ప మాలను దరించి వచ్చే మహిళా భక్తులను స్వామివారి దర్శనం చేసుకోవచ్చని అన్నారు. మహిళల పట్ల వివక్ష చూపడం మంచిదికాదని సురేంద్రన్ చెప్పుకొచ్చారు. మహిళా భక్తులను అడ్డుకోవడాన్ని ఆయన గూండాయిజంగా అభివర్ణించారు.

20న ఆలయం మూసివేత

గతేడాది నవంబర్ 17న మండలం-మకరవిలక్కు కోసం శబరిమల ఆలయం తెరవగా నాటి నుంచి మహిళా భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రయత్నించడం.. భక్తులు వారిని అడ్డుకుంటుండటంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. అయ్యప్ప ఆలయం ఈనెల 20 వరకు తెరచి ఉంచుతారు. సాంప్రదాయం ప్రకారం శబరిమలలో 10 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్య గల స్త్రీలకు స్వామివారి దర్శనం నిషిద్ధం. 10 -50 మధ్య వయస్సు గల మహిళలు అయ్యప్పను దర్శించుకోవచ్చని గతేడాది సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో స్వామి వారి దర్శనానికి మహిళా హక్కుల కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు వెళ్తున్నారు. చాలా రోజులుగా వారిని అయ్యప్ప భక్తులు అడ్డుకుంటున్నప్పటికీ ప్రయత్నాలు మానుకోలేదు. రుతుక్రమ వయస్సు గల మహిళలకు అయ్యప్ప దర్శనం కల్పించవద్దన్న సంప్రదాయాన్ని 50 ఏళ్ల వయస్సులోపు మహిళలు బ్రేక్ చేశారు. కదుర్గ (44), బిందు(42) అనే ఇద్దరు మహిళలు ఈనెల 2వ తేదీన తెల్లవారు జామున 3.38 గంటలకు స్వామి వారిని దర్శించుకున్నారు.

కనకదుర్గపై దాడి

ఈనెల 2వ తేదీన శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్న కనకదుర్గ మంగళవారం ఇంటికి చేరుకోగానే ఆమె కుటుంబీకులు మూకుమ్మడి దాడి చేశారు. అయ్యప్ప స్వామి ఆలయ సంప్రాదాయాన్ని కాలరాస్తావా అంటూ కనకదుర్గపై ఆమె అత్త కర్రలతో దాడి చేసింది.

తలపై తీవ్ర గాయం కావడంతో కనకదుర్గను సన్నిహితులు మలాప్పురం ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కనకదుర్గ ఫిర్యాదు మేరకు ఆమె అత్తపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నేను రెండు వారాల తర్వాత ఇంటికి వచ్చా.. అదే సమయంలో వంటిట్లో ఉన్న మా అత్తగారు నా అలికిడి విని .ఎవరు..అనగానే..నేను అంటూ సమాధానమిచ్చా.. నా మాట వింటూనే ఆమె కర్రతో నా తలపై బాదారు. అని కనకదుర్గ పోలీసు ఫిర్యాదులో పేర్కొన్నారు.



సంక్రాంతి జంతు క్రీడలు

చెన్నై: దక్షిణాది రాష్ట్రాల్లో మకర సంక్రాంతి వేడుకలు వినూత్నంగా జరిగాయి. తెలుగు రాష్ట్రాల్లో కోడి పందేలు.. కోట్లలో సాగితే.. తమిళనాడులో కనుమ సందర్భంగా జల్లికట్టు, కర్నాటకలో ఆవులతో మంటలు దాటడం వంటి పోటీలు నిర్వహించారు. ఎద్దులతో ఆడే జల్లికట్టు ఆట అత్యంత ప్రమాదకమని తెలిసినా.. ప్రతి ఏడాది ఔత్సాహికుల పోటీ పెరుగుతూనే ఉంది. తమిళనాడులోని మధురై జిల్లా అవనియపురంలో నిర్వహించిన జల్లికట్టు క్రీడలో 900 ఎద్దులు రంకెలు వేస్తూ.. మైదానంలో దూసుకెళ్తుండగా వాటిని అదుపు చేసేందుకు 800 మంది మైదానంలో పోటీ పడ్డారు. పరుగెడుతూ వస్తున్న ఎద్దులను అదుపుచేసేందుకు యువకులు తీవ్రంగా శ్రమించారు. ఈ క్రమంలో క్రీడను చూసేం దుకు వచ్చిన జనంపైకి ఎద్దులు దూసుకెళ్లాయి. దీంతో 48 మంది గాయపడ్డారు.వీరిలో 8 మందికి తీవ్రంగా గాయాలయ్యాయి.


8 రౌండ్లలో క్రీడ

జల్లికట్టును మధురై జిల్లా కలెక్టర్ నటరాజన్ ప్రారంభించగా... మొత్తం 8 రౌండ్లలో ఆట సాగింది. ఒక్కోరౌండ్‌లో 50 కి పైగా మైదానంలో దూసుకొచ్చే ఎద్దులతో 75 నుంచి 100 మంది పోటీ పడ్డారు. వాటిని అదుపు చేసేందుకు మూపురం పట్టుకుని కలెబడ్డారు. ఒక్కో రౌండ్‌లో విజయవంతంగా ఎద్దులను అదుపుచేసిన వారు మరో రౌండ్‌లో ప్రవేశిస్తూ పోటీ పడ్డారు. చూస్తేనే ఒళ్లు గగుర్లు పొడిచే ఈ క్రీడపై 2015లో సుప్రీంకోర్టు నిషేధం విధించగా..స్థానికులు చెన్నైలోని మెరినా బీచ్‌లో ఆందోళనలకు దిగారు. దీంతో కేంద్ర ప్రభుత్వం కొన్ని సవరణలతో 2016లో నిషేధం ఎత్తివేసింది.

మంటల్లోకి ఆవుల పరుగులు



దేశవ్యాప్తంగా గో రక్షణ నినాదం మారుమోగుతున్న తురణంలో కర్నాటకలో మాత్రం గోవులను క్రీడలో పేరుతో హింసిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఆవులను అందంగా అలంకరించి మంటల నుంచి దాటిస్తారు. ఆవులతో పాటు వాటి యజమానులు మంటలు దాడటం గమనార్హం.పంటలు పండించేందుకు ఎంతో ఉపయో గపడే గోవులు ధైర్యంగా ఉండాలని సంకల్పంతో ఈ క్రీడను నిర్వహిస్తారని కన్నడిగులు చెబుతున్నారు. అయితే బుధవారం నిర్వహించిన ఈ క్రీడలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ప్రాణాలను పణంగా పెట్టి ఆడే ఆట అని తెలిసినా.. తమ పూర్వికుల సంప్రదాయాలను కొనసాగించడమే తమ లక్ష్యమని చెబుతున్నారు.



మా ఊరు - మా రాజ్యం

ఏకగ్రీవం కోసం పకడ్బందీ వ్యూహం

- ఎమ్మెల్యేలకు ప్రతిష్ఠాత్మకం ఈ ఎన్నికలు
- అడవుల జిల్లాలో రెండు విడతల్లో 212 పంచాయతీలు ఏకగ్రీవం
- మూడో దశ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం



ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో: పంచాయతీ ఎన్నికలతో గ్రామాల్లో రాజకీయం వేడెక్కింది. మైదాన ప్రాంతాల్లో పంచాయతీ ఎన్నికల పోరు నువ్వా? నేనా? అన్నట్టుండగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ గూడాల్లో, లంబాడీ తండాల్లో ఏకగ్రీవం మాట వినిపిస్తోంది. గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎమ్మెల్యేలు ఏకగ్రీవం పైనే దృష్టి పెట్టారు. ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగేవిధంగా తీవ్రంగా శ్రమిస్తున్నారు. గ్రామాల్లో పట్టు స డలకుండా పకడ్బందీ వ్యూహంతో పావులు కదుపుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు విడుతల్లో 1503 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అయితే మొదటి, రెండవ విడతల్లో ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో 212 ఏకగ్రీవమయ్యాయి. రెండోవిడత నామినేషన్లు ఉపసంహరణ ఈనెల 17తో ముగుస్తున్నందున మరికొన్ని పంచాయతీలు ఏకగ్రీవమయ్యే అవకాశాలున్నాయి. మూడో విడుత ఎన్నికలకు నామినేషన్లపర్వం బుధవారం ప్రారంభమైంది. మూడో విడుతలోను ఏకగ్రీవంపైనే ప్రధాన దృష్టి సారిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన టీఆర్ఎస్ పార్టీ పంచాయతీ ఎన్నికల్లో గులాబి జెండా ఎగు రవేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలిస్తున్నాయి. తక్కువ జనాభా కలిగిన గ్రామపంచాయతీలను ఏకగ్రీవం చేయించుకోవడం లో ఎమ్మెల్యేలు సఫలీకృతులవుతున్నారు. ఇప్పటివరకు ఏకగ్రీవంగా జరిగిన 212 గ్రామపంచాయతీలు తక్కువ జనాభా ఉన్నవే. గూడాలు, తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో ఈ గ్రామపంచాయతీల్లో ఏకగ్రీవానికే ప్రాధాన్యతనిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలు ఏకగ్రీవమైతే ప్రభుత్వం నుంచి రూ. పదిలక్షలు, ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. పదిలక్షలు మొత్తంగా రూ. 20 లక్షలు ప్రోత్సాహకంగా వస్తే గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చనే అభిప్రాయంతోనే గ్రామాల ప్రజలు ఏకగ్రీవం వైపు మొగ్గు చూపుతున్నారు. నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలు గ్రామ పంచాయతీ ఎన్నికలపైనే దృష్టి సారించారు. జిల్లావ్యాప్తంగా రెండు విడుతల్లో ఏకగ్రీవమైన 212 గ్రామపంచాయతీల్లో ఆదిలా బాద్ జిల్లాలో 87, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 24, మంచిర్యాల జిల్లాలో 14, నిర్మల్ జిల్లాలో 87 గ్రామపం చాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మూడో విడుతలోను ఎక్కువ పంచాయతీలను ఏకగ్రీవం చేసేవిధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.



అన్నదమ్ముల సవాల్

దంతాలపల్లి, ప్రభన్యూస్: అన్నాతమ్ముడు పంచాయితీ ఎన్నికల బరిలో నిలిచిన ఘటన ఇది. అన్నాతమ్ముడు ఒకరిపై మరొకరు వార్డు సభ్యులుగా పంచాయితీ ఎన్నికల్లో నిలిచారు. ఉమ్మడి వరంగల్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రం లో 7వ వార్డులో ఈ అరుదైన పోటీ జరుగుతుంది. గ్రామానికి చెందిన అంకం సోమేశ్వర్‌పై తన స్వంత తమ్ముడు అంకం సతీష్ వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్నాడు. సోమేశ్వర్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉండగా తమ్ముడు సతీష్ టీఆర్ఎస్ అభ్యర్థి తరుపున బరిలో ఉన్నారు. దీంతో వీరిద్దరి మధ్య పోటీపై ఆసక్తి నెలకొంది. వార్డులో మొత్తం 292 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 146 ఓట్లు పొందిన వారే వార్డు సభ్యులుగా ఎన్నికవుతారు. మరో చోట వదిన-మరదలు మధ్య పోటీ పడుతున్నారు. బొడ్లాడ గ్రామంలో రెండో వార్డులో లింగమల్ల రమ, ఆమె అన్న ఇట్టిమల్ల ప్రసాద్ భార్య ఇట్టిమల్ల స్వప్న వార్డు సభ్యురాలిగా బరిలో నిలిచారు. ఈ బంధాల మధ్య ఎవరు గెలుస్తారో వేచి చూడాల్సిందే.



మూడో విడత పంచాయతీ ఫైట్ షురూ

- నోటిఫికేషన్ జారీ
- రెండో విడత నామినేషన్ల ఉపసంహరణ నేటితో సరి
- తొలి దశ పంచాయతీల్లో జోరుగా ప్రచారాలు



మూడోవిడత ఇలా

4115	- ఎన్నికలు జరిగే పంచాయతీలు
36,718	- ఎన్నికలు జరిగే వార్డులు
18వతేదీ సాయంత్రం 5 గం.	- నామినేషన్ల గడువు
19న	- స్క్రూటినీ
22న	- నామినేషన్ల ఉపసంహరణ
30	- పోలింగ్.. ఫలితాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గ్రామీణ తెలంగాణం అంతటా ఎన్నికల సందడి కనిపిస్తోంది. మూడు విడతలుగా జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చివరిదశ పంచాయతీలకు కూడా బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో రాష్ట్రంలోని 12,732 గ్రామ పంచాయతీల్లో సింగిల్ నామినేషన్లు దాఖలై ఏకగ్రీవంగా ఎన్నికలు ముగిసిన 769 గ్రామ పంచాయతీలను మినహాయిస్తే ఇక మిగిలిన అన్ని గ్రామ పంచాయతీల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. బుధవారం చివరి దశ కింద 4,115 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులతోపాటు వాటి పరిధిలోని 36,718 వార్డు స్థానాలకు నోటిఫికేషన్ ప్రకటించటంతో ఈ పంచాయతీల్లో కూడా నామినేషన్ల ఘట్టం ప్రరంభమైంది. తొలిరోజు నామినే షన్ల పర్వం మందకొడిగా సాగింది. ఈ పంచాయతీల్లో శుక్రవారం సాయంత్రం 5 గంటలవరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 19న నామినేషన్ల స్క్రూటినీ నిర్వహించనున్నారు. 22న నామినేషన్ల ఉపసంహరణకు గడువు కేటాయించారు. అదేరోజు సాయత్రం ఈ పంచాయతీల్లో అభ్యర్థుల తుది జాబితాతోపాటు ఎన్నికల గుర్తులు కూడా కేటాయించనున్నారు. ఈ నెల 30న వీటికి పోలింగ్ జరగనుంది.

రెండో విడత జీపీల్లో నేడు నామినేషన్ల విత్‌డ్రా

రాష్ట్రంలో రెండో విడత కింద ఎన్నికలు జరుగుతున్న గ్రామ పంచాయతీల్లో గురువారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు కేటాయించారు. రెండో విడుతలో 4,135 గ్రామ పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వగా ఈ నెల 11నుంచి వీటిలో నామినేషన్లఘట్టం ప్రారంభమైంది. కాగా 13వ తేదీతో నామినేషన్ల దాఖలు గడువు ముగిసిపోగా అదిలాబాద్‌లో ఒక పంచాయతీ, కొమరంబీం ఆసిఫాబాద్ జిల్లాలో రెండు పంచాయతీల సర్పంచ్ పదవులకు నామినేషన్లు దాఖలు కాలేదు. ఈ మూడు పంచాయతీల్లో 33వార్డు స్థానాలతోపాటు మరికొన్ని జిల్లాల్లో కూడా వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు.

మొత్తం75 వార్డు స్థానాలకు నామినేషన్లు రాలేదని ఎన్నికల అధికారులు వెల్లడించారు. మిగిలిన పంచాయతీల్లో స్క్రూటినీ అనంతరం సర్పంచ్ స్థానాలకు 20,575 నామినేషన్లు, వార్డు స్థానాలకు 86,855 నామినేషన్లు చెల్లుబాటు అయినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం సాయంత్రం 3గంటలకు నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన వెంటనే అభ్యర్థుల తుది జాబితాలతోపాటు ఎన్నికల గుర్తులు కూడా కేటాయించనున్నారు. ఈ నెల 25న ఈ పంచాయతీలకు పోలింగ్ జరగనుంది.

ప్రచార హోరులో పంచాయతీలు

తొలిదశ ఎన్నికలు జరగనున్న గ్రామ పంచాయతీలు ప్రచార హోరులో మునిగిపోయాయి. తొలిదశ కింద 3,707గ్రామ పంచాయతీల్లో ఈనెల 21న పోలింగ్ జరగనుంది. సర్పంచ్ స్థానాలకు మొత్తం 1,220మంది అభ్యర్థులు పోటీలు పడుతున్నారు. అదే విధంగా ఎన్నికలు జరుగుతున్న 28976 వార్డు స్థానాలకు 70094 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోలింగ్ తేదీకి మరో ఐదు రోజులే గడువుంది. దీంతో అభ్యర్థులు గ్రామాల్లో ఎన్నికల ప్ర చారాలను ముమ్మరం చేశారు. కుటుంబ సభ్యులకు సైతం ఎన్నికల ప్రచార బాధ్యతలు అప్పగించి ఇంటింటికి తిప్పుతూ తిప్పుతున్నారు.

రూ.121 కోట్లు సీజ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం అధికారులు వివిధ ప్రాం తాల్లో జరిపిన తనిఖీల్లో రూ.1,21,23,820 నగదు పట్టుబడింది.అంతే కాకుండా ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ఉపయోగిస్తున్న రూ. 80,3767 విలువైన పరికరాలు కూడా పట్టుబడ్డాయి. నగదు పట్టుబడిన వాటిలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో రూ.85 వేలు, ఖమ్మం జిల్లాలో రూ.1,17,88,820, సైబరాబాద్ పరిధిలో రూ.2.50లక్షలు పట్టుబడింది. అంతే కాకుండా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద 48 కేసులు నమోదయ్యాయి.

గాంధీ చెప్పినట్లు జరిగి ఉంటే..?



పంచాయతీ కథలు 13

పంచాయతీల ద్వారా దేశ ప్రజస్వామ్యం బలపడుతుం దని గాంధీజీ భావించారు. రాజకీయ, సాంఘిక, పారిశ్రా మిక ప్రాధాన్యతలన్నీ గ్రామాలకే ఇవ్వాలని వాదించారు. గ్రామాలను సముద్రంలో వలయాలుగా గాంధీజీ అభివర్ణించారు. పిరమిడ్ ఆకారంలో అధికారం పైన కేంద్రీకృతమైతే అడుగున గ్రామాలు ఉండడాన్ని గాంధీజీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆదర్శ గ్రామమంటే ప్రజలు శాంతి, సామరస్యాలతో జీవించడమేనని నిర్వచించారు. గాంధీ గ్రామ స్వరాజ్యం భావన ను ఆనాటి ఆయన సహ చరులు ఇష్టపడి నా దాన్ని ఆచరణలో పెట్టడానికి అంత ప్రాధాన్యత ఇవ్వలేదు. మహాత్మా గాంధీ ప్రధాన అనుచ రుల్లో ముఖ్య మైన కాంగ్రెస్ నేతగా జవహర్‌లాల్ నెహ్రూ దృష్టిలో స్వాతంత్ర్యం అంటే బ్రిటీ ష్ వారి నుంచి స్వేచ్ఛ అనే భావించారంటారు. పాశ్చాత్య కేంద్రీకృత అధికారం పట్ల నెహ్రూకి మక్కు వ ఎక్కువనే విమర్శలున్నాయి. ప్రణాళికలు, ఆధునిక పారి శ్రామి భారతదేశ నిర్మాణం కోసం భారీ పరిశ్రమలు ప్రాధా న్యత ఇవ్వడానికి దేశ తొలి ప్రధాని మొగ్గు చూపారు. ముఖ్యమైన ప్రభుత్వ అధికారాలను గ్రామస్థాయిలో వికేంద్రీకరించాలన్న ఆలోచన నెహ్రూలో ఉండేది కాదం టారు. గాంధీ సామాజిక న్యాయంతో నెహ్రూ సూత్ర ప్రాయంగా అంగీకరించినా, గ్రామ స్వరాజ్యానికి ఆయన అభివృద్ధి అజెండాల్లో స్థానం సంపా దించుకోకపోవడం విషాదంగా చెబుతా రు. దీంతో భారతదేశంలో గ్రామాలకు, గ్రామ స్వపరిపాలకు ప్రాధాన్యత లేక పోగా, సోషలిస్టు, సంక్షేమ రాజ్యంగా మాత్రం ఛలామణి అయిందనే విమ ర్శలున్నాయి. ఇది గాంధీ సూత్రాలకు పూర్తిగా విరుద్ధమంటారు. మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్యం భావనలోని విప్లవాత్మక లక్షణాన్ని స్వతంత్ర్య భారత దేశం విస్మరించ డంతో పాటు తొలి నాళ్లలోనే గ్రామాభి వృద్ధిని పట్టించు కోవడం మానేయడం మొదలైంది. భారత దేశస్వాంత్ర్యం అట్టడుగు నుంచి మొదలు కావాలని మహాత్మా గాంధీ 1946లోనే స్పష్టం చేశారు. ఎన్నికైన గ్రామ పంచాయతీలతో గ్రామాలు సొంత రాజ్యాలుగా ఎదగాలని ఆయన అభిలాషించారు. అయి తే 1990 నాళ్లకు కానీ మూడంచెల పంచాయతీ వ్యవస్థ దేశంలో సాకారం కాలేదు. దీంతో క్షేత్రస్థాయిలో పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం కీలక పాత్ర పోషించడం మొదలైంది.

చట్టం సరే.. అమలులో స్ఫూర్తి ఏదీ?

అయితే పంచాయతీ రాజ్ చట్టం వచ్చినప్పటికీ అమల్లో అనేక సమస్యలు అంతే ఉండిపోయాయి. క్రమం తప్పకుండా పంచాయతీ ఎన్నికలు జరపడం ద్వారా అధికార వికేంద్రీకరణ సాధ్యమవుతున్నా. నిర్వహణ, నిధుల కేటాయింపు విషయంలో అనేక పరిమితు లు మిగిలే ఉన్నాయి. స్థానిక పాలన, నిధుల వ్యయంపై రాష్ట్ర ప్రభుత్వాలు తమ నియంత్రణను వదులుకోకపోవడానికి సిద్ధంగా లేకపోవడంతో గ్రామ స్వపరిపాలన పూర్తి స్థాయిలో సాకారం కావడానికి అవరోధంగా మిగిలిపోయింది. సొంత ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకోవడానికి పం చాయతీలకు అవసరమైన అధికారాల ను బదలాయిం చడం లేదు. దీంతో పంచాతీయలకు పరిమిత స్థాయిలో నిర్వహణా ప్రతిపత్తి దాఖలవుతోంది. పంచాయతీలకు ఆర్థిక వనరుల విషయంలో రాష్ట్ర ప్రణాళి కా సంఘాలు చేస్తున్న సిఫార్సులు తరుచూ బుట్ట దాఖలవుతున్నాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘాలకు ఉన్న అధికారాలు కూడా రాష్ట్రాలను బట్టి మారుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో ఓటర్ల జాబితాకి తుది రూపం ఇవ్వడం, రిజర్వు స్థానాలను మార్చే విషయంలో స్వేచ్ఛ, పంచాయతీల పరిధుల మార్పు వంటి వాటి విషయంలో రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక సం ఘాలకు అధికారాలు ఉండాలనే వాదన ఉంది. పంచా యతీ రాజ్ చట్టంలో పేర్కొన్న విధంగా పంచాతీయల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం, పారదర్శకత ఉండాలంటే గ్రామ సభలను బోలపేతం చేయడంతో పాటు సాధికారత కల్పించాల్సి ఉంటుంది.



థెరెస్సాకు ఎదురుదెబ్బ

- బ్రెగ్జిట్ ఒప్పందంపై బ్రిటన్ పార్లమెంటులో ఓటింగ్
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా 423 ఓట్లు..
- థెరెస్సాపై ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం



లండన్: బ్రిటన్ ప్రధాని థెరిసా మేకు పార్లమెంట్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఐరోపా సమాఖ్య (ఈయూ)తో బ్రిటన్ చేసుకున్న బ్రెగ్జిట్ ఒప్పందంపై ఆదేశ పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో థెరిస్సామే ఓటమిపాలయ్యారు. థెరిస్సాకు వ్యతిరేకంగా 423 ఓట్లు రాగా... అనుకూలంగా 202 ఓట్లు వచ్చాయి. బ్రెగ్జిట్‌కు అనుకూలముగా ఓటేయాలన్న థెరిసా మే అభ్యర్థనను సొంత పార్టీ నేతలే పట్టించుకోలేదు. యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగాలని గతంలోనే నిర్ణయించిన బ్రిటన్ ప్రభుత్వం.. ఈ అంశంపై ప్రజాభిప్రాయం కూడా సేకరించింది. బ్రిటన్ ప్రధాని థెరిసా మే కుదుర్చుకున్న ఒప్పందం బ్రిటన్‌కు నష్టం చేకూర్చేలా ఉందంటూ సొంత మంత్రివర్గంలోని వ్యక్తులే రాజీనామా చేయడంపై .. ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం వరకు వెళ్లగలిగాయి. బ్రెగ్జిట్ ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంట్ ఆమోదించి ఉంటే.. ఆ తర్వాత యూరోపియన్ యూనియన్ కూడా ఆమోదించాల్సి ఉండేది. పార్లమెంట్‌లోనే ఒప్పందంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. వ్యతిరేకత ఎదురైంది. బ్రెగ్జిట్ ఒప్పందం 2019 మార్చి 29కి ముందే పూర్తయి.. ఈయూ నుంచి బ్రిటన్ వైదొలగడం ప్రారంభం కావాల్సి ఉంది. బ్రెగ్జిట్ ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంటు ఆమోదించలేకపోవడంతో ఒప్పందమే లేకుండా ఈయూ నుంచి బ్రిటన్ బయటకు రావాల్సి రావచ్చు... లేదా కొత్త ఒప్పందం కోసం మళ్లీ చర్చలు జరగొచ్చని రాజకీయ పండితులు చెబుతున్నారు.



అసెంబ్లీ వద్ద భారీ బందోబస్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నేటి నుంచి నాలుగు రోజుల పాటు కొనసాగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో నాలుగు కిలోమీటర్ల మేర ఎలాంటి బహిరంగ సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని ఆంక్షలు విధిం చారు. ఈ ఆంక్షలు 17వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 21వ తేదీ ఉదయం 6 వరకు అమలులో ఉంటాయి. ఈ మేరకు హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా భద్రతపై పోలీసు ఉన్నతా ధికారులు బుధవారం సమీక్ష నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ చాంబర్‌లో మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశం తర్వాత అసెంబ్లీ ప్రాంగణంలోని అన్ని ఏరియాలను సీపీ అంజనీకుమార్ తిరిగి పరిశీలించారు. ఇదే సందర్భంలో సమావేశాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సీపీ అంజనీకుమార్ పలు సూచనలు చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్ర మత్తంగా ఉండాలన్నారు. మరోవైపు అసెంబ్లీ సమావేశాల నిర్వహణ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని సీపీ అంజనీకుమార్ తెలిపారు.

క్రీడాప్రభ



సెరీనా.. ఆరంభం అదిరింది

- రాణిస్తున్న జకోవిచ్, నవోమి ఒసాకా
- మూడో రౌండ్‌లో ఫెదరర్, నాదల్



మెల్‌బోర్న్ : సెరీనా వీలియమ్స్ 2019లో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకునేందుకు చక్కటి శుభారంభం అందించింది. జర్మనీకి చెందిన టాట్జానా మారియాను 6-0, 6-0 పాయింట్లతో రెండు వరుస సెట్లలో ఓడించింది. 49 నిమిషాల పాటు వన్‌సైడ్ వార్ కొనసాగింది. 8 నెలల ప్రెగ్నెన్సీకి ముందు సుమారు రెండేళ్ల క్రితం 23వ మేజర్ డాన్ టైటిల్‌ను సెరీనా కైవసం చేసుకుంది. ఇక్కడ ప్రెగ్నెంట్ ఉన్న సమయంలోనే ఆడానని, ఎన్నో మధురానుభూతులు ఉన్నాయని, కెరీర్‌కు ఎంతో అవినాభావ సంబంధం ఉందని సెరీనా అన్నారు. సెప్టెంబర్‌లో యూఎస్ ఓపెన్ ఫైనల్ పోరులో నవోమీ ఒసాకా చేతిలో ఓడిపోయిన తరువాత సెరీనా ఇదే టోర్నీలో పాల్గొంది. 16 నిమిషాల వ్యవధిలోనే మొదటిసెట్‌ను 6-0తో ముగించింది.

పురుషుల విభాగంలో జకోవిచ్ ఆసియా ఓపెన్ టోర్నీలో తొలి విజయాన్ని నమోదు చేసుకున్నాడు. 230వ ర్యాంకు అమెరికా క్రీడాకారుడు మిచెల్ క్రూగర్‌ను 6-3, 6-2, 6-2 పాయింట్ల తేడాతో వరుస సెట్‌లలో జకోవిచ్ విజయం సాధించాడు. 13 ఏళ్లుగా ఆస్ట్రేలియా ఓపెన్ రెండో రౌండ్‌లో దూసుకెళ్లిన ఘనతను జకోవిచ్ సొంతం చేసుకున్నాడు. ఇప్పటి వరకు ఆరు ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిళ్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇది అతనికి 300వ గ్రాండ్‌స్లామ్ మ్యాచ్ కావడం విశేషం. మిచెల్‌తో మొదటి సారి తలపడ్డానని, ఎలా ఆడుతాడో తనకు తెలీదని, అయినా గట్టి పోటీ ఇచ్చాడని నొవాక్ వివరించాడు. మిచెల్‌తో ఆటను ఎంజాయ్ చేశానని, అతను కూడా చేసినట్టు భావిస్తున్నా అన్నారు.

రెండో రౌండ్‌లోకి జపాన్ క్రీడాకారిణి

నాల్గో సీడ్ జపాన్ క్రీడాకారిణి నవోమి ఒసాకా రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. పోలాండ్ క్రీడాకారిణి మగ్దా లిన్నెట్టెను 6-4, 6-2 పాయింట్ల తేడాతో ఓడించింది. నా ఆటను చూడటానికి చాలా మంది వచ్చారని, ఇది ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఒసాకా చెప్పుకొచ్చింది.

డిఫెండింగ్ ఛాంపియన్ రోజర్ ఫెదరర్ విజయవంతంగా 20వ సారి మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు. బ్రిటన్‌కు చెందిన డాన్ ఇవాన్స్‌ను 7-6 (7/5), 7-6 (7/3), 6-3 పాయింట్ల తేడాతో ఓడించాడు. ఇవాన్ గట్టి పోటీ ఇచ్చాడని, విజయం కోసం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందని ఫెదరర్ చెప్పుకొచ్చాడు. నాదల్ మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు. ఆస్ట్రేలియా ఆటగాడు మాథ్యు ఎబ్డెన్‌ను మూడు వరుస సెట్లలో ఓడించాడు. 6-3, 6-2, 6-2 పాయింట్ల తేడాతో నాదల్ గెలుపొందాడు.

నిరాశపర్చిన భారత్ ఆటగాళ్లు

ఒకే రోజులో భారత్‌కు చెందిన మూడు పురుషుల డబుల్స్ జోడీలు టోర్నీ నుంచి నిష్క్రమించాయి. స్పానిష్ ఆటగాళ్లు పబ్లో క్రెరెనో బుస్టా, గుల్లెరిమో గార్సియా లోపేజ్ చేతిలో 15 సీడ్ ఆటగాళ్లు రోహన్ బోపన్న, దివ్విజ్ శరణ్ 1-6, 6-4, 5-7 పాయింట్ల తేడాతో ఓడిపోయారు. లియండర్ పేస్, ఏంజెల్ జోడితో పాటు జీవన్, నికోలస్ జోడి కెవిన్, నికోలా చేతి ఓడిపోయింది.



ఆద్యంతం ఉత్కంఠగా..!

రెండో వన్డేలో భారత్ ఘన విజయం

- మూడు వన్డేల సిరీస్ 1-1తో సమం
- శతక్కొట్టిన విరాట్ కోహ్లీ
- ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా టీమిండియా సారథి
- రేపు మెల్‌బోర్న్‌లో ఫైనల్ పోరు

అడిలైడ్ : మూడు వన్డేల సిరీస్‌కు ఎంతో కీలకంగా మారిన రెండో వన్డేలో టీమిండియా అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. అడిలైడ్ వేదికగా చివరి వరకు ఎంతో ఉత్కంఠగా సాగిన రెండో వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. సిరీస్‌ను 1-1తో సమం చేసింది. 18న మెల్‌బోర్న్ వేదికగా మూడో వన్డే జరగనుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 298 పరుగులు చేసింది. షాన్ మార్ష్ 123 బంతుల్లో 131 పరుగులతో ఆసీస్ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. మ్యాక్స్‌వెల్ కూడా 37 బంతుల్లో 48 పరుగులు చేశాడు. వీరిద్దరు 6వ వికెట్‌కు 94 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. భారత్ బౌలర్లలో భువనేశ్వర్ 4, షమీ 3 వికెట్లు తీయగా, జడేజా 1 వికెట్ పడగొట్టాడు.



55 నాటౌట్

సత్తా చాటిన ధోనీ

299 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఓపెనర్లు ధావన్, రోహిత్ శర్మ దూకుడు ప్రదర్శించారు. బెహ్రన్‌డార్ఫ్ బౌలింగ్‌లో ధావన్ (32) ఔటయ్యాడు. ఆ తరువాత విరాట్ కోహ్లీ పరుగుల వరద పారించాడు. ఆ తరువాత స్టొయినిస్ బౌలింగ్‌లో రోహిత్ శర్మ (43) వద్ద ఔటయ్యాడు. హ్యాండ్స్‌కోంబ్‌కు క్యాచ్ ఇచ్చి రోహిత్ పెవిలియన్ చేరాడు. తరువాత వచ్చిన రాయుడు (24) ఔటవ్వడంతో కోహ్లీపై ఒత్తిడి పెరిగింది. ధోనీ, విరాట్ జోడి ఆచితూచి ఆడుతూ ఇన్సింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లారు. కోహ్లీని 104 పరుగుల వద్ద రిచర్డ్సన్ ఔట్ చేశాడు. ధోనీ, విరాట్ నాల్గో వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం వచ్చిన దినేష్ కార్తీక్‌తో కలిసి ధోనీ 55 (54) పరుగులు చేసి టీమిండియాకు విజయాన్ని అందించాడు. చివరి ఓవర్లో సిక్స్ కొట్టి భారత్‌కు విజయాన్ని, తన అర్ధ శతకాన్ని పూర్తి చేశాడు. బెహ్రన్‌డార్ఫ్, రిచర్డ్సన్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్ తలో వికెట్ తీసుకున్నారు.



ధోనీ విలువ తెలుసుకోలేరు

ధోనీని ఒంటరిగా వదిలేయండి. అతని విలువ మీరు తెలుసుకోలేరు. ధోనీ ఆఖర్లో సిక్సులు బాది మ్యాచ్ విన్నర్‌గా నిలిచాడు. ఎంతటి ఒత్తిడి అయినా తట్టుకోగల సత్తా అతనికి ఉంది. అతన్ని ఒంటరిగా వదిలేయాలని అందరికీ నా ప్రార్థన. అప్పుడే అద్భుతంగా రాణిస్తాడు. అతను యువకుడు కావడం లేదు. అలాంటప్పుడు యంగ్ ప్లేయర్‌లతో పోలిక ఉండొద్దు. ఆట తీరును అధ్యయనం చేయడం, పరిస్థితులను తెలుసుకోవడంలో ధిట్ట. బౌలర్లకు కూడా ఎన్నో మెళకువలు అందిస్తాడు. బ్యాట్స్‌మెన్ ఏం ఆలోచిస్తున్నాడో అది తెలుసుకుంటాడు.



భారత్ ఆట బాగుంది

టీమిండియా బ్యాటింగ్‌కు దిగితే మాత్రం వికెట్లు ఎలా తీయాలో అనే దాని గురించే ఆలోచించాలి. ధోనీ ఆట బాగుంది. మిడిల్ ఓవర్స్‌లో మంచి ప్రదర్శన కనబర్చాం. పవర్ ప్లేస్‌కు నేనే బాధ్యున్ని. షాన్ మార్ష్ ఆట ఎంతో బాగుంది. జట్టుకు ఎంతో విలువైన 138 పరుగులను అందజేశాడు. అందుకే భారత్‌కు 298 లక్ష్యాన్ని ఇవ్వగలిగాం. ఆసీస్ బౌలర్లు ధీటుగానే బౌలింగ్ చేసినా టీమిండియా ఆటగాళ్ల అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించారు. 18న మెల్‌బోర్న్‌లో జరిగే మూడు వన్డేల ఫైనల్‌లో మేమే గెలుస్తాం. టెస్టు సిరీస్‌ను వదలుకున్నాం. వన్డే సిరీస్ ను కైవసం చేసుకుంటాం. రిచర్డ్ సన్ మంచి బౌలర్. అతన్ని ముందుగానే ఉపయోగించుకునేలా చూస్తాం. విజయానికి జట్టు సమిష్టికృషి ఎంతో అవసరం.

కలిసొస్తున్న సంక్రాంతి

టీమిండియా కెప్టెన్‌కు జనవరి 15 ఎంతో కలిసి వస్తోందనే చెప్పుకోవాలి. గత రెండు సంవత్సరాల్లో జనవరి 15వ తేదీల్లోనే విరాట్ శతకాలను నమోదు చేసుకున్నాడు. 2019లో ఇది విరాట్‌కు తొలి సెంచరీ కావడం విశేషం. 2017, జనవరి 15న పుణె వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగిన వన్డేలో 105 బంతుల్లో 122 పరుగుల చేశాడు. ఇది అతనికి 27వ శతకం. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిచింది. సెంచూరియన్ వేదికగా భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన రెండో టెస్టు మూడో రోజైన 2018 జనవరి 15న విరాట్ 153 పరుగులు చేశాడు. ఇందులో టీమిండియా ఓడిపోయింది. ఇప్పుడు 2019 జనవరి 15న ఆసీస్‌పై 104 పరుగులు చేశాడు.

104

ధోనీ ముగింపు బాగుంది

రెండో వన్డేలో ధోనీ ఆటతీరు ఎంతో బాగుంది. ఫినిషింగ్ టచ్ ఇవ్వడంలో ధోనీయే బెస్ట్. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఆట చివరి వరకు నిల్చుంటాడు. మనస్సులో ఏం ఉందో అతనికి మాత్రమే తెలిసి ఉంటుంది. సీమర్ భువనేశ్వర్ ఆటతీరు కూడా ఎంతో బాగుంటుంది. భువీ బౌలింగ్‌ను ఆపాలని అనుకున్నాం. కానీ మ్యాక్సీ, మార్ష్ ఆపాలంటే భువీతో బౌలింగ్ వేయించాలని భావించాం. అప్పుడే షాన్ మార్ష్‌ను భువనేశ్వర్ ఔట్ చేశాడు.

మెరుగైన బౌలింగ్‌ను ప్రదర్శించాడు. టెస్టులపై యువ ఆటగాళ్లు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. వన్డేలు కూడా ముఖ్యమైనవే అయినా టెస్టు నుంచి తప్పించుకోవద్దు. ఈ మానసిక సమస్య క్రికెట్‌లో అడుగుపెడుతున్నప్పటి నుంచే ఉంది.

స్కోర్ బోర్డు

ఆస్ట్రేలియా ఇన్సింగ్స్: కేరీ (సీ) ధావన్ (బి) షమీ 18; ఫించ్ (బి) భువనేశ్వర్ 6; ఖవాజా (రనౌట్) (రవీంద్ర జడేజా) 21; షాన్ మార్ష్ (సి) జడేజా (బి) భువనేశ్వర్ 131; పీటర్ హ్యాండ్స్‌కోంబ్ (స్టంప్ ధోనీ) (బి) జడేజా 20; మార్కస్ స్టోనిస్ (సి) ధోనీ (బి) షమీ 29; మ్యాక్స్‌వెల్ (సి) కార్తీక్ (బి) భువనేశ్వర్ 48; రిచర్డ్సన్ (సి) ధావన్ (బి) షమీ 2; నాథన్ లియాన్ (నాటౌట్) 12, పీటర్ సిడిల్ (సి) కోహ్లీ (బి) భువనేశ్వర్ 0; బెరెన్ డార్ఫ్ (నాటౌట్) 1. **మొత్తం:** (50 ఓవర్లలో 9 వికెట్లకు) 298. ఎక్స్‌ట్రాలు : 10. **వికెట్ల పతనం:** 1-20, 2-26, 3-82, 4-134, 5-189, 6-283, 7-283, 8-286, 9-286. **బౌలింగ్ :** భువనేశ్వర్ 10-0-45-4, షమీ 10-0-58-3, సిరాజ్ 10-0-76-0, కుల్దీప్ యాదవ్ 10-0-66-0, జడేజా 10-1-49-1.

భారత్ ఇన్సింగ్స్ : రోహిత్ శర్మ (సీ) హ్యాండ్స్ కోంబ్ (బి) స్టాయినిస్ 43; ధావన్ (సి) ఖవాజా (బి) బెరెన్ డార్ఫ్ 32; కోహ్లీ (సి) మ్యాక్స్‌వెల్ (బి) రిచర్డ్ సన్ 104; రాయుడు (సి) స్టాయినిస్ (బీ) మ్యాక్స్‌వెల్ 24; ధోనీ (నాటౌట్) 55; దినేష్ కార్తీక్ (నాటౌట్) 25. **మొత్తం :** (49.2 ఓవర్లలో 4 వికెట్లకు) 299. ఎక్స్‌ట్రాలు : 16. **వికెట్ల పతనం :** 1-47, 2-101, 3-160, 4-242. **బౌలింగ్ :** బెరెన్ డార్ఫ్ 8.2-1-52-1, రిచర్డ్ సన్ 10-0-59-1, సిడిల్ 8-0-58-0, లైయాన్ 10-0-59-0.

ఫుట్‌బాల్ కోచ్ స్టీఫెన్ రాజీనామా



షార్జా : ఆసియా ఫుట్‌బాల్ కప్ టోర్నీ గ్రూప్ స్టేజ్‌లో భారత్ 1-0 గోల్స్ తేడాతో బహ్రెయిన్ చేతిలో ఓటమి చవి చూసింది. దీంతో టోర్నీ నుంచి భారత్ వైదొలిగింది. భారత్‌పై 90వ నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్ ద్వారా బహ్రెయిన్ గోల్ సాధించింది. దీనికి బాధ్యత వహిస్తూ కంట కన్నీరు పెట్టుకుంటూ ఇండియన్ ఫుట్‌బాల్ టీం కోచ్ స్టీఫెన్ కాన్స్టాంటైన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై స్టీఫెన్ మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా భారత్ జట్టుకు సేవలు అందిస్తున్నా అన్నారు. ఎఎఫ్‌సీ ఆసియా కప్ కోసం అర్హత పొందినా గ్రూప్ స్టేజీలోనే నిష్క్రమించడం బాధగా ఉందని, అర్హత సాధించడానికి కృషి చేసిన క్రీడాకారులందరికీ నా కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంతటితో నా పని పూర్తయిందని భావిస్తున్నా అని, పదవి నుంచి తప్పుకోవడానికి ఇదే సమయమని తెలిపారు. దిగిపోవడం బాధగా ఉందని, టోర్నీలో మంచి ఆటతీరును కనబర్చారన్నారు. తన భార్య పుట్టిన రోజు నాడు ఈ నిర్ణయం తీసుకున్నానని, తనకు ముగ్గురు కుమార్తెలు అని, మూడు నాలుగు నెలలే వారిని చూశానని అన్నారు. స్టీఫెన్ హయాంలో ఎన్నో రికార్డులను భారత్ ఫుట్‌బాల్ జట్టు బద్దలు కొట్టింది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ 173 ర్యాంకు నుంచి 96వ స్థానానికి చేరుకుంది. జనవరి 31తో స్టీఫెన్ కోచ్ గడువు ముగుస్తున్నది.

మహిళల బాక్సింగ్ చీఫ్ కోచ్ ఖమర్

న్యూఢిల్లీ : కామన్‌వెల్త్ గేమ్స్‌లో తొలి సారి బాక్సింగ్ విభాగంలో స్వర్ణ పతకం తీసుకొచ్చిన మహ్మద్ అలీ ఖమర్, మహిళల బాక్సింగ్‌కు చీఫ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. శివ్ సింగ్ స్థానంలో అలీ చీఫ్ కోచ్‌గా బాధ్యతలు చేపడతారు. సుమారు ఏడాది పాటు అసిస్టెంట్ కోచ్‌గా కూడా అలీ పని చేశాడు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ.. చీఫ్ కోచ్‌గా ఎంపికవ్వడం ఒకింత ఆశ్చర్యం వేసిందన్నారు. ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు రుణపడి ఉంటానన్నారు. భారత్ బాక్సింగ్ క్రీడాకారులను మంచి స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తానని తెలిపారు. 2002 కామన్‌వెల్త్ క్రీడల్లో అలీ బంగారు పతకం సాధించాడు. కోల్‌కత్తాకు చెందిన ఖమర్, ఇటాలియన్ కోచ్ రఫ్ఫెల్ బెర్గమాస్కో, మేరికోమ్ ట్రెయినర్ ఛోటే లాల్ యాదవ్ వద్ద అసిస్టెంట్ కోచ్‌గా పని చేశాడు. అసిస్టెంట్ కోచ్‌గా పని చేసిన అనుభవం చీఫ్ కోచ్‌కు ఉపయోగపడుతాయని వివరించాడు. చీఫ్ కోచ్ అనేది ఛాలెంజింగ్ జాబ్ అని, ఇందులో ఎలాంటి సందేహం లేదని, ఏడాది కాలం వారిని అర్థం చేసుకోవడంలోనే గడిచిపోయిందని, ఇప్పుడు ఎలా పని చేయాలో అర్థం అయ్యిందని తెలిపాడు. ఫిట్‌నెస్‌పైనే ఎక్కువ దృష్టిసారించాలని, ఆటలో ఇది ఎంతో ముఖ్యమని, గతంలో పని చేసిన కోచ్‌ల సహకారం తీసుకుంటానన్నారు.



హార్దిక్ పాండ్యాకు మరో షాక్

ఖర్ జింఖానా సభ్యత్వం రద్దు

న్యూఢిల్లీ : మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసి వివాదాల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్న హార్దిక్ పాండ్యాకు మరో షాక్ తగిలింది. ముంబైలో పేరు ప్రఖ్యాతులు గాంచిన 'ఖర్ జింఖానా'లో గౌరవ సభ్యత్వాన్ని పాండ్యా కోల్పోయాడు. మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఖర్ జింఖానా సంయుక్త కార్యదర్శి గౌరవ్ కాపాడియా తెలిపారు. 10 దేశాల బీసీసీఐలు కూడా పాండ్యా, రాహుల్‌ను విచారించాల్సిందే అని పట్టుబడుతున్న విషయం తెలిసిందే. అక్టోబర్ 2018లో మూడేళ్లకు గాను పాండ్యాకు గౌరవ సభ్యత్వాన్ని ఖర్ జింఖానా అందజేసింది.

బీసీసీఐ విచారణ ప్రారంభం

పాండ్యా, రాహుల్‌పై బీసీసీఐ విచారణ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రీ వారికి ఫోన్ చేసి మాట్లాడారు. వారిద్దరూ టెలిఫోన్ ద్వారా రాహుల్‌కు వివరణ ఇచ్చారు. విచారణ ప్రారంభమైందని వారితో చెప్పారని, షోకాజ్ నోటీస్‌పై వివరణ తీసుకున్నామని, నివేదికను క్రికెట్ పాలకుల కమిటీకి అప్పగిస్తామని బీసీసీఐలోని అధికారి వివరించారు. బీసీసీఐ విచారణ పూర్తయిందని, తదుపరి దశ అంబుడ్స్‌మన్ నియామకంతో ప్రారంభమవుతుందని ఆ అధికారి వెల్లడించాడు. అంబుడ్స్ మన్‌ను సుప్రీం కోర్టు నియమించాల్సి ఉంటుందని తెలిపారు. యువ క్రికెటర్‌ల కెరీర్ ముగిసేలా చర్యలు ఉండొద్దంటూ సీఓఏ అధినేత వినోద్ రాయ్ సూచిస్తున్నా బీసీసీఐ పట్టించుకోవడం లేదు.



ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా మను



దుబాయ్: ఈఎస్‌పీఎన్ స్టార్ స్పోర్ట్స్ మాజీ సీఈఓ మను సావ్నే ఇంటర్‌నేషనల్ క్రికెట్ కౌన్సిల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా నియామకం అయ్యారు. డేవిడ్ రిచర్డ్ సన్ స్థానంలో సావ్నే కొనసాగుతారు. ప్రపంచ కప్ తరువాత డేవిడ్ పదవి విరమణ చేయనున్నారు. ఇంగ్లాండ్‌లో జరిగే ప్రపంచకప్‌తో రిచర్డ్ సన్ కాంట్రాక్టు ముగుస్తుంది. ఈఎస్‌పీఎన్ స్టార్ స్పోర్ట్స్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా, సింగపూర్ స్పోర్ట్స్ హబ్ సీఈఓగా పని చేశాడు. వచ్చే నెల్లో చేరినా, జులైలో రిచర్డ్ సన్ నుంచి అధికారికంగా పగ్గాలు తీసుకుంటారని ఐసీసీ వివరించింది. ఐసీసీ బోర్డు బలపర్చగా, ఉన్నత స్థాయి కమిటీ చైర్మన్ శశాంక్ మనోహర్, నామినేషన్ కమిటీ ఆమోదించింది. మనోహర్ మాట్లాడుతూ.. 22 ఏళ్ల కమర్షియల్ రంగంలో ఉన్న అనుభవాన్ని ఐసీసీ ప్రగతికి ఉపయోగపడుతుందన్నారు. 17 ఏళ్ల పాటు ఈఎస్‌పీఎస్‌లో పని చేశాడని, దీంతో వార్షిక వృద్ధి రేటు రెండింతలు అయ్యిందని గుర్తు చేశారు.

మలేషియా మాస్టర్ టోర్నీ

2 రౌండ్‌లో సైనా, కశ్యప్, కిదాంబి

కౌలలాంపూర్ : ఒలింపిక్ పతక విజేత సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్, కిదాంబి శ్రీకాంత్‌లు మలేషియా మాస్టర్స్ రెండో రౌండ్‌లో అడుగు పెట్టారు. హాంకాంగ్ క్రీడాకారిణి జోయ్ జువాడెంగ్‌ను 14-21, 21-18, 21-18 పాయింట్ల తేడాతో ఓడించింది. గంట 5 నిమిషాల పాటు ఆట సాగింది. హాంకాంగ్ క్రీడాకారిణి పుయి ఇన్ యిప్‌తో సైనా తలపడనుంది. డెన్మార్క్ క్రీడాకారుడు రస్‌మస్ జెమ్కేను కశ్యప్ 19-21, 21-19, 21-10 తేడాతో ఓడించాడు. కిదాంబి శ్రీకాంత్ హాంకాంగ్ ఆటగాడు ఆంగుస్ కా లంగ్ ఎన్‌జీను 21-17, 21-11 తేడాతో ఓడించాడు. మొదటి రౌండ్‌ను కిదాంబి కేవలం 30 నిమిషాల్లో పూర్తి చేశాడు. ఇండోనేషియా ఆటగాడు ఆంటోనీ సినీసుకాతో రెండో రౌండ్‌లో కశ్యప్ తలపడనున్నాడు. హాంకాంగ్ క్రీడాకారుడు విన్సెంట్ వింగ్ కి వాంగ్‌తో శ్రీకాంత్ ఆడనున్నాడు.



ఉమెన్స్ డబుల్స్‌లో అశ్వినీ పొన్నప్ప, ఎన్ సిక్కి రెడ్డి హాంకాంగ్ జోడిపై 21-16, 22-20 గెలిచారు. వీరిద్దరు ఇండోనేషియా జంటతో తలపడతారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ జెర్రీ చోప్రా, సిక్కి రెడ్డి 19-21, 17-21 పాయింట్ల తేడాతో నెదర్లాండ్ ఆటగాళ్ల చేతిలో ఓడిపోయారు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.